ఏప్రిల్
2014

96

సంపుటి : 8 సంచిక : 12

వెల రు. 10/-

## ఈ సంచికలో........

మార్కెట్ సరుకుగా రాజకీయ నాయకులు: ఫాసిజానికి పునాది ఇక్కడే
ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధే సి.పి.ఎం లక్ష్యం
పట్టణ మధ్యతరగతి ఆలోచనలు - సమాజంపై ప్రభావం
రాజకీయ విలువలకు అర్థాలు మారుస్తున్న కార్పొరేట్ మీడియా
రిలయన్స్ అక్రమాలపై ఊపందుకుంటున్న చర్చ
మితవాద మలుపు తీసుకున్న కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక
తమిళనాడు అస్పృశ్యతా నిర్మూలన సంఘటన పోరాటాలు - సాధించిన విజయాలు
సామ్రాజ్యవాదంపై లెనిన్ సైద్ధాంతిక పోరాటం
విప్లవ స్వభావం
దేశానికి దిశ చూపిన మహా నేత జ్యోతిబసు

**శత జయంతి నివాళి**

# దేశానికి దిశ చూపిన మహా నేత జ్యోతిబసు

**యు. రామకృష్ణ**



భారతదేశంలో ఆయనదొక శకం. ఈ శతాద్ది ఆదర్శనేత. ఏడు దశాబ్దాల ప్రజా జీవితంలో మచ్చలేని వ్యక్తిత్వం. ఉన్నత విలువలకు ప్రతిరూపం. విప్లవ యోధ. మార్క్సిస్టు పార్టీ అగ్రనేత. గొప్ప పరిపాలనాదక్షుడు. ఆయనే పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతి బసు. 23 సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా పనిచేసి రికార్డు నెలకొల్పిన ఆయన.. పరిపాలనలో దేశానికే దిశ చూపారు. ఆయన నేతృత్వంలో చేపట్టిన భూ సంస్కరణలు గ్రామీణ బెంగాల్ స్వరూపాన్ని మార్చివేయడంలో ఎంతగానో ఉపయోగపడ్డాయి. పంచాయతీ రాజ్ సంస్థల అభివృద్ధి కారణంగా అధికార వికేంద్రీకరణ దిగువ స్థాయికి చేరింది. దీనివలన ప్రజలకు హక్కులు లభించడమేగాక, ప్రజాతంత్ర క్రమంలో వారు భాగస్వాములుగా మారారు. ప్రజ్యాస్వామ్యాన్ని ఇంత దిగువస్థాయికి తీసుకువెళ్లడం అంతకు మునుపెన్నడూ జరగలేదు. ఇది జరిగిన దశాబ్దం తరువాత భారత రాజ్యాంగానికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం (73, 74) సవరణలు తెచ్చి ఈ పద్ధతిని దేశమంతా వ్యాపింపచేశారు. మనదేశ లౌకిక ప్రజాతంత్ర స్వభావానికీ, పాలనా యంత్రాంగానికీ జ్యోతి బసు దృఢంగా కట్టుబడ్డారు. ఈ విజయాలను సాధించిన వామపక్ష ప్రభుత్వానికి 23 ఏళ్ల పాటు సారథ్యం వహించిన జ్యోతిబసు శత జయంతి సందర్భంగా ఆయనకు నివాళిగా ఈ వ్యాసం.

జ్యోతిబసు కోల్‌కతాలో ఇప్పుడు 'మహాత్మా గాంధీ మార్గ్'గా మార్చబడిన ఆనాటి 'మారిసన్ రోడ్డు'లో గల ఓ ఇంటిలో 1914 జూలై 8న జన్మించారు. 1930లో జ్యోతిబసు ఎనిమిదో తరగతి చదివేటప్పుడు బెంగాల్‌ల్లో ఉద్రిక్త వాతావరణం ఉండేది. విప్లవ కార్యకలాపాలు ముమ్మరంగా సాగేవి. చిట్టకాంగ్ సాయుధ దాడి, జడ్జీలనూ, మేజిస్ట్రేట్లనూ హత్య చేయడం, అనేకచోట్ల సాయుధ దాడులు చేయడం వంటివెన్నో జరుగుతుండేవి. రాజకీయాలతో సంబంధంలేని జ్యోతిబసు కుటుంబం కూడా వాటి ప్రభావం నుంచి వేరు పడేందుకు వీలు పడేది కాదు. 1930లో గాంధీజీ నిరాహారదీక్ష పూనిన రోజున జ్యోతిబసు కళాశాలకు వెళ్లలేదు. ఆ తర్వాత.. నేడు షహీద్ మీనార్ ఉన్న ప్రదేశంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ సభ రాన్నట్లు తెలియడంతో తన పెద్దనాన్న కుమారుడితో కలిసి వెళ్లాడు. ఆ సభకు ఖద్దరు ధరించి వెళ్లాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. సభకొచ్చిన జనాన్ని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీలతో బాదుతున్నారు. ఆ సందర్భంగా బసుకూ అతడి సోదరుడికీ దెబ్బలు తగిలాయి. అయినప్పటికీ వారు అక్కణ్ణుంచి పారిపోకూడదని నిర్ణయించుకున్నారు. ఖద్దరు ధరించినవారు పారిపోవడం పిరికితనమనిపించింది. ఎందరో విప్లవకారులు వచ్చి తమ పెద్దతల్లిని కలిసి మాట్లాడటం బసు చూశాడు. భర్త చనిపోయాక ఆమె తన ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలతో బసు కుటుంబీకులతోనే కలిసి ఉండేది. ఆమె ఖచ్చితమైన జాతీయవాది. అందువల్లనే ఆమెను కలుసుకునేందుకు విప్లవకారులు వచ్చేవారు.

బసు పెదనాన్న నళినీకాంత్ బసు హైకోర్టు జడ్జిగా ఉద్యోగ విరమణ చేశాక, మచ్యూబజార్ బాంబు కేసు విచారణకై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్‌కు బడ్జిగా నియమించారు. ఈ కేసులో ఉన్నవారంతా దేశానికీ, దేశ స్వాతంత్ర్యానికీ అంకితమైనవారు. ప్రాణాలను సైతం బలివ్వడానికి సిద్ధపడేవారు. ఈ ట్రిబ్యునల్ జడ్జిగా నళినీకాంత్ ఉండటాన్ని బసు తండ్రి పూర్తిగా వ్యతిరేకించారు. బసుకు కూడా ఇది ఏమాత్రం ఇష్టం లేదు. ఓ రోజు బసు తన పెదనాన్నకు ఆకాశరామన్న ఉత్తరం రాశాడు. 'మీరు తీవ్రమైన నేరం చేస్తున్నారు. బెంగాలీ అయుండి కూడా దేశభక్తులను విచారించడానికి ఎలా సాహసించుతున్నారు. మీ ప్రాణం ప్రమాదంలో ఉంది' అని ఆ ఉత్తరంలో రాశాడు. దేశభక్తులకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ఆ ట్రిబ్యునల్‌కు బడ్జిగా పెదనాన్న అంగీకరించకుండా ఉండేందుకు బసు ఈ ప్రయత్నం చేశారు. ఆ విధంగా బసు ఎల్లలు లేని దేశభక్తిని పెంచుకున్నాడు. బసు 1935లో ప్రెసిడెన్సీ కళాశాల నుంచి ఇంగ్లీషు ఆనర్స్‌తో పాసయ్యాడు. తండ్రి కోరికపై బారిష్టరు చదివేందుకు ఇంగ్లండ్ వెళ్లడానికి నిర్ణయమైంది. 1935 చివరిలో లండన్ చేరుకున్నాడు. తొలుత ఐపిఎస్ చదివాడు. పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేదు. దీంతో బారిస్టర్ కావాలన్న యోచనతో చదువు ప్రారంభించాడు.

బసు లండన్ చేరుకునేటప్పటకి యూరప్ ఉద్రిక్త పరిస్థితిలో ఉంది. యూరప్‌లో శరవేగంతో వ్యాపిస్తున్న ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాలు బసును ఆకర్షించాయి. ఆ సమస్యపై వచ్చే పుస్తకాలూ, కరపత్రాలూ చదవడం ప్రారంభించారు. ఆనాడక్కడ భారత స్వాతంత్ర్య వాద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ఉద్దేశించిన 'ఇండియా లీగ్' ద్వారా బసుకు దాని సారథి కృష్ణమీనన్‌తో పరిచయం ఏర్పడింది. హారీ పొలిట్, రజనీ పామీదత్, బెన్ బ్రాడ్లీ వంటి బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీ నాయకులతో బసుకు సంబంధాలు ఏర్పడ్డాయి. ఇండియా లీగ్‌తో బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీకి సన్నిహిత సంబంధాలు ఉండటంతో పరిచయం ఏర్పడింది. బ్రిటన్‌లో భారతీయ విద్యార్థులను సంఘటిత పరచడంలోనూ, ఇండియా లీగును నిర్మించడంలోనూ బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ చాలా కృషి చేసింది. భారత్‌లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటులో సహాయపడేందుకు బెన్ బ్రాడ్లీ దేశానికి పంపించబడ్డారు. బసు తదితరులు లండన్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

1. దేశానికి దిశ చూపిన మహా నేత జ్యోతిబసు - యు. రామకృష్ణ 2
2. మార్కెట్ సరుకుగా రాజకీయ నాయకులు: ఫాసిజానికి పునాది ఇక్కడే - ప్రభాత్ పట్నాయక్ 4
3. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధే సి.పి.ఎం లక్ష్యం - పెనుమల్లి మధు 8
4. పట్టణ మధ్యతరగతి ఆలోచనలు - సమాజంపై ప్రభావం - వి.శ్రీనివాసరావు 10
5. రాజకీయ విలువలకు అర్థాలు మారుస్తున్న కార్పొరేట్ మీడియా - ఎస్. వీరయ్య 17
6. రిలయన్స్ అక్రమాలపై ఊపందుకుంటున్న చర్చ - వెంకటేష్ రామకృష్ణన్ 19
7. మితవాద మలుపు తీసుకున్న కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక - పెనుమల్లి మధు 23
8. తమిళనాడు అస్పృశ్యతా నిర్మూలన సంఘటన పోరాటాలు - సాధించిన విజయాలు - గణేష్ 24
9. సామ్రాజ్యవాదంపై లెనిన్ సైద్ధాంతిక పోరాటం - ఎన్.వి.ఎస్. నాగభూషణ్ 27
10. విప్లవ స్వభావం - డంకన్ హల్లాస్ 32



ఎడిటర్:
**ఎస్. వెంకట్రావు**

ఎడిటోరియల్ బోర్డు:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20


**ఫోన్: ఎడిటోరియల్ 0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail:svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at: cpim.org


# వామపక్ష ప్రాతినిధ్యం

16వ లోక్‌సభకు సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 7 నుండి మే 12 వరకు దేశ చరిత్రలోనే సుధీర్ఘకాలం జరుగనున్న ఎన్నికల్లో 81.45 కోట్ల మంది ఓటర్లు 543 లోక్‌సభ స్థానాలకు ప్రతినిధులను ఎన్నుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికలతోపాటు మన రాష్ట్రంలోని తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ రెండు ప్రాంతాల్లోనూ శాసనసభ ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. మున్సిపల్, మండల, జిల్లాపరిషత్ ఎన్నికల యుద్ధం ముగిసీముగియక ముందే అంతకన్నా పెద్ద ఎన్నికల రణరంగంలోకి మనం దిగాల్సి వచ్చింది.

వామపక్షాలు అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఈ ఎన్నికలను ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు దేశవ్యాపితంగా వామపక్షాలను అప్రధానం చేయడానికి పాలకవర్గాలు, కార్పొరేట్ మీడియా తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నాయి. మరోవైపు వామపక్షాల బలమైన స్థానం బెంగాల్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)పై తీవ్రనిర్బంధం సాగిస్తున్నాయి. కేరళలో కూడా వామపక్ష ఫ్రంట్ ఎక్కువ స్థానాలు గెలుచుకోకుండా చేయడానికి అక్కడి పాలక యుడిఎఫ్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది.

రానున్న ఎన్నికల్లో ఏర్పడితే కాంగ్రెస్ నాయకత్వంలో యుపిఎ 3 ప్రభుత్వం ఏర్పడాలి లేకుంటే మోడీ నాయకత్వంలో ఎన్డీఎ 2 ప్రభుత్వం ఏర్పడాలన్నది పాలక పక్షాల కోరిక. ఎట్టిపరిస్థితుల్లోనూ వామపక్షాల ప్రమేయంగల ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడగూడదని అవి శతదా కోరుకుంటున్నాయి, శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి.

పాలక వర్గాలు వామపక్షాల ప్రాతినిధ్యం గురించి ఎందుకింతగా భయపడుతున్నాయన్నది మనకు తెలియని విషయం కాదు. ప్రపంచం, మన దేశం కూడా ఆర్థిక సంక్షోభంలో వుంది. రానున్న కొద్ది సంవత్సరాల్లో ఈ ఆర్థిక సంక్షోభం నుండి బయటపడే మార్గం కనిపించడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో పెట్టుబడిదారీ వర్గం గరిష్ట లాభాలు తగ్గకుండా వుండాలంటే సంక్షోభ భారం ప్రజలపై వేసి, తమకు లాభాలు తెచ్చిపెట్టే విధానాలు అమలు పరిచే ప్రభుత్వం కేంద్రంలో వుండడం వారికి అవసరం. జిడిపి బాగా అభివృద్ధి చెందుతున్న సమయంలో పాలక వర్గాలకు గరిష్ట లాభాలు సమకూరుస్తూనే ప్రజలకు కొన్ని సంక్షేమ చర్యలు చేపట్టే శక్తి ప్రభుత్వానికి వుంటుంది. కాని సంక్షోభ కాలంలో దానికి - బడా పెట్టుబడిదారుల లాభాలపై పన్నులు పెంచి ప్రజలకు వెసులు బాటు కలిగించడమా లేక ప్రజలపై భారాలు వేసి కార్పొరేట్ రంగం లాభాలు కాపాడ్డమా - ఏదో ఒక మార్గమే వుంటుంది.

కాంగ్రెస్, బిజెపీ రెండో మార్గం అనుసరిస్తుంటే వామపక్షాలు మొదటి మార్గాన్ని కోరుతున్నాయి. దానికోసం పోరాడుతున్నాయి. చట్టసభల్లో వాటి ప్రాతినిధ్యం పెరిగితే, వాటి ప్రమేయంతో ప్రభుత్వాలు ఏర్పడితే ప్రజలకు వుపశమనం కలిగే విధానాల కోసం గతంలో కృషి చేశాయి. భవిష్యత్తులో చేస్తాయి. ఈ లక్ష్యంతోనే కాంగ్రెస్, బిజెపీ కూటములకు వ్యతిరేకంగా కేంద్రంలో ఒక తృతీయ కూటమిని అధికారంలోకి తీసుకురావడానికి వామపక్షలు పాటుపడుతున్నాయి. చట్టసభల్లో వామపక్షాల ప్రాతినిధ్యం ఏమేరకు పెరిగితే వాటి కృషి ఆ మేరకు ఫలిస్తుంది. అందుకే నేడు వామపక్షాల ప్రాతినిధ్యం పెరగడం ఈ దేశంలోని సామాన్య ప్రజానీకానికి అత్యవసరం. ప్రజాతంత్ర శక్తులు, అభ్యుదయ గాముకులు ఈ విషయాన్ని గుర్తించాలి. ఈ ఎన్నికల్లో పార్లమెంటులోనూ, రాష్ట్రశాసన సభల్లోనూ వామపక్షాల ప్రాతినిధ్యం పెంచేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులు శక్తివంచన లేకుండా కృషి చేయాలి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.హెచ్ భవన్ (ప్రజాశక్తి కార్యాలయం),**
**అజామాబాద్, హైదరాబాద్- 20**

ఈ మాసం ముఖ్యాంశం

# మార్కెట్ సరుకుగా రాజకీయ నాయకులు

## ఫాసిజానికి పునాది ఇక్కడే



రచయిత ప్రఖ్యాత మార్క్సిస్టు ఆర్థికవేత్త. ఆర్థిక అంశాలపై అనేక పుస్తకాలు, వ్యాసాలు రాశారు. ఇటీవల ఫ్రంట్‌లైన్ పత్రికలో ప్రభాత్ పట్నాయక్ రాసిన వ్యాసాన్ని దిగువ ఇస్తున్నాం.

**ప్రభాత్ పట్నాయక్**

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి దేశం ద్వారాలు తెరిచాక సదరు ద్రవ్య పెట్టుబడి అవసరాలు తీర్చే ఆర్థిక విధానాలు అనుసరించటం, అమలు చేయటం తప్ప ప్రభుత్వాలకు మరో ప్రత్యామ్నాయం లేని పరిస్థితి ఏర్పడింది. లేని పక్షంలో ద్రవ్య పెట్టుబడి దేశం వదిలి వెళ్లిపోతుంది, తత్పర్యవసానంగా దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోతుంది. ప్రపంచీకరించబడిన ద్రవ్య పెట్టుబడి కనుసన్నల్లో ఉండటమే ప్రభుత్వాల ప్రథమ ప్రాధాన్యతగా మారింది. దీన్నే సరళీకరణ పరిభాషలో 'పెట్టుబడిదారుల నమ్మకాన్ని పొందటం' అని పిలుస్తున్నారు. ఈ విధంగా మార్కెట్ మన్ననలు పొందేందుకు అనుసరించే విధానాలు అన్ని దేశాల్లోనూ ఒకే రకంగా ఉన్నాయి. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు పన్ను రాయితీలు ఇవ్వటం, ద్రవ్య లోటు స్థూలజాతీయోత్పత్తిలో తగిన నిష్పత్తికి మించకుండా ఉండేలా చూడటం, చిన్న పెట్టుబడిదారులను ఛిద్రం చేసి గుత్తపెట్టుబడిదారులకు పెద్ద పీట వేయటం, ప్రభుత్వ ఆస్తులు పెట్టుబడిదారుల పాలు గావించటం, జాతీయ ఉమ్మడి వనరులు, గిరిజన ప్రాంతాల్లో ఉన్న వనరులు కారుచౌకగా కట్టబెట్టడం వంటి విధానాలు అన్ని దేశాల్లోనూ మనకు కనిపిస్తుంటాయి.

ప్రపంచీకరణ సాలెగూడులో చిక్కుకున్న అన్ని రకాల రాజకీయ కూటములూ, వ్యవస్థలూ ఇష్టం ఉన్నా లేకపోయినా ఈ విధానాలనే తలకెత్తుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. ప్రజాభీష్టం మేరకు ఎవరు ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టినా ఈ విధానాలనే కొనసాగిస్తూ వస్తున్నారు. వాస్తవానికి బూర్జువా పార్టీల ప్రణాళికల్లో కొన్ని విషయాల్లో కొద్దిపాటి వ్యత్యాసాలు ఉన్నా మౌలిక ఆర్థిక విధానాల్లో మాత్రం వీసమెత్తు వ్యత్యాసం లేకపోవటాన్ని కూడా మనం గమనించవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే రాజకీయాలు గిరిగీసుకున్నట్లు అయిపోయింది. నానాటికీ తీసికట్టుగా మారుతున్న సామాన్య ప్రజాజీవితాల్లో మార్పు వచ్చే పరిస్థితులు కనిపించటం లేదు. ఈ విధంగా చూసినపుడు నయా–ఉదారవాద ఆర్థిక వ్యవస్థను 'గిరిగీత రాజకీయాల' వ్యవస్థగా వర్ణించవచ్చు. భారతదేశంలో యునైటెడ్ ప్రోగ్రెస్సివ్ అలయన్స్, (యుపిఎ) నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్డీఏ) ఆమ్ ఆద్మీ పార్టీ వంటి పార్టీలు ఎన్నికల తరుణంలో నయా–ఉదారవాద ఆర్థిక విధానాల పట్ల తమ నిబద్ధతను చాటుకోవటాన్ని గమనించవచ్చు.

మౌలిక ఆర్థిక విషయాలపై రాజకీయ పార్టీల మధ్య వ్యత్యాసం లేకపోవడంతో ప్రజలను చేరుకోవడానికి ఇతర మార్గాలు, అంశాలు ఎంచుకుంటున్నారు. ఇందుకుగాను అనేక మార్కెటింగ్ వ్యూహాలు అమలు చేస్తున్నారు. తమను తాము మార్కెట్‌లో అమ్మకానికి పెట్టుకోవటంలో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. ఈ దిశగా వాళ్ల ప్రయత్నాలు అంతకంతకూ విస్తృతమవుతున్నాయి. విదేశీ పౌరసంబంధాల కంపెనీలను సలహాదారులుగా ఏర్పాటు చేసుకోవటం, ఎన్నికల ముందు సర్వేలు నిర్వహించటం, ఆ సర్వేల ద్వారా తమకే ప్రజా మద్దతు ఉందని చెప్పుకోవటం, హెలికాప్టర్లు, ప్రైవేటు విమానాలు అద్దెకు తీసుకుని ఎక్కడ కావాలంటే అక్కడ ఏ సమయంలో కావాలంటే ఆ సమయంలో హాజరు కావటం, మీడియాలో దృష్టిలో పడే విధంగా కంపెనీ ప్రతినిధులతో ఫోజులు ఇవ్వటం వంటి అనేక మార్గాల్లో పోటీపడుతున్నారు.

ఈ విధమైన మార్కెటింగ్ వ్యూహాల ద్వారా... ఇవే విధానాలు తమ ద్వారా అమలు జరిగితే మెరుగైన ఫలితాలు చేకూరతాయనీ, ఈ ఫలితాలు కూడా 'అభివృద్ధి' అన్న ముసుగులోనే వ్యక్తీకరించేందుకు శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నారు. దేశంలో అత్యున్నత పదవికి పోటీపడుతున్న వారు అభివృద్ధి సాధించటంలో తాము మెరుగు అంటే తాము మెరుగు అని ఒకరంటే ఒకరు ఈర్ష్యపడే విధంగా వ్యవహరించటం మొదలైంది. ఉదయం పూట అల్పాహారం కోసం తయారయ్యే ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకునే కంపెనీలు తమ ఉత్పత్తుల్లో ఎంత తక్కువ చక్కెర ఉందో, తక్కువ కొవ్వు ఉందో వివరించుకుంటున్నట్లే తాము అధికారానికి వస్తే ఎంత అభివృద్ధి సాధించగలమో చెప్పుకోవటానికి ఒకరితో ఒకరు పోటీపడుతున్నారు. ఈ ప్రయత్నంలో భారతీయ జనతా పార్టీ ముందంజ వేసింది. తమ సరుకు 'మోదీ'ని 'వికాస పురుషుడు'గా మార్కెట్‌లో నిలబెట్టింది. అటువంటి పరిస్థితుల్లో సాధారణంగా జరుగుతున్నట్లే మిగిలిన పార్టీలు కూడా ఇదే పాట పాడటం మొదలు పెట్టాయి.

ఈ చర్చలో అభివృద్ధి అన్న పదాన్ని కేవలం స్థూల జాతీయోత్పత్తిలో అభివృద్ధి అన్న భావనకే పరిమితం చేశారు. గుజరాత్ రాష్ట్రం సాధించిన స్థూల జాతీయోత్పత్తి ప్రగతి రేటు ఎంత గొప్పదో చెప్పేందుకు బిజెపి దాని భజన పరుల బృందం, ప్రవాస భారత ఆర్థికవేత్తలతో సహా కృషి చేస్తున్నారు. ఇతరులు ఈ వాదనలను తోసిపుచ్చుతున్నారు. ఆ విధంగా పోరాటం కొనసాగుతోంది.

ఇక్కడ కూడా సరుకుల ప్రపంచంలో కనిపించే ధోరణులే వ్యక్తం అవుతున్నాయి.

ప్రత్యర్థి శిబిరంలో అవే తరహా సరుకులు తయారు చేసి మార్కెట్‌లోకి తెచ్చేటపుడు ఈ సరుకుల్లో ఉన్న ప్రత్యేకతలను పరిమాణాల్లో వ్యక్తం చేస్తూ ఉంటారు. అల్పాహారంలో ఇచ్చే ఉత్పత్తులు తయారు చేసే కంపెనీలు తమ ఉత్పత్తుల్లో చక్కెర, కొవ్వు పదార్ధాలు ఎంత మోతా దులో ఉన్నాయో నిక్కచ్చిగా చెప్పగలుగుతారు. అదేవిధంగా అభివృద్ధిపై చర్చ అంకెల్లోకి మారిపోయింది. మోడీ వికాస పురుషుడు అని చెప్పటానికి జరిగే ప్రచారంలో ప్రచారకర్తలు సున్నాకంటే తక్కువ విలువ ఉన్న శాతాలను కూడా పొల్లుపోకుండా ఉపయోగిస్తున్నారు.

**గుజరాత్ - కేరళ : ఒక పోలిక**

గుజరాత్, కేరళ రాష్ట్రాల్లో జరిగిన అభివృద్ధిని పోల్చి చూద్దాం. 2004-2005, 2011-2012 మధ్య కాలంలో గుజరాత్ సగటున 8.19 శాతం చొప్పున వృద్ధి రేటు సాధించగా కేరళ 7.91 శాతం వృద్ధి రేటు సాధించింది. కానీ అంబానీ, టాటాలను మచ్చిక చేసుకోవటానికి కేరళ ప్రభుత్వం పరిధి దాటి వ్యవహరించలేదు. కేరళ మానవాభివృద్ధి సూచికల్లో గుజరాత్ కంటే ఎంతో ముందంజలో ఉన్నదన్నది నిర్వివాదాంశం. అయినప్పటికీ కేరళ ప్రభుత్వం తన నిధుల్లో గణనీయమైన భాగం రైతాంగ రుణాలు మాఫీ చేయటం వంటి సంక్షేమ పథకాలపై వెచ్చించింది. కేంద్రంలో యుపిఎ ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని ప్రకటించటానికి చాలా కాలం ముందే కేరళ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసింది. అంతేకాదు, 60 శాతం ప్రజలకు ప్రయోజనం కలిగించే ఆరోగ్య బీమా పథకానికి పెద్దఎత్తున నిధులు వెచ్చించింది కేరళ ప్రభుత్వం. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన అధికారంలో ఉన్న కాలంలో కార్మికుల సగటు దినసరి వేతనాలు 70 రూపాయల నుండి 200 రూపాయలకు పెరిగాయి. వామపక్ష ప్రభుత్వాల కార్మిక పక్షపాతం ఈ నిర్ణయాల్లో, ఆ ప్రభుత్వాలు ఎంచుకున్న ప్రాధాన్యతల్లో స్పష్టమవుతోంది.

కానీ కేరళ సాధించిన అభివృద్ధి, ఫలాలు మనం చూస్తున్న 'అభివృద్ధిపై చర్చ'లో ఎక్కడా కనిపించవు. సందేహాస్పదమైన గుజరాత్ అభివృద్ధి నమూనాలో చర్చంతా దీనిచుట్టూనే జరుగుతోంది. ఎన్నికలకు ముందు బిజెపి నాయకత్వం ముందుకు తెచ్చిన 'అభివృద్ధి' గురించిన చర్చ నిజానికి ప్రజల అభివృద్ధి గురించిన చర్చ కాదు. ప్రజలు పౌష్టికాహార లోపంతో ఉన్నారా, శిశుమరణాలు ఎక్కువగా ఉన్నాయా, బాలింతల మరణాలు ఎక్కువగా ఉన్నాయా అన్న విషయాలను పట్టించుకోవటం లేదు.

> ❝ 'అభివృద్ధి'పై ప్రస్తుతం జరుగుతున్న చర్చ ఫాసిస్టు ధోరణులతో కూడుకుని ఉన్నది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వంటి ఫాసిస్టు శక్తుల నుండి వారి ప్రయోజనాల కోసం పుట్టుకొచ్చిన ఈ తరహా ఫాసిస్టు ధోరణులతో కూడిన చర్చకు తెరతీయటం పెద్దగా ఆశ్చర్యం కలిగించే పరిణామం ఏమీ కాదు. ❞

సరుకుగా మార్చబడిన మోడీ ముందుకు తెస్తున్న చర్చ కేవలం మోడీని సరుకుగా మార్చిన విధానాల నేపథ్యంలో అభివృద్ధే తప్ప ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కాదు.

రాజకీయ నాయకులను సరుకులుగా ప్రస్తావించటం, వారి దృష్టిలో అభివృద్ధి అంటే వృద్ధి రేట్లు మాత్రమే అని చెప్పినంత మాత్రాన మన ముందున్న ఎన్నికలను తక్కువ అంచనా వేస్తున్నట్లు కాదు. దీనికి భిన్నంగా రాజకీయ నాయకులే సరుకుగా ప్రజల ముందు ఎన్నికల మార్కెట్‌లోకి రావటం అన్నది మరింత నిగూఢమైన కుట్రపూరితమైన కొత్త ధోరణిని ముందుకు తెస్తోంది. ఈ ధోరణి ఫాసిజం వైపు మళ్లేదిగా ఉంది. 'అభివృద్ధి'పై ప్రస్తుతం జరుగుతున్న చర్చ ఫాసిస్టు ధోరణులతో కూడుకుని ఉన్నది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వంటి ఫాసిస్టు శక్తుల నుండి వారి ప్రయోజనాల కోసం పుట్టుకొచ్చిన ఈ తరహా ఫాసిస్టు ధోరణులతో కూడిన చర్చకు తెరతీయటం పెద్దగా ఆశ్చర్యం కలిగించే పరిణామం ఏమీ కాదు.

**భారంగా మారనున్న పరిణామం**

ఈ ప్రమాదకర ధోరణి తలెత్తటానికి దిగువ కారణాలు దోహదం చేస్తున్నాయి. రాజకీయ నాయకులే సరుకుగా మారటం అన్నది ఖరీదైన వ్యవహారం. రానున్న కాలంలో ఇది మరింత భారంగా మారనుంది. ఉదాహరణకు మోడీ దేశమంతా హెలికాప్టర్లలోనూ ప్రత్యేక విమానాల్లోనూ పర్యటిస్తున్నారు. దానికిగాను భారీమొత్తం ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఈ ఖర్చంతా పెద్ద పెద్ద కంపెనీలు, ద్రవ్య పెట్టుబడి సంస్థలు భరిస్తాయి. ఈ ఖర్చంతా వాళ్లు ఎందుకు భరిస్తారు? ఎందుకంటే ఆ విధంగా ఎన్నికైన వాళ్ల ద్వారా ఆయా కంపెనీలు, ద్రవ్య పెట్టుబడి సంస్థలే పరిపాలించాలని కోరుకుంటున్నాయి కాబట్టి ఈ ఖర్చంతా వాళ్లే భరిస్తారు. ఈ విధంగా చూసినపుడు రాజకీయ నాయకులను ప్రజలకు అమ్మటం అంటే ఆయా పార్టీలకు నాయకుల పక్షాన నిలబడుతున్న కంపెనీలు సదరు నాయకులు, రాజకీయ పక్షాల ద్వారా ప్రజలపై ప్రత్యక్షంగా పరిపాలించటానికి సిద్ధం కావటం తప్ప మరోటి కాదు. బెన్నెటో ముస్సోలిని ఇచ్చిన నిర్వచనం ప్రకారమే ఫాసిజం అంటే "రాజ్యాధికారం, కంపెనీల అధికారంతో మమేకం కావటం". ఉన్నట్లుండి మోడీ జాతీయ నాయకుడి స్థాయికి ఎదగటం అంటే ద్రవ్య పెట్టుబడి, కార్పొరేట్ రంగం, వారి నియంత్రణలో ఉన్న మీడియా బూర్జువా రాజకీయనాయకులందరిలో మోడీని సమర్థించాలని నిర్ణయించుకోవటమే.

మరో కోణం నుండి ఈ పరిణామాన్ని చూద్దాం. దేశం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేటి పరిస్థితుల్లో ప్రజల్లో ఉన్న అసంతృప్తి కార్పొరేట్, ద్రవ్య పెట్టుబడికి వ్యతిరేకంగా ముందు

**'మార్క్సిస్టు'కు**

**మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

> **“ మోడీని బిజెపిలో సర్వోన్నత స్థాయికి నెట్టడం లో ఆరెస్సెస్ ప్రముఖ పాత్ర పోషించింది. మోడీ వెనక కార్పొరేట్ రంగం నిలబడి ఉందన్న విషయం ఆరెస్సెస్‌కు బాగా తెలుసు. ఈ ప్రయత్నం ద్వారా ఆరెస్సెస్ సాంప్రదాయకంగా అనుసరించే మతోన్మాద ఫాసిస్టు విధానాల నుండి నిఖార్సయిన ఫాసిస్టు విధానాల దశకు చేరుకొంటోంది. ”**

కొచ్చే పరిస్థితులు ఉన్నపుడు (ఇప్పటి వరకు నయా–ఉదారవాద విధానాల ద్వారా పెద్దఎత్తున ప్రయోజనాలు పొందిన పట్టణ మధ్యతరగతి కూడా ప్రస్తుతం పెద్దఎత్తున అసంతృప్తికి లోనై ఉంది) ఈ కార్పొరేట్ రంగం, ద్రవ్య పెట్టుబడి ప్రతినిధులు ఏ వ్యక్తిద్వారా తాము అధికారం చలాయించటం తేలికగా ఉంటుందో అటువంటి వ్యక్తిని తిరుగులేని నాయకుడిగా ముందుకు తెస్తున్నాయి. మోడీని మార్కెట్‌లోకి దించటం ఈ శక్తులకు ఎన్నిరకాలుగా ప్రయోజనం కలిగి స్తుందో చూద్దాం: యుపిఎ ప్రభుత్వ వైఫల్యాల గురించి మోడీ ప్రస్తావించటం అంటే (యుపిఎ హయాంలో జరిగిన అవినీతిని ఆప్ పార్టీ ప్రస్తావించినట్లుగా కూడా ప్రస్తావించటం లేదు)ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు నయా–ఉదారవాదం అమలు కారణం కాదు, ఆ విధానాలు సరిగ్గా అమలు జరపకపోవటమే కారణమన్న వాదనను ముందుకు తేవటమే. ఈ ప్రచారం నయా–ఉదారవాదపు దుష్ఫలితాల గురించిన చర్చపై ప్రజల దృష్టి మళ్లించకుండా ఉండటానికి ఉపయోగపడుతుంది.

రెండో అంశం: మోడీ సాధించిన అభివృద్ధి మోడీ ప్రభుత్వానికి ప్రైవేటు పెట్టుబడిదారులకు మధ్య ఉన్న సఖ్యత వల్లనే సాధ్యమైంది అన్న వాదన ముందుకు తేవటం అంటే జాతీయ స్థాయిలో సైతం అటువంటి సఖ్యత ఉండాలన్న భావనను ముందుకు తేవటమే. అంటే ముస్సోలిని ప్రతిపాదించిన తరహాలో ఫాసిజాన్ని తెరమీదకు తేవటమే. దీనికి మరో కోణం మోడీ నేతృత్వంలో గుజరాత్ ప్రభుత్వం కార్మిక హక్కుల కాలరాయటానికి పెట్టింది పేరు. అందువల్ల మోడీ తరహా అభివృద్ధిని ప్రచారం చేయటం అంటే కార్మిక హక్కులు కాలరాసే ప్రయత్నాలను సమర్థించటమే తప్ప మరోటి కాదు.

తదుపరి పరిణామం: అభివృద్ధి భావనను ముందుకు తేవటంలో కార్పొరేట్ రంగం, ప్రభుత్వం మధ్య సఖ్యత పెంచటంతో పాటు అభివృద్ధి భావనలో ఉన్న ఇతర అన్ని రకాల కోణాలనూ – అంటే అధికార వికేంద్రీకరణ, స్థానిక సంస్థలకు నిధులు కేటాయించటం, ఆదివాసీ ప్రజల భూమి హక్కులను సంస్థాగతం చేయటం – వంటి అనేక కోణాలను వెనక్కు నెట్టటమే. ద్రవ్య పెట్టుబడి, కార్పొరేట్ రంగం నేడు ముందుకు తెస్తున్న అభివృద్ధి అన్న భావన వెనక, ఈ అభివృద్ధి కేవలం మోడీ నేతృత్వంలోనే సాధ్యం అవుతుంది అన్న ఢంకా బజాయింపుల వెనక దాగి ఉన్న ధోరణి ఫాసిస్టు ధోరణి తప్ప మరోటి కాదు.

మోడీని బిజెపిలో సర్వోన్నత స్థాయికి నెట్టడంలో ఆరెస్సెస్ ప్రముఖ పాత్ర పోషించింది. మోడీ వెనక కార్పొరేట్ రంగం నిలబడి ఉందన్న విషయం ఆరెస్సెస్‌కు బాగా తెలుసు. ఈ ప్రయత్నం ద్వారా ఆరెస్సెస్ సాంప్రదాయకంగా అనుసరించే మతోన్మాద ఫాసిస్టు విధానాల నుండి నిఖార్సయిన ఫాసిస్టు విధానాల దశకు చేరుకొంటోంది. ఈ ప్రయత్నంలో మతోన్మాద ఫాసిస్టు లక్ష్యాల నుండి ఆరెస్సెస్ వైదొలగలేదు. ఇంకా ఆ విధానాలను పెంచి పోషిస్తూనే ఉంది. ఈ విషయం తరచూ ప్రజల దృష్టి నుండి తప్పించుకొంటోంది. మోడీ అధికారానికి వస్తే మైనారిటీలకు, ప్రత్యేకించి ముస్లిం మైనారిటీలకు ఎటువంటి ప్రమాదం వాటిల్లనున్నది అన్న కోణం నుండే చూస్తున్నాం తప్ప సరైన దృక్పథం నుండి ఆ అంశాన్ని పరిశీలించటం లేదు. ఈ ప్రమాదంతోపాటు మోడీ అధికారానికి రావటం అంటే కార్పొరేట్ రంగం ప్రత్యక్షంగా ప్రభుత్వ పగ్గాలు చేపట్టడమే. కార్మికుల హక్కులను ఛిద్రం చేయటమే. కార్మికవర్గాన్ని దోపిడీ చేసే విధానాలను మరింత వేగంగా తీవ్రంగా అమలు చేయటమే.

మనముందున్న పరిస్థితి 1930 నాటి పరిస్థితులకు ఆధునిక రూపమే. ఉదాహరణకు హిట్లర్ ఫాసిస్టు ఉద్యమం పెటీ బూర్జువా ఉద్యమంగా మొదలైంది. గుత్తపెట్టుబడి వర్గంలోని ఒక సెక్షన్ హిట్లర్‌కు లోపాయికారీగా మద్దతు ఇచ్చినప్పటికీ అది మితవాద తీవ్రవాద ధోరణినే అనుసరించింది. హిట్లర్ వైఖరి కేవలం వామపక్ష వ్యతిరేకత, యూదు వ్యతిరేక వైఖరి మాత్రమే కాదు. గుత్తపెట్టుబడిదారీ వ్యతిరేక వైఖరి కూడా. నాజీ పార్టీ అధికారానికి వచ్చిన తర్వాత మాత్రమే గుత్తపెట్టుబడిదారీ వర్గంతో సంపూర్ణంగా మమేకం అయ్యింది. ఈ క్రమంలో నాజీ పార్టీకి పునాదిగా ఉన్న పెటీ బూర్జువా వర్గాన్ని కూడా కాలదన్నుకొన్నది. పెటీ బూర్జువావర్గం ప్రతినిధి ఎర్నెస్ట్ రోమ్‌ని 1934 నాటి ఒక సుదీర్ఘమైన కాళరాత్రిలో కర్కశంగా హత్య చేసింది. ఆరెస్సెస్ కూడా మౌలికంగా పెటీ బూర్జువావర్గంపై ఆధారపడ్డ ఉద్యమం మాత్రమే. అధికారాన్ని అనుభవించటం కోసం గుత్తపెట్టుబడిదారీ వర్గంతో మిలాఖత్ అయ్యింది. ఆ విధంగా సాంప్రదాయ ఫాసిస్టు శక్తుల తరహాలో అధికారానికి వచ్చిన తర్వాత గుత్తపెట్టుబడిదారీ వర్గంతో మిలాఖత్ కావటం కాక అంతకు ముందే అందుకు సిద్ధమైంది.

**అభివృద్ధిపై ప్రత్యామ్నాయ చర్చ**

ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. మోడీ ముందుకు తెచ్చిన అభివృద్ధిపై చర్చ ఫాసిస్టు దృక్పథం అయితే మరి ప్రజాస్వామిక వ్యవస్థలో అభివృద్ధి గురించిన ప్రత్యామ్నాయ దృక్పథాన్ని ఎలా నిర్వచించాలి? అన్న ప్రశ్న తలెత్తుతుంది.

ప్రజలు సమిష్టి రాజకీయ జోక్యం ద్వారా తమ జీవితాలను సరిదిద్దుకోగలగటం ప్రజాస్వామిక వ్యవస్థ సారాంశం. అయితే ప్రజలకున్న అటువంటి శక్తిని ఆయా సమాజాల్లో ఉన్న ఆర్థిక వ్యవస్థలు నియంత్రిస్తాయి. ఆ ప్రజాస్వామిక ప్రయత్నాలకు పరిమితులు విధిస్తాయి. నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను అటువంటి పరిమితుల నుండి బయటకు తెచ్చి ప్రజలకు ఉపయోగపడేలా మార్చాలంటే సదరు సమాజంలోని ఆర్థిక వ్యవస్థను మార్చాలి. ఇందుకోసం చైతన్యవంతమైన కృషి జరగాలి. తాత్విక పరిభాషలో చెప్పాలంటే ఈ మార్పును సాధించే శక్తి ద్వారా ఈ ప్రయత్నం జరగాలి. సాధనా శక్తి అంటే ఏ ప్రయత్నం ద్వారా ప్రజలు తమ సమిష్టి రాజకీయ జోక్యం ద్వారా తమ జీవితాలను సరిద్దుకోగలుగుతారో అటువంటి శక్తి. అభివృద్ధి సాధన శక్తులు ప్రజల హస్తగతం కావటమే ప్రజాస్వామ్యంలో అభివృద్ధికి పరమార్థం.

ఇదే విషయాన్ని మరోరకంగా చెప్పేందుకు ప్రయత్నిద్దాం. అభివృద్ధి ఉత్పత్తి కోణంలో అయితే సదరు ఉత్పత్తి కేవలం వస్తూత్పత్తి మాత్రమే కాదు. సామాజిక సంబంధాల రాత్పత్తిగా మారాలి. ఈ సామాజిక సంబంధాల ఉత్పత్తి ద్వారా ప్రజలు తమ జీవితాలను తాము ప్రభావితం చేసుకునే సాధనాలను

స్వంతం చేసుకోగలగాలి. కారల్ మార్క్స్ తత్వశాస్త్ర దారిద్ర్యం అన్న తన గ్రంథంలో 'హత్పత్తి' అన్న పదాన్ని ఈ అర్థంలోనే వాడారు. 'అన్ని ఉత్పత్తి సాధనాల్లోకి అత్యంత విప్లవాత్మకమైనది కార్మికవర్గమే' అంటారు ఆయన. పెట్టుబడిదారీ విధానం నేపథ్యంలోనే ఆయన కార్మికవర్గం గురించి ప్రస్తావిస్తున్నారు అనడంలో సందేహం లేదు. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్వసమాజపు లక్షణాలను కూడా కలిగి ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికవర్గం అంటే కేవలం పారిశ్రామిక కార్మికవర్గం మాత్రమే కాదు. మొత్తం శ్రామిక వర్గాన్ని మనం కార్మికవర్గంగా పరిగణించాల్సి ఉంటుంది. ఇక్కడ ఉత్పత్తి అభివృద్ధి అంటే మార్క్స్ ఈ శ్రామికవర్గాన్ని ఉత్పత్తి చేయటంలో అభివృద్ధి అన్న అర్థంలోనే మాట్లాడుతున్నారు.

శ్రామిక ప్రజలు అటువంటి సాధనా శక్తిని సమకూర్చుకోవటం అంటే వారు కనీస జీవన ప్రమాణాలు అందుకోగల స్థితి ఉండాలి. 1943లో సంభవించిన బెంగాల్ కరువు గురించి ప్రసిద్ధ బెంగాలీ నవలా రచయిత మానిక్ బందోపాధ్యాయ రాసిన కథలో ఈ విధంగా ప్రశ్నిస్తారు: ఆకలితో చనిపోతున్న వాళు దుకాణాల్లో కనిపిస్తున్న ఆహారపదార్థాలు లాక్కొని ఎందుకు తమ కడుపులు నింపుకోవటం లేదు? అని ప్రశ్నిస్తారు. కనీసం కళ్ల ముందు కనిపిస్తున్న ఆహార ధాన్యాల గోదాములపై దాడి చేసి తమ ఆకలి తీర్చుకోవచ్చున్న ఆలోచన కూడా లేనంత ఘోరకలికి లోనయ్యారు అని ఈ ప్రశ్నకు ఆయనే సమాధానం ఇస్తారు. అంటే తమ జీవితాలను శాసించే సాధన శక్తిని సమకూర్చుకోవాలన్నా ప్రజలకు కనీస శక్తి అవసరం. ఆ విధంగా చూసినపుడు ప్రజలకు నిర్దిష్ట వస్తువులు అందించటం అటువంటి శక్తి సముపార్జనలో కీలకమైన అంశం. ప్రజలకు అటువంటి శక్తి సముపార్జన దిశగా అభివృద్ధి సాధించటం అంటే అటువంటి వస్తువులు విస్తృతమైన ప్రజానీకానికి అందుబాటులోకి తేగలిగే అభివృద్ధిని సాధించటం అని చెప్పుకోవచ్చు.

అయితే ఈ వస్తువులు ప్రజలకు అవసరమైన సాధన శక్తి సముపార్జనలో ఆయుధాలే. ఉదాహరణకు కరుణామయుడైన నియంత పరిపాలనలో ఆయన ఆ దేశాల మేరకు ప్రజలందరికీ కడుపు నిండా తిండి దొరుకుతుందనుకోండి, అయినప్పటికీ దాన్ని అభివృద్ధి అని చెప్పలేము. ఎందుకంటే ఈ ప్రయత్నంలో ప్రజలను సశక్తులను చేసే సాధనాలు లేవు. అంటే కేవలం ఉత్పత్తి పెరిగినంత మాత్రాన సరిపోదు. ఈ ఉత్పత్తి ఫలాలు ప్రజలందరికీ

**❝ భారతదేశంలో సాంప్రదాయ వామపక్ష శక్తుల అవగాహనలో ప్రజలను సాధికారవంతులను చేసే అన్ని ప్రయత్నాల్లోనూ ప్రజల ప్రత్యక్ష జోక్యం, నిర్ణయాత్మక పాత్ర విడదీయరానివిగా ఉంటాయి. కానీ నేడు మన ముందు ప్రవేశపెట్టబడిన అభివృద్ధిపై చర్చలో ఈ కోణం కనుమరుగైంది. ప్రజలను సాధికారవంతులను చేసే చర్చకు బదులుగా ఫాసిస్టు ధోరణులు తలెత్తటానికి అవసరమైన రీతిలో కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడి శక్తులు ముందుకు తెచ్చిన అభివృద్ధి పై చర్చలో దేశం తలమునకలై ఉంది. ❞**



పంపిణీ చేసినంత మాత్రాన కూడా అసలు లక్ష్యం నెరవేరదు. అన్నింటికంటే ముఖ్యమైనదేమిటంటే ఈ ప్రయత్నం మొత్తానికి ప్రజలే నిర్మాతలు కావాలి. ఈ పరిణామాలు ప్రజల నాయకత్వంలోనే జరగాలి. ప్రజల ప్రత్యక్ష జోక్యం ద్వారా ఆకలి నుండి బయట పడగలిగితే ఈ ఫలితాలు దీర్ఘకాలం కొనసాగుతాయి. అంతేకానీ 'మంచి పనులు చేసే వాళ్ల'తో ఈ ఫలితాలు అందుబాటులోకి వచ్చినా అవి తాత్కాలికమే తప్ప శాశ్వత స్వభావాన్ని కలిగి ఉండవు. అసలు ఏమీ మంచి చేయని సామాజిక పునర్నిర్మాణం కంటే ఎంతో కొంత మంచి చేసే సామాజిక పునర్నిర్మాణం ఎంతో మెరుగైంది. అయితే ఇదే అభివృద్ధి అని భావించరాదు.

కార్మికవర్గం ఇటువంటి మార్పుకు సాధన శక్తి అని వామపక్షం చెప్తోంది. నిధులు, నిర్ణయాధికారాలు ప్రజలెన్నుకున్న స్థానిక సంస్థలకు బదలాయించటాన్ని ఈ లక్ష్యంతోనే వామపక్ష పార్టీలు సమర్థిస్తూ వచ్చాయి. కేవలం బదలాయించినంత మాత్రాన ప్రజలకు అధికారం వస్తుందన్న వాదనకు అర్థం లేదు. ఈ బదలాయింపుతో పాటు అవసరమైన వ్యవస్థాగత మార్పులు రాకపోతే ఇటువంటి బదలాయింపులు అప్పటికీ సమాజంలో ఉనికిలో ఉన్న అధికార వ్యవస్థను మరింత సంఘటితం చేయటానికి, ఘనీభవింపచేయటానికి దారి తీస్తుంది తప్ప ప్రజలను సశక్తిమంతులను చేయటానికి ఉపయోగపడదు. ఈ కోణం గురించి లోతుగా అవగాహన కలిగినందునే ఇఎంఎస్ నంబూద్రిపాద్ కేరళ అనుభవాల నేపథ్యంలో అటువంటి బదలాయింపుతో పాటు ఈ బదలాయింపు నిజ లక్ష్యాలు అమలు చేసుకోగలిగే విస్తృత ప్రజా ఉద్యమాలు రావాలని పిలుపునిచ్చాడు. ఈ రెండింటి సమ్మేళనంతోనే ప్రజలను సాధికారవంతులను చేయటం సాధ్యం అని విశ్వసించాడు నంబూద్రిపాద్. ఏ మేరకు కేరళ, ఇతర రాష్ట్రాల్లో ఈ పరిణా మాలు చోటు చేసుకుంటున్నాయీ అన్నది వేరే సమస్య. భారతదేశంలో సాంప్రదాయ వామపక్ష శక్తుల అవగాహనలో ప్రజలను సాధికారవంతు లను చేసే అన్ని ప్రయత్నాల్లోనూ ప్రజల ప్రత్యక్ష జోక్యం, నిర్ణయాత్మక పాత్ర విడదీయరానివిగా ఉంటాయి. కానీ నేడు మన ముందు ప్రవేశపెట్టబడిన అభివృద్ధిపై చర్చలో ఈ కోణం కనుమరుగైంది. ప్రజలను సాధికారవంతులను చేసే చర్చకు బదులుగా ఫాసిస్టు ధోరణులు తలెత్తటానికి అవసరమైన రీతిలో కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడి శక్తులు ముందుకు తెచ్చిన అభివృద్ధి పై చర్చలో దేశం తలమునకలై ఉంది. తస్మాత్ జాగ్రత్త!

**(అనువాదం: కొండూరు వీరయ్య)**

**పార్టీ పంథా**

# ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధే సి.పి.ఎం లక్ష్యం





రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ కార్యదర్శి.

**పెనుమల్లి మధు**

రాష్ట్రం రెండుగా విడిపోయిన ఈ పరిస్థి తుల్లో రెండు రాష్ట్రాల పునర్నిర్మాణం గురించే ఇప్పుడు ప్రజలంతా ఆలోచిస్తున్నారు. సీమాంధ్ర ప్రజలు ఈ విభజన వల్ల కలిగిన ఆవేదన నుండి తేరుకుని అభివృద్ధి ఎలా సాధించాలి? ఏ విధానాలు తోడ్పడుతాయి? ఎవరు చేయగలుగుతారు? అని ఆలోచిస్తున్నారు. శీఘ్రగతిన అభివృద్ధిని సాధించడం పాలకులకు ప్రధాన సవాల్. సమగ్రాభివృద్ధికి మన ప్రాంతంలో ఉన్న వనరులు ఏమిటి? నిధులు ఎలా రాబట్టాలి? వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగం, విద్యుచ్ఛక్తి, రహదారులు, పాడిపరిశ్రమ, కోళ్ళపరిశ్రమ, మత్స్య పరిశ్రమ, హార్టీకల్చర్ మొదలగు రంగాల్లో అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి కార్యాచరణకు పూనుకుంటేనే రాష్ట్రం ముందుకెళుతుంది. ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

### మౌలిక వసతుల కల్పన

పైన పేర్కొన్న అన్ని రంగాల అభివృద్ధికి మౌలిక వసతుల కల్పన చాలా కీలకం. రహదారులు, విద్యుత్, ఓడరేవులు, విద్యా–వైద్యం, నీటి వసతులు, రైల్వే, విమానయానం తదితర రంగాల్లో ప్రధానంగా ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాలి. ప్రభుత్వరంగం అలా అభివృద్ధి అయితేనే ప్రయివేటు పెట్టుబడులు వస్తాయి. హైదరాబాదు అభివృద్ధి అయ్యిందంటే ప్రభుత్వరంగంలో బిహెచ్ఇఎల్, హెచ్ఎంటీ, ఇసిఐఎల్, ఐడిపిఎల్ లాంటి సంస్థలు తొలుత ఏర్పాటు చేయడం ప్రధాన కారణం. దానికి తోడు రక్షణ, పరిశోధనా సంస్థలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, విశ్వవిద్యాలయాలు, ఐఐటి, ఐఐఎంలు తోడయ్యాయి. అందువల్లే మెట్రోపాలిటన్ నగరంగా అనేక మందికి ఉపాధి అవకాశాలకు వీలుగా అభివృద్ధి అయ్యింది.

సీమాంధ్ర ప్రాంతంలో వికేంద్రీకరణ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలి. హైదరాబాదులాగా అన్నీ ఒకే చోట కేంద్రీకరించడం కాక వివిధ ప్రాంతాల్లో విస్తరించేలా ప్రణాళిక రూపొందించాలి. ఇచ్ఛాపురం నుండి తడ వరకు 972 కిలోమీటర్ల పొడవున సముద్రతీర ప్రాంతం ఆంధ్రరాష్ట్రానికి మంచి వనరుగా ఉన్నది. ప్రస్తుతం ఉన్న విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, కృష్ణపట్నం ఓడరేవులకు అదనంగా మచిలీపట్నం, నిజాంపట్నం, రామాయపట్నం, దుగరాజుపట్నం ఓడరేవులను నిర్మించగలిగితే రవాణా సౌకర్యం పెద్ద ఎత్తున చౌకగా విస్తరిస్తుంది. వీటికి అనుసంధానంగా రోడ్లు, రవాణా సౌకర్యం కల్పించాలి. తద్వారా తీర ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు సౌలభ్యం కలుగుతుంది.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధ వృత్తులు పాడి, కోళ్లు, మత్స్య పరిశ్రమలు అభివృద్ధి కావాలంటే డొంకలు, కాలువ కట్టలు, కాలిదార్లు లాంటి అనేక చిన్నచిన్న రోడ్లు విస్తరణ, నిర్మాణం శరవేగంగా జరగాలి. రోడ్డు పక్కనున్న భూముల రేట్లు ఎక్కువ అయినందువల్ల అంత పెట్టుబడులు పెట్టి పై వృత్తులు అభివృద్ధి చేయడం సాధ్యం కాదు. విస్తారంగా చిన్నచిన్న రోడ్లు వేయగలిగితే, విద్యుత్ సౌకర్యం కలిగిస్తే పై పరిశ్రమలు బాగా పెరిగి చాలా మందికి ఉపాధి అవకాశం కలుగుతుంది. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలను భాగస్వాములను చేయాలి. అవినీతిని అరికట్టడం అప్పుడే సాధ్యమవుతుంది.

### వ్యవసాయంలో పురోగతి

మన రైతు అప్పుల సుడిగుండంలో చిక్కుకుని అప్పులతోనే చనిపోతున్నాడు. గడిచిన 25 యేళ్లుగా ఈ పరిస్థితుల్లో మార్పు లేదు. ఇంతకు ముందు సన్నకారు, చిన్నకారు రైతులకూ, మధ్యతరగతి రైతాంగానికీ ప్రభుత్వం మద్దతిచ్చి సంక్షోభంలోకి కొట్టుకుపోకుండా సహకరించే విధానాన్ని అమలు చేస్తూ వచ్చింది. విత్తనాల సబ్సిడీ, ఎరువుల సబ్సిడీ, ఆధునిక వ్యవసాయ పద్ధతులకు సబ్సిడీ, వీటన్నింటికీ తోడు పరపతి సౌకర్యం గ్యారెంటీగా అందించే విధానం కొనసాగుతూ వచ్చింది. గ్లోబలైజేషన్ విధానాల వల్ల వీటన్నింటినీ నామ్‌కేవాస్తే చేశారు. మద్దతు తగ్గినందువల్లే ఈ రోజు ఈ ఆత్మహత్యలు సంభవిస్తున్నాయి. అందుకని చిన్న ఉత్పత్తిదారులందరికీ వ్యవసాయంలో మద్దతును పునరుద్ధరించాలి. ప్రత్యేకంగా పరపతి సౌకర్యం అందించాలి. పురుగుమందులు, విత్తనాలు కల్తీమయమయ్యాయి. రైతాంగానికి రక్షణ కల్పించడానికి వీలుగా కల్తీ నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. మార్కెట్ సౌకర్యం, మద్దతు ధరలు, గ్రామాల్లో గిడ్డంగులు, కోల్డ్‌స్టోరేజ్ సౌకర్యం కల్పించాలి. డెల్టా ఆధునీకరణలో భాగంగా పంటకాలువలు, మురుగుకాల్వాలు, వంతెలు, రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. కౌలురైతులకు రుణ సౌకర్యం కల్పించి వడ్డీవ్యాపారుల కబంధ హస్తాల నుండి రక్షణ కల్పించాలి. పంటలకు గిట్టుబాటు ధరను కల్పించి మొత్తం వ్యవసాయంలో ప్రభుత్వమే ప్రధాన బాధ్యత వహించే విధంగా గతంలో అనుసరించిన విధానాలను పునరుద్ధరించాలి. ఆంతరంగిక మార్కెట్ సృష్టించడానికి ఈ విధా

నాలు తోడ్పడతాయి. దేశీయ అవసరాలు పోను మిగిలిన ఉత్పత్తులనే ఎగుమతి చేసేలా ప్రోత్స హించాలి.

**పుష్కలంగా సాగునీటి సదుపాయం**

నదుల రాష్ట్రంగా పేరొందిన ఆంధ్ర ప్రదేశ్‌లో ఇప్పటికీ అనేక ప్రాజెక్టులు పూర్తికాక పంటలకు అందాల్సిన నదీజలాలు సముద్రం పాలవుతున్నాయి. సగంలో ఆగిపోయిన వెలి గొండ, హంద్రీనీవా, గాలేరు– నగరి, తెలుగు గంగ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. నీటి వసతిలేని కోటి ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలి. రాయలసీమ ప్రాంతానికి తోడు, కోస్తా ఆంధ్రలోని మెట్ట ప్రాంతాలకు దోహదపడే చెరువులు, కుంటల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలి. పెద్ద పెద్ద ప్రాజెక్టుల నిర్మాణం వల్ల చిన్ననీటి వనరులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఆదినుండి రైతులను ఆదుకున్న ఈ చిన్ననీటి వనరులకు ప్రాధాన్యత రావాలి. భూగర్భ జలాలు పెరగడానికి ఇవి బాగా తోడ్పడతాయి. పోలవరం డిజైన్‌ను మార్చి నిర్వాసితుల సంఖ్యను తగ్గించడం ద్వారా ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని చూరగొనేందుకు పూనుకోవాలి. ప్రాజెక్టుల్లో నిర్వాసితులైన ప్రజలకు పునరావాసం ప్రధాన కర్తవ్యం కావాలి.

**సౌర, గ్యాస్, పవన విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత**

ప్రస్తుతం థర్మల్ కేంద్రాల ద్వారానే విద్యుత్ ఎక్కువగా ఉత్పత్తి అవుతోంది. బొగ్గు నిల్వలు ఉన్నా వెలికితీసే బాధ్యతను ప్రయివేటు రంగా నికి అప్పగించడంతో కొరత తీవ్రమైంది. విదే శాల నుండి దిగుమతి చేసే బొగ్గు ధరలు, ఖర్చులు ఎక్కువే కాకుండా అవినీతి కూడా ఎక్కువే. బొగ్గు వెలికితీత విధానంలో మార్పు ప్రభుత్వరంగ సంస్థలకు ప్రాధాన్యత ఇచ్చేదిగా ఉండాలి. తక్షణం విద్యుత్ ఉత్పత్తి కొరతను ఎదుర్కొనడానికి ఇది అవసరం. జల విద్యుత్ ఉత్పత్తి ప్రధానంగా వర్షాలు, జలాశయాలు మీద ఆధారపడి ఉన్నది. అది కూడా సీజనల్ గానే జరుగుతుంది. దానికున్న పరిమితుల రీత్యా పెరిగిన అవకాశాలను వినియోగించుకుని సౌర, పవన, గ్యాస్ విద్యుత్ ఉత్పత్తి పెంచాలి.

**విద్యా–వైద్య రంగాల్లో**

మారిన ఆర్థిక వ్యవస్థలో విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలను ఆధునీకరించి విద్యావకాశాలకు దూరంగా ఉంటున్న సామాజిక తరగతులనందరినీ విద్యా పరిధిలోకి తీసుకురావాలి. పాఠశాల విద్య, కాలేజీ విద్య తగినంత పెరిగితే ఉపాధి అవకాశాలు ఈ సామాజిక తరగతులకు పెరుగుతాయి. కార్పొరేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా పెరిగి మధ్య తరగతి ప్రజలు సైతం కనీస విద్యావకాశాలను అందుకోలేని పరిస్థితికి నెట్ట బడుతున్నారు. ఈ దోపిడీ నుండి కాపాడడానికి ప్రభుత్వపరంగా వెంటనే చర్యలు చేపట్టాలి. ఉచితంగానూ, నామమాత్రపు ఫీజుతోనూ వైద్య సౌకర్యాలను అందించడానికి వీలుగా వైద్య రంగాన్ని పునర్ వ్యవస్థీకరించాలి. గతంలో లభించిన వైద్య సౌకర్యాలు ఈ రోజు ప్రభుత్వం నిరాకరిస్తోంది. కార్పొరేట్ రంగాన్ని ప్రోత్సహి స్తోంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక వైద్య కేంద్రాల అభివృద్ధి ఎంతో ప్రాధాన్యత సంతరిం చుకున్నది. దానికి వెంటనే చర్యలు చేపట్టాలి.

> **“సీమాంధ్రప్రాంతంలో వికేంద్రీకరణ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలి. హైదరాబాదులాగా అన్నీ ఒకే చోట కేంద్రీ కరించడం కాక వివిధ ప్రాంతాల్లో విస్తరించేలా ప్రణాళిక రూపొందించాలి. ఇచ్ఛాపురం నుండి తడ వరకు 972 కిలోమీటర్ల పొడవున సముద్రతీర ప్రాంతం ఆంధ్ర రాష్ట్రానికి మంచి వనరుగా ఉన్నది.”**



విశాఖపట్నం పోర్టు: తీరంవెంట పోర్టులు ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి మంచి అవకాశాలు కల్పిస్తాయి

**పరిశ్రమలు – పర్యావరణం**

ప్రస్తుతం హైదరాబాదు, రంగారెడ్డి, విశాఖపట్నం తదితర కొన్ని ప్రాంతాల్లోనే పరిశ్రమలు కేంద్రీకృతమయ్యాయి. మారిన పరిస్థితుల్లో ఖనిజ సంపద, రవాణా సౌకర్యం, విద్యుత్ సౌకర్యాల ద్వారా రాయలసీమ, కోస్తా ప్రాంతమంతా పరిశ్రమల అభివృద్ధికి అవకాశం ఉన్నది. కానీ రాష్ట్ర పునర్నిర్మాణ చట్టంలో కేంద్ర ప్రభుత్వం దీనికి అవసరమైన నిర్దిష్ట ప్రతిపా దనలను చేర్చలేదు. పైగా నిధుల ప్రస్తావన అసలే లేదు. ఆంధ్రరాష్ట్ర పునర్ నిర్మాణానికి ప్రత్యేకంగా పరిశ్రమల అభివృద్ధికి వేల కోట్ల నిధులు ప్రభుత్వ పరంగా వెచ్చించాలి. ప్రభుత్వం పీకల దాకా అప్పుల్లో కూరుకుపోయిన నేపథ్యంలో సీమాంధ్ర ప్రాంతం తనకు తానుగా నిధులు సమకూర్చుకునే పరిస్థితి లేదు. కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించాలి. ఔషధ రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు తగినంత గుర్తింపు ఉన్నది. ఎగుమతులు కూడా బాగా ఉన్నాయి. సామాన్యులు వినియోగించే ఔషధాల ధరలు అదుపులో ఉండడానికి తొలగించిన ఆంక్షలను పునరుద్ధరించాలి.

విద్యుదుత్పత్తి, ఔషధాల పరిశ్రమలు కాలుష్యాన్ని వెదజల్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడితేనే సమగ్రమైన అభివృద్ధిని సాధించడానికి వీలుపడుతుంది. అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న లేబర్ మార్కెట్ సంస్క రణలు ఏ పరిస్థితుల్లోనూ అంగీకరించరానివి. సంక్షేమం– సామాజిక న్యాయం మన రాజ్యాం గంలో విధానాలుగా ఉన్నాయి. వీటిని అభివృద్ధి పేరుతో ఎత్తివేయడం సమగ్రాభివృద్ధికి తీవ్ర విఘాతం కల్గిస్తుంది. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఈ దృక్పథంతో సీమాంధ్ర ప్రాంత అభివృద్ధికి పోరాడుతుంది. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి పై హక్కుల సాధనకు కృషి చేస్తుంది. •

**ఈ మాసం ప్రత్యేకం**

# పట్టణ మధ్యతరగతి ఆలోచనలు - సమాజంపై ప్రభావం



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు.

**వి.శ్రీనివాసరావు**

గత ఇరవై ఏళ్లలో భారతదేశంలో మధ్యతరగతి జనాభా గణనీయంగా పెరిగింది. సరళీకరణ విధానాల ఫలితంగా ఒక నూతన మధ్యతరగతి ఆవిర్భవించింది. వీరిలో అత్యధికులు పట్టణాల్లో కేంద్రీకరించి ఉన్నా, గ్రామాల్లోనూ ఈ తరగతి కనిపిస్తుంది. మెకెన్సీ గ్లోబల్ సంస్థ అంచనా ప్రకారం మధ్యతరగతి జనాభా 25 కోట్ల వరకు ఉండొచ్చు. అంటే 20శాతం. 1980లలో ఇది 8శాతం మాత్రమే. 2025 నాటికి ఈ సంఖ్య 58 కోట్లకు చేరుకుంటుందంటున్నారు. బ్రూకింగ్స్ ప్రకారం రోజుకు పదిడాలర్లు అంటే 600 రూపాయలు పైన ఆదాయం ఉన్న వారు మధ్యతరగతి కిందకు వస్తారు. అంటే అది జనాభాలో 5శాతం మాత్రమే. ఎన్‌సిఏఇఆర్ (ఇండియా) ప్రకారం 13 శాతం. అంటే వీరి లెక్కలో సంవత్సరానికి 2 నుండి 10 లక్షల రూపాయల ఆదాయం వచ్చేవారు. 90వేల పైన 2లక్షల లోపు ఆదాయం ఉన్న వారు మరో 40శాతం ఉన్నారు. మిగతా వారంతా పేదవారు. జనాభా లెక్కల ప్రకారం మోటార్‌వాహనం, గ్యాస్ కనెక్షన్, బ్యాంకు అకౌంటు ఉన్న వారంతా మధ్యతరగతే. ఆ ప్రకారం 26శాతం ఉంటారు. కార్పోరేట్ లెక్కల్లో కొనుగోలుశక్తి ఉన్నవారంతా మధ్యతరగతే. ప్రభుత్వలెక్కల్లో ఒక మోస్తరు ఆదాయం ఉన్నవారంతా మధ్యతరగతే. అంటే దాదాపు ఉద్యోగులు, కార్మికులంతా వీరి లెక్కలో మధ్యతరగతే. మెకెన్సీ అంచనా ప్రకారం 80 శాతం మధ్యతరగతి అతి తక్కువ ఆదాయం పొందేవారే. రోజుకి రూ. 120 నుండి రూ. 240 వరకు ఖర్చు పెట్టగలవారు. వీరికి కొనుగోలు శక్తి తక్కువ. రూ. 250 నుండి రూ. 600 వరకు ఖర్చు పెట్టగలిగిన వారు మధ్యరకం, రూ. 600 నుండి రూ. 1200 వరకు ఖర్చు పెట్టగలిగినవారు ఉన్నత మధ్యతరగతి. ఈ రెండు తరగతులు కలసి 20 శాతం, అంటే 5 కోట్లకు లోపు మాత్రమే. ఇవన్నీ అంచనాలే. వీటిల్లో చాలా తేడాలున్నాయి. మధ్యతరగతిలో ఉన్న సంక్లిష్ట విభజనే దీనికి కారణం. మధ్యతరగతి అంతా పోత పోసినట్లు ఒకేరకంగా ఉండదు. ఇందులో హెచ్చు తగ్గులున్నాయి. ఉన్నత మధ్యతరగతి ధనికులకు దగ్గరగా ఉంటుంది. కిందిపొర పేదలకు దగ్గరగా ఉంటుంది. ఉన్నతాదాయ వర్గాలు కూడా తక్కువ ఖర్చు పెట్టడానికి ఇంకా వెనుకబడిన సాంస్కృతిక జీవనమే కారణమంటుంది మెకెన్సీ. దీన్ని మార్చడానికి మార్కెట్ విధానాలకనుగుణంగా నూతన సంస్కృతిని ప్రవేశపెట్టాలంటుంది.

మధ్యతరగతిలో యువతరం సంఖ్య బాగా పెరిగింది. 25 సంవత్సరాల లోపు వారు 50 శాతం ఉంటారు. ఇదే కాలంలో పట్టణ జనాభా కూడా పెరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 32 శాతం. మరో పదేళ్లకు 40శాతానికి చేరుకుంటుందని అంచనా. అంటే మధ్యతరగతిలో కూడా పట్టణ మధ్యతరగతి, అందులోనూ యవతరం సంఖ్య అంటే 16–31 సంవత్సరాల వయస్సు మధ్య నున్నవారు 38 శాతం ఉంటారు. భారత జనాభా సగటు వయస్సు 2001 నాటికి 24 సంవత్సరాలు. 2011లో 25. అది 2020 నాటికి 29 సంవత్సరాలకు పెరుగుతుందని అంచనా. ప్రపంచంలోని 35 సంవత్సరాల లోపు యువతలో 25 శాతం అంటే నాలుగోవంతు మనదేశంలోనే ఉంది. వీరు మన జనాభాలో 60 శాతం. 2020 నాటికి పనిచేయగలిగిన వారు ప్రపంచంలోనే అత్యధికంగా 64 శాతం భారత్‌లో ఉంటారు. రానున్న కాలంలో ఉపాధి కీలక సమస్యగా ముందుకొస్తుంది. నైపుణ్యం కలిగిన యువత అధికంగా కేరళలో ఉన్నారు. తర్వాత స్థానాల్లో మహారాష్ట్ర, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ ఉన్నాయి. అంటే వర్తమాన వ్యవస్థలో విద్యావంతులైన పట్టణ మధ్యతరగతి యువత ముఖ్యమైన పాత్ర పోషించనున్నట్లు మనకు ఈ లెక్కల ద్వారా అర్థమవుతుంది. అందుకే పెట్టుబడిదారీ మార్కెట్‌తో సహా బూర్జువా రాజకీయపార్టీలన్నీ ఈ తరగతిపైనే అత్యధికంగా కేంద్రీకరిస్తున్నాయి.

### మధ్యతరగతి అంటే ఎవరు?

మధ్యతరగతినే మార్క్స్ పెట్టీబూర్జువా వర్గం అన్నాడు. వివిధ సందర్భాల్లో ఈ వర్గాన్ని గురించి మార్క్స్, ఎంగెల్స్‌లు ప్రస్తావించినా ఎక్కడా నిర్వచించలేదు. వారిచ్చిన వివరణను ఆయా సందర్భాలను బట్టి చారిత్రక దృక్పథంతో అర్థం చేసుకోవాలి. నాటి ఫ్యూడల్ వ్యవస్థలో గిల్డు రూపంలో ఎదుగుతున్న బూర్జువావర్గాన్ని మధ్యతరగతి అని మార్క్స్ మొదట సంబోధించాడు. తర్వాత పెట్టుబడిదారీ వర్గానికీ, కార్మిక వర్గానికీ మధ్యనున్న స్వతంత్ర వృత్తిదారులనుద్దేశించి మధ్యతరగతిగా వాడాడు. వీరు తమ కిందివారిని దోపిడీ చేస్తారు. పైవారి దోపిడీకి గురవుతుంటారు. చైనాలో మావో, ఇండియాలో సుందరయ్య తదితరులు నిర్వహించిన సర్వేల ద్వారా మధ్యతరగతి రైతాంగం స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చు. వారికున్న భూవిస్తీర్ణాన్ని బట్టి కుటుంబ శ్రమపై ఆధారపడి పూర్తిగా సేద్యం చేసుకోవడం సాధ్యం కాదు. అందుకే బాగా పని ఉన్న రోజుల్లో కూలీలను కూడా పెట్టుకుంటారు. అలా

కొంతభాగం తమ కుటుంబ శ్రమ ద్వారా, మరో కొంతభాగం కూలీల శ్రమ ద్వారా ఆదాయం సమకూర్చుకుంటారు. ఈ వర్గం స్థిరంగా ఉండదని మార్క్స్ గుర్తించాడు. ఇందులో ఎక్కువ భాగం దివాళాతీసి కింది వర్గాల్లో కలసిపోతుంటారు. చిన్న భాగం పైకి ఎగబాకుతుంది. అదే సమయంలో కింది వర్గాల్లో కొంతభాగం మధ్యతరగతిగా మారుతుంది. ధనవంతుల్లో చిన్న భాగం దెబ్బతిని మధ్యతరగతిగా మారుతుంది. ఈ సరళీకరణయుగంలో అదే జరిగింది. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ పురోగతిలో ఉన్నప్పుడు త్వరత్వరగా ఈ వర్గం అభివృద్ధి చెందుతుంది. స్వాతంత్ర్యానంతరం 1970ల వరకు మధ్యతరగతి నిదానంగా పెరిగింది. 70-90ల మధ్య చితికి పోయింది. కాని 1990ల తర్వాత వేగం పుంజుకుంది. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల నుండి కొన్ని సెక్షన్లు కొత్తగా ఈ పొరలోకి ప్రవేశించాయి. ఈ లక్షణాలను దృష్టిలో ఉంచుకునే సిపిఐ(యం) కార్యక్రమం వీరిని కార్మికవర్గానికి నమ్మదగిన మిత్రవర్గంగా భావించింది. అదే సమయంలో వ్యవసాయ కూలీలు, పేదరైతుల్లాగా పునాది వర్గం కాదు. కార్మికోద్యమాలు ఊపుగా ఉంటే ఇటు నిలబడతారు. బూర్జువావర్గం బలంగా ఉంటే వారివైపే మొగ్గుతారు. కార్మికవర్గం సంఘటితమయ్యేకొద్దీ మధ్యతరగతి కూడా గట్టిగా నిలబడుతుంది.

**“ జీవన ప్రమాణం లేదా ఆదాయం మధ్యతరగతిని గుర్తించ డానికి కొలబద్ద కాదు. అది మార్కెట్ దృక్కోణం కావచ్చు కానీ శాస్త్రీయం కాదు. మార్క్సిస్టు దృక్పథంలో వర్గ నిర్ధారణకు కొలబద్ద ఉత్పత్తిలో వారి శ్రమపాత్ర, తద్వారా వచ్చే ఆదాయం ఎంత అన్నది. ఆదాయం ఎక్కువగా ఉన్నా వారి స్వంత శ్రమతోనే అది వస్తుంటే వారు కార్మికవర్గం కిందే లెక్క. అలాగే వారికి ఆదాయం ఉంది కాబట్టి దానితో ఇతరుల శ్రమను దోచుకుంటే అది కార్మికవర్గం కాదు. ”**



పట్టణ మధ్యతరగతి: భారత దేశంలో ఈ వర్గం వేగంగా పెరుగుతోంది.

**మనం మధ్యతరగతిని ఎలా గుర్తించాలి?**

జీవన ప్రమాణం లేదా ఆదాయం మధ్యతరగతిని గుర్తించడానికి కొలబద్ద కాదు. అది మార్కెట్ దృక్కోణం కావచ్చు కానీ శాస్త్రీయం కాదు. మార్క్సిస్టు దృక్పథంలో వర్గ నిర్ధారణకు కొలబద్ద ఉత్పత్తిలో వారి శ్రమపాత్ర, తద్వారా వచ్చే ఆదాయం ఎంత? అన్నది. ఆదాయం ఎక్కువగా ఉన్నా వారి స్వంత శ్రమతోనే అది వస్తుంటే వారు కార్మికవర్గం కిందే లెక్క. అలాగే వారికి ఆదాయం ఉంది కాబట్టి దానితో ఇతరుల శ్రమను దోచుకుంటే అది కార్మికవర్గం కాదు. ప్రభుత్వయంత్రాంగంలో భాగస్వామిగా ఉండే ఉద్యోగులు ఉత్పత్తిలో ప్రత్యక్ష పాత్రధారులు కారు. శ్రామికవర్గాలను అణచిపెట్టి ఉంచడంలో రాజ్యానికి వీరు ప్రత్యక్షంగా తోడ్పడుతుంటారు. బ్రిటీషువారి నుండి వారసత్వంగా వచ్చిన నిరంకుశ (బ్యూరోక్రాటిక్) పద్ధతులు, అవినీతి వీరిని ప్రజలకు దూరంగా ఉంచాయి. స్వాతంత్ర్యానంతరం బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, పోస్టల్, టీచర్స్ సంఖ్య పెరిగింది. వీరు ప్రభుత్వోద్యోగులే అయినప్పటికీ వారికి భిన్నంగా ఉంటారు. ప్రజలను అణచిపెట్టి ఉంచే యంత్రాంగంలో వీరు ప్రత్యక్షపాత్రధారులు కారు. సమాజాన్ని ప్రభావితం చేయడంలో మేధావుల పాత్రను తక్కువ అంచనా వేయలేం. డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, జర్నలిస్టులు, టీచర్లు, రచయితలు, కళాకారులు వగైరా ఈకోవలోకి వస్తారు. ఈ కాలంలో జర్నలిస్టులు, కళాకారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. సరళీకరణ కాలంలో సర్వీసురంగం పెరిగింది. ఇది ప్రత్యక్షంగా ఉత్పత్తిరంగం కాదు. ఈ రంగం ద్వారా ఆదాయం పొందే వర్గాలన్నీ మధ్యతరగతి వర్గాలే. ఐటీ, బీపీవో, ఫైనాన్స్, ఇన్‌ఫ్రా, హోటల్, టూరిజం, మేనేజ్‌మెంట్ వంటి రంగాలు విస్తరించడంతో ఇందులో పనిచేసేవారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. యువ మహిళలకు కూడా ఈ కాలంలో అవకాశాలు పెరిగాయి. రిసెప్షనిస్టులు, బిపిఓ, కాల్ సెంటర్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మోడలింగ్, ఫేషన్, బ్యూటీపార్లర్స్, టీచింగ్, నర్సింగ్ వగైరా రంగాల్లో మహిళలు అధికంగా ఉన్నారు. అయితే ఈ ఉద్యోగాలలో స్థిరత్వం ఉండదు. నిరంతరం మారుతుంటారు. నిత్యం అభద్రతా భావంతో బతుకుతుంటారు. మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలే ఇందుకు నిదర్శనం. ఆదాయంలో కూడా స్థిరత్వం ఉండదు. అందువల్ల ఆలోచనల్లో కూడా మార్పు వస్తుంటుంది. అవకాశాలను ఉపయోగించుకొని పైకెగబాకాలన్న తాపత్రయం, ఎగబాకలేని నిస్సహాయత, పోటీలో నెగ్గలేక వెనుకబడిపోతున్నామన్న నిస్పృహ వీరిని వెంటాడుతుంటుంది. అందువల్లనే ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడుతుంటారు. ఊగిసలాట ఈ వర్గం ముఖ్యలక్షణం.

తమ జీవితాలు ఏ ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా సాగిపోవాలని మధ్యతరగతి భావిస్తుంది. స్థిరత్వానికి కనీసం ఒక ఇల్లు, కారు ఉంటే చాలనుకుంటారు. పిల్లల చదువులకు, ఆరోగ్యానికి, ముసలితనంలో పెన్షన్‌కు పొదుపు చేసుకుంటారు. ఎక్కువ లబ్ధి చేకూర్చే ఇన్సూరెన్సు, షేర్లు కొంటారు. ఇంటర్‌నెట్, సెల్‌ఫోన్‌ల ద్వారా నిరంతరం కమ్యూనికేషన్‌లో ఉంటున్నారు. కుటుంబాలతో అప్పుడప్పుడు టూరిస్టు ప్రాంతాలను సందర్శించడం, కనీసం వారానికోసారి పార్కులకు, సినిమాలకు వెళ్లడం సర్వసాధారణం. అలా ట్రావెల్ ఏజెన్సీలకు, హోటళ్లకు వీరే ప్రధాన వినియోగదారులు. పొదుపును పెట్టుబడిగా మారుస్తున్నారు. షేర్లు కొంటానికి అప్పులు కూడా చేస్తుంటారు. అబ్దుల్ కలాం చెప్పినట్లు బంగారు భవిష్యత్తు గురించి కలలు కంటుంటారు. ఇలాంటి వారిని వాస్తవ

“ 2014 పార్లమెంటు ఎన్నికల్లో 18-19 సంవత్సరాల మధ్య నున్న ఓటర్ల సంఖ్య రెండున్నర కోట్లుంది. మొత్తం కొత్త ఓటర్లు 10 కోట్ల మంది ఉన్నారు. ఆ రీత్యా రాజకీయాల్లోనూ వీరు కీలకస్థానంలో ఉంటారు. పేదవాళ్లకు కొనుగోలుశక్తి తక్కువ. కాని అదే సమయంలో వారి ఓటింగ్ బలం ఎక్కువ. ”

ప్రపంచంలోకి తీసుకురావడం ఒకింత కష్టమైన పనే. కాని ఒక విషయం గమనించాలి. ఇలా ప్రశాంత జీవనానికి అలవాటు పడ్డవాళ్లు సంక్షోభాలను తట్టుకోలేరు. 2010 వరకు వివిధ రకాల సర్వీసు రంగాల్లో ఏదో ఒక పని దొరుకుతుండేది. కాని ఇప్పుడా అవకాశాలు తగ్గిపోయాయి. ఉన్నవారే వీథుల్లో పడుతున్నారు. మూటాముల్లే సర్దుకొని తిరిగి ఊళ్లబాట (రివర్స్ మైగ్రేషన్) పడుతున్నారు. ఆర్థిక సంక్షోభంతో తమ పొదుపు గాలిపాలవుతుంటే కుంగిపోతారు. ఈ ఐదేళ్లలోనే షేర్‌మార్కెట్ పతనంతో లక్షలాది కోట్ల రూపాయలు మధ్యతరగతి మదుపుదారులు నష్టపోయారు. కొంతమంది ఒత్తిళ్లకు తట్టుకోలేక ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. సామాజిక అశాంతిలో వాళ్లు కోరుకునే స్థిరత్వం సాధ్యం కాదు. వారిలో మార్పుకు ఇదే పునాది. ఇందులో కొన్ని సెక్షన్లు నిరంకుశ పాలనతోనైనా స్థిరత్వం తీసుకొస్తే బాగుండునని కోరుకుంటారు. మరికొన్ని సెక్షన్లు ఉద్యమాలతో మమేకమై పోరాడి మార్పు సాధించాలనుకుంటారు.

2014 పార్లమెంటు ఎన్నికల్లో 18-19 సంవత్సరాల మధ్య నున్న ఓటర్ల సంఖ్య రెండున్నర కోట్లుంది. మొత్తం కొత్త ఓటర్లు 10 కోట్ల మంది ఉన్నారు. ఆరీత్యా రాజకీయాల్లోనూ వీరు కీలకస్థానంలో ఉంటారు. పేదవాళ్లకు కొనుగోలుశక్తి తక్కువ. కాని అదే సమయంలో వారి ఓటింగ్ బలం ఎక్కువ. ఎన్నికలు రాగానే రకరకాల వాగ్దానాలతో వీరిని ఆకట్టుకునేందుకు జాతీయ, ప్రాంతీయ బూర్జువాపార్టీలు ప్రయత్నిస్తుంటాయి. అందువల్లనే బడ్జెట్‌లలో ఇష్టమున్నా లేకున్నా సబ్సిడీలు, సంక్షేమకార్యక్రమాల కోసం నిధులు కేటాయించాల్సి వస్తోంది. అది కార్పోరేట్ రంగానికి ఇష్టం లేదు. అంతేకాదు ప్రపంచబ్యాంకు సంస్కరణలు సమర్థవంతంగా అమలు చేయాలంటే సబ్సిడీలు, సంక్షేమ పద్దులపై కోత విధించాలి. పేదవాళ్ల ఓట్లపై ఆధారపడినంతకాలం ఇది సాధ్యం కాదు. వారి ఓటింగ్‌బలాన్ని తగ్గించాలంటే రెండు మార్గాలున్నాయి. ఒకటి: వారిని ఓటింగ్‌కు రాకుండా చేయడం. రెండు: ఇప్పటివరకు ఓటింగుకు దూరంగా ఉంటున్న మధ్యతరగతిని పోలింగు బూత్‌ల వద్దకు రప్పించడం. మొదటిది చేయాలంటే నిరంకుశత్వాన్ని ప్రయోగించాలి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా గొప్పగా చెప్పుకుంటున్న మనదేశం ముసుగు విప్పాల్సి ఉంటుంది. దానికి కార్పోరేట్లలో ఒక వర్గం వెంటనే సంసిద్ధంగా లేదు. అలాంటి పని అనివార్యమైనప్పుడే చేయాలంటుంది. అంతేకాదు ప్రాంతీయపార్టీల మధ్య పోటీ ఇందుకు ప్రతిబంధకంగా ఉంది. అందువల్ల అది అంత సులభసాధ్యం కూడా కాదు. ఈలోగా పేదవాళ్ల ఓట్లు కొనడానికి బ్లాక్‌మనీ అంతా ఖర్చు పెట్టాలి. అందుకే రెండో మార్గాన్ని ఎంచుకున్నది. మధ్యతరగతిలో వస్తున్న కొత్త మార్పులు వారికి సహకరిస్తున్నాయి. అవినీతి, అక్రమపాలన, మహిళలపై అత్యాచారాలపై వారిలో తిరుగుబాటు ధోరణులు బయలుదేరడం చూస్తున్నాం. వారిలో వస్తున్న ప్రజాస్వామిక చైతన్యాన్ని బూర్జువా నిరంకుశపాలనను సమర్థించుకోడానికి కార్పోరేట్‌వర్గాలు ఉపయోగించుకోవాలనుకుంటున్నాయి. గతంలో రాజకీయాలకు దూరంగా ఉండమన్నవారే నేడు రాజకీయాల్లోకి రావాలని యువతకు పిలుపునిస్తున్నారు. వ్యవస్థీకృత పార్టీలపై వ్యతిరేకత ఉన్న వారిని ఆకర్షించడానికి, అలాంటి వారు వామపక్షాల ప్రభావంలోకి పోకుండా నిరోధించడానికి కొత్త పార్టీలను సృష్టిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని లోపాలను పదునుగా ఎత్తిచూపుతూనే దానికి మరో రూపంలో సరళీకరణ విధానాలనే ప్రత్యామ్నాయంగా ముందుకు తెస్తున్నారు. 2014 ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక రూపొందించిన మేనిఫెస్టోను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. వ్యవస్థలో ఉన్న లోపాలను కప్పెట్టి వ్యక్తుల గుణగణాలను బట్టి పరిపాలన ఉంటుందని నమ్మిస్తున్నారు. మంచి పరిపాలన (గుడ్ గవర్నెన్స్) ఉంటే వ్యవస్థ బాగుపడుతుందని ప్రచారం చేస్తున్నారు. దానికి మోడీని, రాహుల్‌ను ప్రతినిధులుగా ముందుకు తెచ్చి ఎవరో ఒకరిని ఎన్నుకోవాలని ఆప్షన్ ఇస్తున్నారు. తద్వారా ప్రాంతీయపార్టీలను బలహీనపరచి లేదా వారిని కూడా ఇదే దారిలోకి రప్పించుకొని రెండుపార్టీలు, అది సాధ్యం కాకపోతే రెండు కూటముల వ్యవస్థను దేశంపై రుద్దడానికి మధ్యతరగతిని సాధనంగా ఉపయోగించుకుంటున్నారు. ఈ రెండు కూటముల మధ్య కమ్యూనిస్టులు, వామపక్షాలను ఒంటరి చేసి మూలకు నెట్టాలన్నది వారి వ్యూహం. ఈ పరిస్థితులలో మధ్యతరగతినీ, సమాజంపై వారి ప్రభావాన్నీ విస్మరించలేం. వారి వర్గస్వభావాన్ని, సామాజిక మార్పులో వారి పాత్రను అర్థం చేసుకొని దాని కనుగుణంగా కమ్యూనిస్టులు కూడా పనిచేయాల్సిన రాజకీయ ఆవశ్యకత పెరిగింది.

### మధ్యతరగతి ముఖ్యలక్షణాలు

1964లో సిపిఐ(యం) ఏర్పడినప్పుడు రూపొందించుకున్న పార్టీ కార్యక్రమంలో మధ్యతరగతిని నమ్మదగిన మిత్రవర్గంగా విశ్లేషించింది. దీన్ని మరింత దృఢపరుస్తూ 1976 ఎత్తుగడల పంథా సమీక్ష మధ్యతరగతి పాత్రపై ఒక అంచనా కొచ్చింది “ఈ కాలంలో తెల్లచొక్కా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, బ్యాంకు, ఇన్సూరెన్సు రంగాల్లో సిబ్బందితోపాటు ప్రైవేటురంగంలోని వివిధ సంస్థల్లో మధ్యతరగతి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇదొక కొత్త పరిణామం. జీతభత్యాలపై ఆధారపడి జీవించే ఈ వర్గం సమాజాన్ని ప్రభావితం చేయడమే కాదు విప్లవోద్యమంలో ముఖ్య భాగం కూడా. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలకు భిన్నంగా వీరు మనదేశంలో సమరశీలత, విప్లవ స్వభావం కలిగి ఉంటారు. బాగా సంఘటిత పడిన పారిశ్రామిక కార్మికోద్యమం అత్యంత పెద్ద సంఖ్యలో ఉన్న ఈ మధ్యతరగతిని సంతోషంగా ఆహ్వానించి సంఘటితం చేయాలి. సన్నిహిత మిత్రవర్గంగా వారికి నాయకత్వం వహించాలి.”

ఈ సమీక్ష తర్వాత మధ్యతరగతిలో ఇంకా గణనీయమైన మార్పులొచ్చాయి. 2000 సంవత్సరంలో సిపిఐ(యం) తాజా పార్టీ కార్యక్రమంలో చెప్పినట్లుగా వారు సరళీకరణ విధానాలకు బాగా ప్రభావితమయ్యారు. మధ్యతరగతి స్వభావాన్ని గురించి కార్యక్రమం ఇలా చెప్పింది. “బూర్జువా, పెట్టుబడిదారీ పాలనలో

అటు గ్రామీణ, ఇటు పట్టణ మధ్యతరగతి తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. అధికసంఖ్యలో ఉన్న తెల్లచొక్కా ఉద్యోగులు, వృత్తినిపుణులు, ఇంజనీర్లు, డాక్టర్లు, మరియు ఇతర బుద్ధిజీవులు సమాజంపై తీవ్ర ప్రభావాన్ని కలిగి ఉంటారు. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధితో ప్రత్యేకించి సరళీకరణ విధానాల తర్వాత మధ్యతరగతిలో విభజన పెరిగింది. పై పొరలో ఉన్న ఉన్నత మధ్యతరగతి ఈ విధానాల వల్ల లాభ పడి మిగతా మధ్యతరగతి నుండి వేరుపడింది. కాని మిగతా వారు పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, పన్నుల భారం, సౌకర్యాల లేమితో సతమతమవుతున్నారు. అందువల్ల జనతా ప్రజాస్వామిక సంఘటన నిర్మాణంలో వీరు ముఖ్య భాగస్వామిగా ఉంటారు కనుక వారిని రాబట్టేందుకు కార్మికవర్గం అన్ని రకాల ప్రయత్నాలూ చేయాలి. వీరిని కూడగట్టడంలో ప్రగతిశీల మేధావులు ముఖ్యపాత్ర పోషించాలి"

**విస్తరిస్తున్న నూతన సంస్కృతి**

గత రెండు దశాబ్దాల్లో సర్వీసు సెక్టార్ విస్తరించింది. ఐటీ లాంటి సరికొత్త తరగతి ప్రవేశించింది. వినిమయదారీ సంస్కృతి విస్తరించింది. మధ్యతరగతి ఆలోచనల్లో ముఖ్యంగా యువతరంలో చాలా మార్పులొచ్చాయి. సరళీకరణ విధానాలు తీసుకొచ్చిన నూతన సంస్కృతి మధ్యతరగతి సామాజిక చైతన్యంపైనా ప్రభావాన్ని చూపుతోంది. నూతన సాంస్కృతిక విలువలు మానవ సంబంధాలను మార్చేశాయి. ప్రతిదీ డబ్బు చుట్టూ తిరిగే సంబంధాలొచ్చాయి. వేషధారణ, మాట్లాడే భాష, హావభావాలు అన్నీ మారిపోతున్నాయి. ఇంగ్లీషు వాడకం పెరిగింది. వచ్చీరాని తెలుగులో మాట్లాడటం ఫ్యాషన్‌గా మారింది. ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. మాక్‌డోనాల్డ్, కేఎఫ్‌సీ, కాఫీడేలు విస్తరించడం దీనికి నిదర్శనం. నిత్యం మార్కెట్‌లోకి కొత్తగా వచ్చే సరుకుల్ని కొనాలనే ధోరణి, అలాంటి వస్తువులు తన దగ్గరుండటం ప్రతిష్టకు చిహ్నంగా చూడటం జరుగుతుంది. దీని కోసం అప్పులు చేయడానికి కూడా వెనుకాడరు. టెక్‌సావీగా ఉండాలనుకుంటారు. ఆధునిక హంగులన్నీ అవసరం ఉన్నా లేకున్నా తమ దగ్గరుండాలనుకుంటారు. మార్కెట్‌లోకి వచ్చీరాగానే అది తమ చేతుల్లో రావాలనుకుంటారు. మార్కెట్‌లోకి రాకముందే ఆన్‌లైన్‌లో బుక్‌చేస్తారు. స్మార్ట్‌ఫోన్ ప్రతిష్టకు చిహ్నంగా భావిస్తున్నారు. దాన్ని కొనడానికి కంపెనీ వారిచ్చే ఇయంఐ ఆఫర్‌ను ఉపయోగించుకుంటారు. తద్వారా తమ ఆదాయానికి ముందే ఖర్చు రాసి పెట్టుకుంటారు.

> **❝ గత రెండు దశాబ్దాల్లో సర్వీసు సెక్టార్ విస్తరించింది. ఐటీ లాంటి సరికొత్త తరగతి ప్రవేశించింది. వినిమయ దారీ సంస్కృతి విస్తరించింది. మధ్యతరగతి ఆలోచనల్లో ముఖ్యంగా యువతరంలో చాలా మార్పులొచ్చాయి. సరళీకరణ విధానాలు తీసుకొచ్చిన నూతన సంస్కృతి మధ్యతరగతి సామాజిక చైతన్యంపైనా ప్రభావాన్ని చూపుతోంది. ❞**



**ప్రపంచంలోని 35 ఏళ్ల లోపు యువతలో నాలుగోవంతు మనదేశం లోనే ఉన్నారు. వీరు మన జనాభాలో 60 శాతం. 2020 నాటికి పనిచేయగలిగిన వారు ప్రపంచంలోనే అత్యధికంగా 64 శాతం భారత్‌లో ఉంటారు.**

స్త్రీ, పురుష సంబంధాలు, కుటుంబ వ్యవహారాల్లో కూడా సరళీకరణ విధానాల కనుగుణంగా మార్పులొస్తున్నాయి. కలసి తిరగడం, పెండ్లి కాకుండా కలసి కాపురం చేయడం తప్పుకాదన్న భావన బలపడుతోంది. డేటింగ్, కంపేనియన్‌షిప్ వంటి పదాలు ఇంటర్‌నెట్‌లో నిత్యం దర్శనమిస్తుంటాయి. మహిళ వినిమయదారీ సంస్కృతిలో భాగంగా మారిపోయింది. వ్యభిచారాన్ని చట్టబద్ధం చేయాలని ప్రభుత్వాలే ప్రతిపాదిస్తున్నాయి. మన పట్టణాలను సింగపూర్ చేస్తామంటున్నవారే ఇలాంటి చర్చను కూడా లేవదీస్తున్నారు. స్త్రీ, పురుషులే కాదు స్వలింగ సంపర్కం కూడా చట్టబద్ధం చేయాలన్న ఉద్యమాలను మనం చూస్తున్నాం. అసహజ సెక్సు కార్యకలాపాలను సమాజం ఇంకా జీర్ణించుకునే స్థాయికి రాలేదు. కాని మెట్రో నగరాల్లోని మధ్యతరగతికి చెందిన ఒక సెక్షను దీన్ని బలపరుస్తోంది. ఇటీవల కోర్టు తీర్పులు ఆ దిశగా కొత్త చర్చను లేవనెత్తాయి. ఒకప్పుడు పశ్చిమదేశాలకు మాత్రమే తెలిసిన గే, లెస్బియన్ వంటి పదాలు ఇప్పుడు మన దేశంలో కూడా బాగా వినిపిస్తున్నాయి. కొంతమంది సెక్సుమార్పిడికి కూడా పాల్పడుతున్నారు. శరీరం పట్ల శ్రద్ధ పెరిగింది. అందాల పరిశ్రమ విస్తరించింది. వ్యాయామం చేయడం, జిమ్‌లకు వెళ్లడం పెరిగింది. లైంగిక అంశాలను ప్రేమ, వివాహం వంటి విషయాలను స్వేచ్ఛగా చర్చిస్తున్నారు. మరోవైపు లింగ వివక్షకు వ్యతిరేకంగా, స్త్రీ పురుష సమానత్వం కోసం పోరాటాలు కూడా నడుస్తున్నాయి. విద్యాధికులైన మధ్యతరగతి మహిళలల్లో ఈ చైతన్యం కనిపిస్తుంది.

**మీడియా ప్రభావం**

ప్రజా జీవనంలోకి మీడియా బాగా చొచ్చుకొచ్చింది. ఈ విషయంలో మధ్యతరగతి ఎక్కువగా ప్రభావితమవుతోంది. తమ కథానాయకుడి సినిమా ఆడించడానికి సినిమా ఫ్యాన్స్ ఎంత ఖర్చుకైనా వెనుకాడరు. దీనికి కులం కూడా తోడైతే ఇక చెప్పాల్సింది ఏముంది. చీడ పట్టినట్లే. ఈ బలహీనతను ఉపయోగించుకునే కొందరు నటులు రాజకీయ రంగ ప్రవేశం చేసి పదవులు పొందుతున్నారు. ఇక టివి సీరియళ్లు ప్రధానంగా మధ్యతరగతి మహిళలను కేంద్రంగా చేసుకునే తీస్తుంటారు. టిఆర్‌పీ రేట్లు పెరగడంలో ప్రధానపాత్ర వీరిదే. రియాల్టీషోలు యువతరాన్ని ఆకట్టుకుంటాయి. ఇంటర్‌నెట్ బాగా వ్యాపించింది. సెల్‌ఫోన్ మీడియా హబ్‌గా మారింది. పోర్నోగ్రఫీ విచ్చలవిడిగా దొరుకుతోంది. అది యువతరాన్ని పెడదారి పట్టిస్తోంది. ఆధునిక మీడియా ఫ్యూడల్ వ్యతిరేక చైతన్యాన్ని పెంచడంలో మార్కెట్ అవసరాల మేరకైనా కొంత వరకు సానుకూల పాత్ర నిర్వహిస్తోంది.

> **“ టివి సీరియళ్లు ప్రధానంగా మధ్యతరగతి మహిళలను కేంద్రంగా చేసుకునే తీస్తుంటారు. టిఆర్‌పీ రేట్లు పెరగడంలో ప్రధానపాత్ర వీరిదే. రియాల్టీషోలు యువతరాన్ని ఆకట్టుకుంటాయి. ఇంటర్‌నెట్ బాగా వ్యాపించింది. సెల్‌ఫోన్ మీడియా హబ్‌గా మారింది. పోర్నోగ్రఫీ  యువతరాన్ని పెడదారి పట్టిస్తోంది. ఆధునిక మీడియా ఫ్యూడల్ వ్యతిరేక చైతన్యాన్ని పెంచడంలో మార్కెట్ అవసరాల మేరకైనా కొంత వరకు సానుకూల పాత్ర నిర్వహిస్తోంది. ”**

వినిమయదారీ సంస్కృతి తీసుకొచ్చిన నూతన ఆలోచనా విధానం ఫలితంగా పొడ చూపిన ప్రతికూల ప్రభావాలను స్థూలంగా ఇలా చెప్పుకోవచ్చు.

**1. స్వార్థం (సెల్ఫ్ సెంటర్డ్):** తమ బాగోగుల్ని మాత్రమే చూసుకుంటూ ఇతరులు ఏమైపోయినా ఫర్వాలేదనుకుంటారు. సరళీకరణ విధానాల తర్వాత ఆఖరికి కుటుంబం కూడా వెనుకబడిపోయి, వ్యక్తివాదం ముందుకొచ్చింది. భార్యాభర్తల మధ్య కూడా ప్రయోజనాల మధ్య వైషమ్యాలొస్తున్నాయి. సంఘర్షణ పెరిగింది. విడాకుల సంఖ్య పెరిగింది. మధ్యతరగతి కుటుంబాల్లోని పిల్లలు చాలా మంది క్రమశిక్షణా రాహిత్యంగా పెరగడానికి ఇది కూడా ఒక కారణం.

**2. కెరీరిజం:** నిరంతరం పైకి పైపైకి ఎగబాకాలన్న ధోరణి పెరుగుతోంది. తాను ఎదగాలంటే ఇంకొకర్ని కిందకు తోయాలి. ఒకరిపై ఒకరికి అపనమ్మకం, అనుమానాలు పెరుగుతాయి.

**3. తక్షణ ఫలితాల కోసం ఆరాటం (ఇన్‌స్టంట్ రిజల్ట్స్):** పెట్టుబడి పెట్టిన వెంటనే ఫలితాలు రావాలన్న ధోరణి అధికమైంది. అందుకే ఎక్కువ ఆదాయం వస్తుందంటే అటే పరుగులు తీస్తారు. మోసాలకు గురవుతుంటారు. తాను మోసపోయి మరొకరిని మోసగించి బయటపడాలనుకుంటారు. ఉద్యమాల్లో కూడా ఇది వ్యక్తమవుతుంది. ఎవరు తక్షణం ఏదో ఒక ప్రయోజనం చూపిస్తారో అటు మొగ్గుతారు. దీర్ఘకాల పోరాటాలకు సిద్ధం కారు.

**4. కమ్యూనిజమంటే అయిష్టత:** నయా-ఉదారవాద విధానాల ఆలోచనావిధానం వీరికి నరనరాన ఎక్కుతుంది. సోవియట్ పతనం తర్వాత కమ్యూనిజంపై విశ్వాసం నన్నగిల్లింది. సంక్షోభంలో ఉన్నా పోరాటాల వైపు కాకుండా పాలకవర్గాలవైపు దిక్కులు చూస్తుంటారు. వారిపై ఇంకా భ్రమలున్నాయి.

**5. రాజకీయాల పట్ల వ్యతిరేకత- రాజకీయనాయకులపై ద్వేషం:** నేటి మధ్యతరగతిలో ఇది ఈ రోజు సాధారణ రోగంగా మారింది. కమ్యూనిస్టుల్ని కూడా ఇతర పార్టీలతో జతకట్టి మాట్లాడటం సర్వసాధారణమైంది. పార్టీలో అక్కడో ఇక్కడో ఉండే లోపాన్ని బూతద్దంలో చూస్తారు. అంతా అవినీతి పరులే కాబట్టి ఏవడైతేనేం అనే ధోరణికి గురవుతారు. గెలిచే వాడన్న పేరుతో బలవంతుడి వెంట కొట్టుకు పోతుంటారు. అంతిమంగా ఈ ధోరణి బూర్జువా రాజకీయ నాయకులకే ఉపయోగపడుతుంది.

**6. ఆందోళనల పట్ల వ్యతిరేకత:** ఉద్యమాల వల్ల అభివృద్ధికి నష్టం జరుగుతుందన్న వాదనతో కొట్టుకుపోతుంటారు.

**7. అభివృద్ధి పట్ల మోజు:** నిజమైన అభివృద్ధి గురించిన అవగాహన తక్కువ. కట్టడాలనే అభివృద్ధికి మారుపేరుగా భావిస్తారు. సోమరితనం వల్లే పేదరికం పెరుగుతుందని నమ్ముతారు. అసమానతలను చూసి నిస్పృహకు గురవుతుంటారు. తమ చేతకాని తనం వల్లే వెనుకబడిపోతున్నామని బాధపడుతుంటారు. దాని మూలాల గురించి ఆలోచించరు. అందుకే మోడీ నినాదాలకు లోనవుతున్నారు. గతంలో విజన్ 2020 వంటి నినాదాల వెంట కొట్టుకుపోయారు. ఎవరన్నా వచ్చి మీ నగరాన్ని సింగపూర్‌గా మార్చేస్తామంటే మంత్రగాళ్లను నమ్మినట్లు నమ్మి మోసపోతుంటారు. అమెరికాను చూసి మురిసిపోతుంటారు. అమెరికాలో అడుగుపెడితే చాలు జన్మ ధన్యమైనట్లు భావిస్తుంటారు.

**8. కుల, మత, ప్రాంతీయ ధోరణులకు సులభంగా కొట్టుకుపోతారు (ఐడెంటీయిజం):** తమను తాము కుల, మత, ప్రాంతీయ ధోరణులతో ఐడెంటిఫై చేసుకుంటారు. తాను ఫలానా వారమైనందుకు గర్వపడుతుంటారు. ఇతరుల్ని ద్వేషిస్తుంటారు. రిజర్వేషన్ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలి కొట్టుకుంటారు.

**9.ఫాల్స్ ప్రిస్టేజ్ (అభిజాత్యం):** తాను చితికి పోతున్నప్పటికీ వాస్తవాలను అంత త్వరగా గుర్తించరు. తాము సృష్టించుకున్న ఊహా ప్రపంచంలో బతుకుతుంటారు. పైకి గంభీరంగా కనిపిస్తూ, లేని డాబుసరి (హిపోక్రసీ) ప్రదర్శిస్తుంటారు.

ఈ లక్షణాలన్నీ అందరిలో ఉన్నాయని అర్థం కాదు. సాధారణ లక్షణాలు. కొందరిలో ఉండొచ్చు. మరికొందరిలో వుండకపోవచ్చు. కొందరు వినిమయవాదానికి గురికాకపోవచ్చు. ఆర్థిక క్రమశిక్షణ పాటించవచ్చు. ప్రగతిశీల భావాలున్నవారు ఈ సంస్కృతిని తిరస్కరించొచ్చు. కాని సాగుతున్న ప్రధాన ధోరణి ఇదేనని చెప్పక తప్పదు. అభ్యుదయ వాదులు సైతం చాలా సందర్భాలలో ఈ ధోరణులకు గురవుతుంటారన్న సత్యాన్ని గుర్తించాలి. అదే సమయంలో చొరవ, పట్టుదల, ఏదో ఒకటి సాధించి తీరాలన్న దృఢసంకల్పం, సేవాతత్పరత ఉన్న మధ్యతరగతి యువతను కూడా మనం చూస్తాం. ఐటీ రంగం తీసుకొచ్చిన ఆధునిక పని పద్ధతులకు ఈ తరం అలవాటు పడుతోంది. లాజిస్టిక్స్ నిర్వహణలో ఆరితేరుతున్నారు. అలాంటి వారిలో సామాజిక స్పృహను కల్పిస్తే దేశానికి ఎంతో మేలు జరుగుతుంది.

ఏదో ఒక సేవా కార్యక్రమంలో భాగం కావాలన్న తపనతో చాలా మంది ఎన్‌జీవోల్లో చేర్తుంటారు. పైగా ఎన్‌జీవోల్లో పనిచేస్తే అది తమ కెరీర్‌కు కూడా ఉపయోగపడుతుంది. సివి, రెస్యూమ్స్‌లో అది కూడా ఒక భాగం అవుతుంది. యంబిఏ లాంటి కోర్సుల్లో సీటు సంపాదించాలంటే ఏదో ఒక సర్వీసు యాక్టివిటీలో ఉంటే అది కూడా ప్లస్‌పాయింట్ అవుతుంది. ఆ రకంగా కెరీర్‌లో భాగంగా వారు క్రియాశీలురుగా ఉంటారు. ఈక్రియాశీలతను అర్థం చేసుకొని దాని కనుగుణంగా వారిని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయగలిగితే క్రమంగా సమాజాన్ని గురించిన అవగాహన పెరుగుతుంది.

### పట్టణ మధ్యతరగతి యువత

పట్టణాల్లో, అందునా బాగా ఆదాయాలొచ్చే ఉద్యోగాలు, వృత్తుల్లో ఉండటం వల్ల వీరి ప్రభావం వారి స్వంత గ్రామాలపై అధికంగా ఉంటుంది. ముఖ్యంగా ఇటీవల కాలంలో బాగా పెరిగిన ఐటీ ఉద్యోగులు ప్రతి గ్రామంలోనూ ముఖ్యంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పది నుండి యాభై మంది వరకుంటున్నారు. వారిని చూసే మిగతావారు అప్పులు చేసైనా తమ పిల్లలను పెద్దస్కూళ్లలో పెట్టి చదివిస్తున్నారు. వీరు తమ గ్రామాలకు పండుగలు, పబ్బాలకు వెళ్లినప్పుడు ఆటలపోటీలు పెట్టడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, గుళ్లుగోపురాలను

పునరుద్ధరించి పూజలు చేయించడం, ఎవరన్నా పేదవాళ్ళకు సహాయం చేయడం వంటివి చేస్తుంటారు. తద్వారా వీరిపట్ల స్నేహితులు, చుట్టాల్లో అభిమానం పెరుగుతుంది. పర్యావరణ పరిరక్షణ ఇప్పుడు విద్యావిధానంలో భాగంగా మారింది. యువతరంలో దానిపై శ్రద్ధ పెరుగుతోంది. అందువల్లనే పర్యావరణానికి ప్రమాదం తెచ్చే పరిశ్రమలపై వ్యతిరేకత పెరుగుతోంది. రాజకీయాలను సైతం వీరు ప్రభావితం చేస్తుంటారు. ఎన్‌ఆర్‌ఐలు స్థానిక రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్నారు. వీరి సాంస్కృతికస్థాయి ఉన్నతంగా ఉంటుంది. ఆధునిక పట్టణ నాగరికతను వంటపట్టించుకుంటారు.

కొంతమంది ప్రగతిశీలురు వీరిని చూసి అసహ్యయించుకునే ధోరణి కూడా చూస్తాం. వీరితో మిళితం కాలేరు. కొంత మంది మిళితమయ్యే పేరుతో వారిని ప్రభావితం చేయడానికి బదులుగా తామే ప్రభావితమవుతారు. తాగడం, అమ్మాయిల్ని అల్లరి చేయడం, పెద్దలను అవమానించడం, ఆకతాయి పనులు చేయడం, అప్పులు చేసి పబ్‌లకు, మల్టీప్లెక్స్ థియేటర్‌లకు వెళ్లడం, క్రెడిట్‌కార్డులు సంపాదించి ఖరీదైన వస్తువులు కొనడం వగైరా లక్షణాలు నేర్చుకునే వారూ ఉంటారు. ఈ రెండు ధోరణులు తప్పు. వారిని అర్థం చేసుకొని, వారితో కలిసి పోతూనే వారిని మార్చడం అన్నది కమ్యూనిస్టుల కర్తవ్యం. ఈ తరగతి ఆలోచనలు ప్రగతిశీలంగా మారితే దాని ప్రభావమూ గ్రామాలపై ఉంటుంది. ఇది సాధించాలంటే గ్రామ్‌స్కీ చెప్పినట్లు సైద్ధాంతిక ఆధిపత్యం తీసుకురావాలి. మార్క్సిస్టు భావాలతో చదువుకున్న పట్టణ మధ్యతరగతి యువతను ప్రభావితం చేయాలి.

**చరిత్రలో మధ్యతరగతి**

కార్మికవర్గానికి నాయకత్వం అందించిన వారంతా కార్మికవర్గ కుటుంబాల నుండే రాలేదు. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, జ్యోతిబసు, రణదివె వగైరా అనేక మంది నాయకులు మధ్యతరగతి లేదా ఉన్నత మధ్యతరగతి నుండి వచ్చినవారే. స్వాతంత్రోద్యమంలో మధ్యతరగతి పాత్రను మూడు దశలుగా చూస్తాం. మొదటి తరం బ్రిటీషువారికి లొంగి ఉండి వారిలాగా తయారు కావాలని కలలు కనేది. రెండోతరం: బ్రిటీషు పౌరుల్లాగానే తమకూ సమానవకాశాలు కావాలని కోరుకుంది. సంస్కరణల కోసం పోరాడింది. వివేకానంద లాంటి వారు సోషలిస్టు భావాలతో ప్రభావితమయ్యారు. మూడో తరం: బ్రిటీషువారిని తరిమికొట్టాలని పోరాడింది. నెహ్రూ లాంటి వారిని కూడా మార్క్సిస్టు భావాలు ఆకట్టుకున్నాయి. ఈ పరిణామక్రమాన్ని చూసినప్పుడు ప్రస్తుతం మనదేశంలోనూ అలాంటి పరిణామానికి అవకాశం లేదని కొట్టిపారేయలేం. మూడో తరం తన వరకు తాను చురుగ్గా ఉండటమే కాకుండా సాధారణ ప్రజలను కూడగట్టే పని కూడా చేపట్టింది. గాంధీ ఇచ్చిన కార్యక్రమం దీనికి తోడ్పడింది. అదే సమయంలో గాంధీ కార్యక్రమంతో స్వాతంత్ర్యం రాదని నిరాశపడ్డవాళ్లు ప్రత్యామ్నాయం వెదికారు. మొదట భగత్‌సింగ్ లాంటి వాళ్లు వ్యక్తిగతంగా పోరాడినా క్రమంగా కమ్యూనిజం వైపు మొగ్గారు. మొదటితరం కమ్యూనిస్టుల్లో మధ్యతరగతి విద్యావంతులే కాకుండా ధనిక, భూస్వామ్యవర్గాల కుటుంబాల నుండి నాయకులొచ్చారు. సుందరయ్య, ఇయంఎస్ వంటివారు ఈ కోవకు చెందినవారే. టాటాల కుటుంబం నుండే సక్లత్‌వాలాలు ఉద్భవించారు. కాని వారు కూడగట్టింది పనిచేసింది పేదల్లోనే. వారిననుసరించి అనేకమంది పేదవాళ్లు, గ్రామికప్రజలు త్యాగాలు చేసి కమ్యూనిస్టు జెండా చేపట్టారు. సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించారు. నాయకులయ్యారు. స్వాతంత్ర్యానంతరం ముఖ్యంగా 1970లలో ఎమెర్జెన్సీకి వ్యతిరేకంగా జయప్రకాశ్‌నారాయణ నాయకత్వంలోను, కమ్యూనిస్టు ఉద్యమాలతోను మధ్యతరగతి మమేకమైంది. అనేక మంది విద్యార్థి నాయకులు వామపక్ష భావజాలం వైపు మొగ్గారు.

> ❝ పర్యావరణ పరిరక్షణ ఇప్పుడు విద్యావిధానంలో భాగంగా మారింది. యువతరంలో దానిపై శ్రద్ధ పెరుగుతోంది. అందువల్లనే పర్యావరణానికి ప్రమాదం తెచ్చే పరిశ్రమలపై వ్యతిరేకత పెరుగుతోంది. రాజకీయాలను సైతం వీరు ప్రభావితం చేస్తుంటారు. ఎన్‌ఆర్‌ఐలు స్థానిక రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్నారు. వీరి సాంస్కృతికస్థాయి ఉన్నతంగా ఉంటుంది.❞



రానురాను మరింత మంది యువకులు ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు.

**వర్తమాన భారతంలో మధ్యతరగతి**

ఇటీవల అవినీతి వ్యతిరేకోద్యమంలోనూ, మహిళలపై సాగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగానూ పట్టణ మధ్యతరగతిలో కదలికను చూస్తాం. ఈ నయా-మధ్యతరగతి యువతరంలో వస్తున్న ఈ ధోరణిని గమనించి తదనుగుణంగా వారిని ఉద్యమాల్లో ఇముడ్చుకోవాలి. లేకుంటే వారిలోని కార్యశీలతను మతోన్మాదులు, ఫాసిస్టులు తరలించుకుపోయే ప్రమాదం ఉంది. ఫాసిజానికి మూలమైన ఆలోచనా పూర్వరంగం కూడా ఇదే తరగతిలో చూస్తాం. సామాజిక మూలాల్లోంచే ఈ ఆలోచన పుడుతుంది. దీనికి వారిని దూరంగా ఉంచాలంటే అభ్యుదయ కార్యకలాపాల్లో వారిని చురుగ్గా భాగస్వాముల్ని చేయాలి.

**ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని నిర్మించాలి**

మధ్యతరగతి యువతను భాగస్వాముల్ని చేసే సమిష్టి కార్యాచరణ పద్ధతులను రూపొందించాలి. పోరాటస్ఫూర్తిని పెంచాలి. సమరశీల కార్యకలాపాల్లో భాగస్వాముల్ని చేయాలి. ఆధునిక సాధనాలను ఇందుకు వాడుకోవాలి. పట్టణాల్లో మధ్యతరగతి ఎదుర్కొనే సమస్యలేమిటో గుర్తించాలి. ఉదాహరణకు విద్యుత్, నీరు, మురికికాల్వలు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, అవినీతి వగైరా వగైరా..వీటితో వారు విసిగెత్తి ఉన్నారా? ఇంకా భరించగలిగిన

> **"మధ్యతరగతిని కలసుకోడానికి ఆఫీసులు, పార్కులు, వాకర్స్, ఇంటిపరిసరాలు, మార్కెట్‌లు ముఖ్యమైన స్థలాలు. ప్రత్యక్షంగా కాకుండా ఇంటర్ నెట్, సోషల్‌మీడియా ద్వారా యువతరంతో నిరంతరం కాంటాక్టులో ఉండొచ్చు. చర్చించొచ్చు. కూడగట్చొచ్చు. సెల్‌ఫోన్ ఈ విషయంలో అది పెద్ద సాధనంగా ఉపయోగపడుతుంది."**

స్థాయిలో ఉన్నారా? పాలకులపై భ్రమల్లో ఉన్నారా? ఉద్యమాల వైపు చూస్తున్నారా? వగైరా అంచనా వేసుకోవాలి. ప్రకృతి వనరులు ప్రైవేటుపరం అయ్యే కొద్దీ భూమి, నీరు, విద్యుత్, గ్యాస్ వగైరా కొరతలు తీవ్ర సమస్యలుగా ముందుకొస్తాయి. వృద్ధాప్యం శాపంగా మారుతుంది. పెన్షన్, పొదుపు, షేర్‌మార్కెట్ల గల్లంతు వంటి సమస్యలు పీడిస్తుంటాయి. సాంస్కృతిక శూన్యత, పశ్చిమదేశాల సంస్కృతి వీరిని మరింత అశాంతికి గురి చేస్తుంది. సమస్యల సుడిగుండంలో చిక్కుకుపోతున్న వీరికి దారి చూపి దానికి ఒక ఉద్యమ స్వరూపం ఇవ్వాల్సిన బాధ్యత కార్మికోద్యమంపై ఉంది.

మధ్యతరగతిని కలసుకోడానికి ఆఫీసులు, పార్కులు, వాకర్స్, ఇంటిపరిసరాలు, మార్కెట్‌లు ముఖ్యమైన స్థలాలు. ప్రత్యక్షంగా కాకుండా ఇంటర్‌నెట్, సోషల్‌మీడియా ద్వారా యువతరంతో నిరంతరం కాంటాక్టులో ఉండొచ్చు. చర్చించొచ్చు. కూడగట్చొచ్చు. సెల్‌ఫోన్ ఈ విషయంలో అది పెద్ద సాధనంగా ఉపయోగ పడుతుంది. పట్టణ సంస్కరణలు మోపుతున్న భారాలపై కదిలించాలి. దానికోసం పౌరసంఘాలు పెట్టొచ్చు. అపార్ట్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేయొచ్చు. వారిని సంఘటితం చేయడానికి ఇలా పలు మార్గాలున్నాయి. నిర్మాణాత్మక కార్యక్రమాల్లో వారిని ప్రత్యక్షంగా భాగస్వాముల్ని చేయొచ్చు. ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు సహాయకార్యక్రమాలు నిర్వహించాలి. సహకార సంఘాలు నడపొచ్చు. అన్నింటికీ మించి విద్య, వైద్య అవసరాల్లో వారికి చేదోడువాదోడుగా ఉండాలి. ప్రత్యామ్నాయ మార్గాలను ప్రచారం చేయాలి. క్రీడా, సాంస్కృతిక కమ్యూనిటీలు ఏర్పాటు చేయొచ్చు. అన్ని మతాలు, కులాలు, ప్రాంతాలకు చెందిన పండుగలను నూతన సంస్కృతికి నెలవుగా మార్చాలి. పిల్లల పార్కుల కోసం పోరాడొచ్చు. యవ్వనదశలో భావాలు ఒక రూపం తీసుకోకముందే ప్రగతిశీల భావాలతో ప్రభావితం చేయగలిగితే సామాజిక మార్పు కోసం పోరాడే ఒక నూతన తరం ఆవిర్భవిస్తుంది. మధ్యతరగతి యువతలో సేవాభావం, దేశభక్తి, లౌకికభావాలు, ప్రగతిశీల సామాజిక భావాలున్నవారిని గుర్తించాలి. వారు సామాజిక ఉద్యమ కార్యకర్తలుగా అభివృద్ధి అవుతారు. ఇలాంటి మధ్యతరగతి సైన్యాన్ని సృష్టిస్తే కార్మికవర్గానికి పెద్ద అండ దొరకడమే కాదు ఫాసిజానికి కూడా ఘోరీ కట్టినట్లే.

## అభిప్రాయాలు

### ఏచూరిగారి వ్యాసం బాగుంది

మార్క్సిస్టు ఫిబ్రవరి సంచికలో పొలిట్ బ్యూరో సభ్యులు సీతారామ్ ఏచూరి రాసిన 'ప్రత్యామ్నాయ విధానాల కోసం రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం' అనే వ్యాసం బాగుంది. నేడు ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, భారత ఉపఖండంలో పెరుగుతున్న మితవాదం, దోహా చర్చలు, వాతావరణ సంక్షోభం, రాజకీయ ప్రత్యామ్నాయాల అవసరంపైన ఏచూరిగారిచ్చిన వివరణ పాఠకులకు అర్థమయ్యేవిధంగా ఉంది. 2008లో అమెరికాలో ఏర్పడిన ద్రవ్య సంక్షోభం ప్రపంచం అంతా చుట్టుముట్టింది. ప్రపంచ బ్యాంకు అప్పులకు తట్టుకోలేక, దాని షరతులకు లోబడి అనేక దేశాలు ప్రజలపై భారాలు వేస్తున్నాయి. పనిగంటలు పెంచడం, కనీస వేతనాలు అమలు చేయకపోవడం, నిత్యావసర ధరల విపరీతంగా పెంచడం వల్ల సామాన్య ప్రజలే కాక మధ్యతరగతి ప్రజలు కూడా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరుగుతున్నది. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పోరాటాలు చేయాల్సి వస్తున్నది.

ప్రపంచ ఆర్థిక సంక్షోభం మన దేశంపై కూడా పడి జిడిపి 9 శాతం నుండి 5 శాతానికి పడిపోయింది. వ్యవసాయం, చేనేత కార్మికులు అధోగతివైపు పయనిస్తున్నారు. విద్య, వైద్యం వ్యాపారంగా మారిపోయింది. యుపిఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఇటువంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మరో ప్రమాదం బిజెపి మతతత్వ శక్తుల ద్వారా రాబోతున్నది. మతోన్మాదం ప్రజలమధ్య ఐక్యతను చెడగొట్టడమే కాకుండా విప్లవోద్యమాలకు ఆటంకంగా ఉంది.

కాంగ్రెస్, బిజెపీలు దొందూ దొందే. పార్టీలు వేరుగాని వాటి విధానాలు ఒక్కటే. ఎన్నికల ప్రచారంలో మాత్రం ఒకదానిపై మరొకటి దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. అందుకే ఎన్డీఏ, యుపిఏ కూటములకు వ్యతిరేకంగా, వామపక్షాల ప్రమేయం గల ప్రత్యామ్నాయ కూటమి అసవరం ఎంతైనా ఉంది. ఇటువంటి ప్రత్యామ్నాయాలను గెలిపించుకోవలసిన అవసరం మనపై ఉంది. మంచి వ్యాసం రాసిన కా॥ ఏచూరి గారికి మరోమారు ధన్యవాదాలు.

**హరి,** (సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు)
పెనుగొండ మండలం, అనంతపురం జిల్లా.

### దీర్ఘకాల ఉద్యమాలతోనే కులవివక్ష అంతం

ఎడిటర్‌గారికి నమస్కారం, మార్చి నెల మార్క్సిస్టు సంచికలో "కుల వివక్ష పోవాలంటే ఆర్థిక సాధికారికత ఒక్కటే సరిపోదు" వ్యాసం వాస్తవానికి అద్దం పట్టింది. రచయిత రాఘవులుగారికి అభినందనలు. ప్రత్యక్షంగా, పరోక్షంగా దళితుల సామాజిక జీవితంపై అధ్యయనం, సంబంధాలు ఉండడంవల్లనే ఈ వ్యాసం రాయగలిగారు. 1956లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి 2000 సంవత్సరం వరకు 43 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ చేసినట్లు చూపిస్తున్న లెక్కలు అవాస్తవం, అంకెల గారడీ మాత్రమే. ఇప్పటికీ దళితుల సాగులో భూమి లేని గ్రామాలు వేలాదిగా ఉన్నాయి. దళితులపై రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక అసమానత కొనసాగడంతోపాటు దాడులు, హత్యలు జరుగుతున్నాయి. కుల నిర్మూలన కోసం ఉద్యమాలు నిర్మించవలసిన ఆవశ్యకత ఉంది. దాన్ని సాంస్కృతిక విప్లవంలో భాగంగా చూడాలి. కుల వివక్ష అంతానికి దీర్ఘ కాల ఉద్యమాలే పరిష్కారం.

**టి. శ్రీరామమూర్తి**
జోగవారి పాలెం, న్యూ గాజువాక,
విశాఖపట్నం - 530026

**మీడియా**

# రాజకీయ విలువలకు అర్థాలు మారుస్తున్న కార్పొరేట్ మీడియా



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు, సిఐటియు నాయకుడు.

**ఎస్. వీరయ్య**

అనూహ్యమైన రీతిలో పార్టీ ఫిరాయింపులు ఊపందుకున్నాయి. నిన్నటిదాకా తిట్టిన పార్టీలోనే తీర్థం పుచ్చుకుంటున్నారు. పార్టీ టిక్కెట్ల కోసం కోట్లు చేతులు మారుతున్నాయి. అయినా మీడియాలో విలువల గురించి చర్చ పెద్దగా లేదు. కారణమేమిటి? గతంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పుట్టిన ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లోనే విలీనం అయ్యింది. ఇప్పుడు కులతత్వం, మతతత్వం, అవినీతికి వ్యతిరేకంగా, దేశ సమగ్రత అంటూ ఆదర్శాలు వల్లిస్తూ పుట్టిన జనసేన ఈ అవలక్షణాల కూపంగా ఉన్న బిజెపితోనే జతకట్టింది. విలువల కోసమే పుట్టినట్టు చెప్పుకున్న లోక్‌సత్తా కూడా బిజెపితో పొత్తుకు సిద్ధపడ్డది. ఆశ్చర్యకరంగా బిజెపి మతతత్వ పార్టీ కాదని కూడా జయప్రకాశ్ నారాయణ్ చెప్పారు. ఎందువల్ల? విలువల గురించి అదేపనిగా నిన్నటిదాకా సుద్దులు చెప్పిన మీడియాలో ఒక సెక్షన్, కొన్ని పార్టీల నోళ్ళెందుకు మూతపడ్డాయి? విలువలకు వలువలూడినా పట్టించుకోని ఈ దుస్థితి ఎందుకొచ్చింది?

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రముఖ నాయకులు వందల సంఖ్యలో పార్టీలు ఫిరాయిస్తున్నారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ముఖ్యమైన పరిణామం. విధానం లేదు. కట్టుబాట్లు లేవు. ఎవరు ఏపార్టీ నుండి ఏ పార్టీలోనైనా దూకవచ్చు. ఫిరాయించే వారికిగాని, చేర్చుకునేవారికిగాని బిడియం లేదు. పదవీ, అధికారమే లక్ష్యంగా సాగుతున్న ప్రయాణమిది. అన్ని ప్రధాన పార్టీలలో తమ కుటుంబీకులు లేదా బంధువులు టిక్కెట్లు పొందేటట్టు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ ఫిరాయింపుల పర్వం ఊపందుకున్నది. బహుశా ఈ నిర్లజ్జ వ్యవహారంలో మన రాష్ట్రానిదే అగ్రస్థానం. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్ళిన రఘురామ కృష్ణంరాజును విభజనకు సహకరించిన బిజెపి నాయకత్వం తమ పార్టీలో చేర్చుకున్నది. సమైక్యాంధ్ర కోసం ఉద్యమించిన పురంధేశ్వరి కూడా విభజనకు కారణమైన బిజెపిలో చేరారు. నిన్నటిదాకా చంద్రబాబు నాయుడును తూర్పారబట్టిన కరుడుగట్టిన కాంగ్రెస్ నాయకులు అనేక మంది టిడిపిలో చేరారు. మన పక్క రాష్ట్రమైన కర్ణాటకలో కూడా అవినీతికి మారుపేరుగా ప్రసిద్ధికెక్కిన మాజీ ముఖ్యమంత్రి యెడ్యూరప్పను, మైనింగ్ మాఫియా గాలిజనార్ధన్‌రెడ్డి కుడిభుజమైన శ్రీరాములును కూడా మళ్ళీ బిజెపి చేర్చుకున్నది.

1990 తరువాత కేంద్రంలోగానీ, రాష్ట్రంలోనిగానీ ఏ పార్టీ అధికారంలోకొచ్చినా ఆర్థిక విధానాల్లో మౌలికమైన తేడాలేదు. సరళీకృత ఆర్థిక విధానాలనే అమలు చేస్తున్నారు. ప్రయోజనాలలోనూ తేడా లేదు. రోజురోజుకూ మరింత బహిరంగంగా పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాల కోసం బరితెగించి పనిచేస్తున్నారు. ఇందులో విదేశీ, స్వదేశీ తేడాలేదు. బూర్జువా పార్టీలన్నింటి లక్ష్యం అధికారం సంపాదించటమే. దానికోసం ఏం చేయడానికైనా సిద్ధం.

**మొదట్లో ప్రాంతీయ పార్టీలు జాతి, భాష ప్రయోజనాల కోసం నిలబడేవి. ఫెడరల్ రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నించేవి. ప్రజాస్వామ్య హక్కుల కోసం నిలబడేవి. ప్రాంతీయ మార్కెట్ ప్రయోజనాల కోసం బడాపెట్టుబడిదారీ వర్గంతోనూ, విదేశీ పెట్టుబడితోనూ ఘర్షణకు సిద్ధపడేవి. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణులను ప్రతిఘటించేవి. లౌకిక తత్వానికి కట్టుబడేవి. క్రమంగా కేంద్రంలో ఏకపార్టీ పాలన అంతమైంది. సంకీర్ణయుగం సుదీర్ఘకాలంగా సాగుతున్నది. కేంద్ర ప్రభుత్వంలో కూడా ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత పెరిగింది. అత్యధిక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలపడ్డాయి. క్రమంగా కాంగ్రెస్, బిజెపిల నాయకత్వంలో ఏర్పడిన ఫ్రంటులకు ప్రత్యామ్నాయంగా మరో ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పాటుకు అవకాశాలు ఏర్పడ్డాయి. కానీ, సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమైన తరువాత అన్ని తరగతుల బూర్జువా వర్గానికి విదేశీ పెట్టుబడితోనూ, మార్కెట్‌తోనూ సంబంధం పెట్టుకునే అవకాశం వచ్చింది. ఢిల్లీ పీఠంలో వాటా వుంటే ఈ పని మరింత ప్రయోజనకరంగా మారుతుంది. అంతేకాదు, సరళీకృత విధానాల పర్యవసానంగా ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం పుంజుకున్నది. అధికారంలో ఉంటే ప్రజల సంపదను ఎంతైనా కొల్లగొట్టవచ్చు. కొద్దికాలంలోనే కోట్లకు పడగలెత్తవచ్చు. అందుకే బూర్జువా పార్టీలన్నీ అధికారంలో స్థానం సంపాదించుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నాయి. కాంగ్రెస్, బిజెపిల మధ్య ఆర్థిక విధానాల్లో తేడా లేదు. అవినీతిలోనూ, ముఠాకుమ్ములాటలలోనూ, అధికార దాహంలోనూ పోటీ పడుతున్నాయి. ప్రాంతీయ పార్టీల్లో కూడా అవకాశవాద ధోరణులు బలపడ్డాయి. అధికార పీఠం పొందడానికి ఎవరితో కలవడానికైనా వారు సిద్ధమే. మతోన్మాదంతోనూ, నియంతృత్వ ధోరణులతోనూ రాజీ పడడానికి వెనకాడడంలేదు. ఆర్థిక విధానాల్లోనూ, ప్రయోజనాల్లోనూ మౌలికమైన తేడా లేకపోవడంతో కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా**

**"ప్రజాప్రయోజనాలను పక్కకు నెట్టి పరిపాలనా దక్షత, సుస్థిర ప్రభుత్వం వంటి అంశాలను ముందుకు తెస్తున్నారు. ప్రజావ్యతిరేక విధానాలను ఎంత పాలనా దక్షతగల నాయకులు అమలు జరిపితే ప్రజలకు అంత హాని జరుగుతుంది. ఈ విధానాలు అమలు జరిపే సుస్థిర ప్రభుత్వం అంటే ప్రజాస్వామ్య హక్కులను కాలరాయ డమే."**



జంప్ జిలానీలు: మంత్రులు టీజీ, ఏరాసు, గంటా

**నికరంగా నిలబడవలసిన అవసరం వారికి కనిపించడంలేదు. విలువలు, ప్రజాప్రయోజనా లకన్నా అధికారంలో భాగం సంపాదించటమే వారికి లాభదాయకంగా ఉన్నది.**

పెట్టుబడిదారీ వర్గానికి సంబంధించినంత వరకు అధికారంలో ఉన్నది కాంగ్రెస్ నాయ కత్వంలో లేదా బిజెపి నాయకత్వంలోని కూటమా లేక ఈ రెండు పార్టీలు లేని ప్రాంతీయ పార్టీల కూటమా అన్నదానితో సంబంధం లేదు. ఎవరు అధికారంలో ఉన్నా వారి ప్రయోజ నాలకు ఢోకా లేదు. కానీ, సరళీకృత ఆర్థిక విధానాలు సక్రమంగా అమలు జరపడానికి సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రభుత్వం వారికి అవసరం. అందుకే ప్రాంతీయ పార్టీల కూటమి కన్నా కాంగ్రెస్ నాయకత్వంలోనో, బిజెపి నాయకత్వంలోనో ఏర్పడే ప్రభుత్వాలను వారు కోరుకుంటారు. ప్రాంతీయ పార్టీల కూటమి అనివార్యమయ్యే పరిస్థితే వస్తే అది కనీసం వామపక్షాలతో సంబంధంలేని కూటమి కావా లని కూడా కోరుకుంటారు. వామపక్షాలు ప్రజాప్రయోజనాలు కాపాడటం కోసం కృషి చేస్తున్నాయి. కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలను ఐక్యం చేసేందుకు ప్రయ త్నిస్తున్నాయి. బూర్జువా వర్గం శక్తిని బలహీన పర్చడం కోసం, వారి మధ్య వైరుధ్యాలను పెంచడం, లౌకికతత్వ పరిరక్షణ కోసమే వామ పక్షాల ప్రయత్నం. కానీ, వారి మధ్య వైరుధ్యాల కన్నా వారి సాధారణ ప్రయోజనాలే ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. అందుకే విలువలకు తిలోదకా లిచ్చి స్వార్థమే పరమావధిగా బూర్జువా పార్టీలు పనిచేస్తున్నాయి. పైగా మూడో ఫ్రంటు నిలదొక్కు కుంటే వామపక్షాల జోక్యానికి అవకాశాలు పెరుగుతాయి. అందుకే రెండు పార్టీల వ్యవస్థకు ఈ దేశంలో అవకాశం లేకపోయినా రెండు కూటముల వ్యవస్థనైనా స్థిరపరుచుకోవాలని బడా బూర్జువావర్గం ప్రయత్నిస్తున్నది. సామ్రాజ్య వాదులు, బహుళజాతి కంపెనీలు కోరుకునేది కూడా ఇదేకదా!

ప్రజాప్రయోజనాలను పక్కకు నెట్టి పరిపా లనా దక్షత, సుస్థిర ప్రభుత్వం వంటి అంశాలను ముందుకు తెస్తున్నారు. ప్రజావ్యతిరేక విధానా లను ఎంత పాలనాదక్షతగల నాయకులు అమలు జరిపితే ప్రజలకు అంత హాని జరుగు తుంది. ఈ విధానాలు అమలు జరిపే సుస్థిర ప్రభుత్వం అంటే ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే. అందుకోసమే ప్రజల భాగస్వా మ్యం స్థానంలో వ్యక్తుల గొప్పతనాన్ని ఆకాశాని కెత్తుతున్నారు. మన దేశంలో ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అమలులో ఉన్నది. ప్రజాప్రతి నిధులైన పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులతో కూడిన పార్లమెంటు, శాసనసభ వంటి చట్ట సభలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రధానితో సహా మంత్రులు, అధికారులందరూ చట్ట సభలకు జవాబుదారీ. కానీ, ఈ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి పేరుతో కొత్త చర్చ ప్రారంభిం చారు. క్రమంగా చట్ట సభల స్థానంలో ఏక వ్యక్తి పాలనకు మద్దతు సమీకరించే ప్రయత్నమే ఇది. అంటే, ప్రజాస్వామ్యం పేరుతోనే ప్రజాస్వా మ్యాన్ని ఖూనీ చేయడమే కదా! ఎన్నికల్లో డబ్బు పాత్రను, రాజకీయాల్లో నేరస్తుల పాత్రను నిరోధించేందుకు ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే బదులు చట్టాల ద్వారా, న్యాయస్థానాల ద్వా రానే అన్నీ సాధించవచ్చుననే ప్రచారం సాగు తున్నది. పాలనా సౌలభ్యం, అధికార వికేంద్రీ కరణ పేరుతో చిన్న రాష్ట్రాల ఏర్పాటును సమర్థిస్తున్నారు. రాష్ట్రాల శక్తిని బలహీనపరుస్తూ కేంద్రం అధికారాన్ని మరింత బలోపేతం చేసే పథకంలో భాగమే ఇది. వనరుల కేంద్రీకరణ కూడా అదే ధోరణితో సాగుతున్నది.

న్యాయవ్యవస్థపైన కూడా ఈ విధానాలు ప్రభావం చూపుతున్నాయి. శిక్ష పడిన ప్రజాప్రతినిధుల రాజీనామా గురించిగానీ, సమాచార హక్కు చట్టం పరిధిలోకి రాజకీయ పార్టీలను తేవాలన్న విషయంలోగానీ న్యాయ స్థానాల జోక్యం ఈ దిశలోనే ఉన్నది. రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలు చేయరాదనడం కూడా ఈ కోవలోదే. అన్ని పార్టీలు సరళీకృత ఆర్థిక విధానాలకు అనుగుణంగానే వాగ్దానాలు చేయాలని చెప్పడమే. మీడియాపైన కూడా కార్పొరేట్ శక్తుల పట్టు పెరిగింది. పెట్టుబడి



**బిజేపీ తీర్థం పుచ్చుకున్న కేంద్ర మంత్రి పురందరేశ్వరి**

దారులు కోరుకున్నదే వార్తగా మారుతున్నది.

దేశంలో కాంగ్రెస్ భ్రష్టుపట్టి పోయింది. నరేంద్రమోడీ నాయకత్వంలో బిజెపి కూటమినే ప్రత్యామ్నాయంగా పెట్టుబడిదారీ వర్గం చూప దలిచింది. అందుకే మీడియా కూడా మోడీని ఆకాశానికి ఎత్తుతున్నది. తెలంగాణలోగానీ, కొత్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోగానీ ఏ పార్టీ గెలిచినా, ఎవరి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడినా ఢిల్లీలో నరేంద్రమోడీని సమర్థించేదిగానే ఉండాలని పెట్టుబడిదారీ వర్గం బలంగా కోరు కుంటున్నది. ఇందుకు అనుగుణంగానే ఇక్కడి ప్రాంతీయ పార్టీలు అడుగులు వేస్తున్నాయి. ఇందుకోసమే పెద్దఎత్తున ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. వికృత రూపంలో జరుగు తున్న వీటిని ఫిరాయింపులనకుండా, రాజకీయ పునరేకీకరణ అంటూ మీడియా ముద్దు మాటలు చెబుతున్నది. పార్టీలు ఫిరాయించినా, టికెట్ల కోసం కోట్లు కుమ్మరించినా, కాంగ్రెస్ సరసన చేరినా లేదా బిజెపి విషకౌగిట్లో దూరినా విలు వలకు తిలోదకాలిచ్చినట్టుగా పరిగణించటం లేదు. ఇది వ్యక్తులు చేసినా, రాజకీయ పార్టీలు చేసినా తప్పు పట్టడంలేదు. ఇప్పుడు విలువల గురించి చర్చ జరిగితే ప్రత్యామ్నాయ విధానాల గురించిన చర్చ ముందుకొస్తుంది. అప్పుడు మోడి నాయకత్వానికి మిత్రులు కరువయ్యే అవకాశ ముంది. వామపక్షాల ప్రాధాన్యత పెరిగే అవకాశ ముంది. అందుకే మీడియా కూడా విలువలకు తిలోదకాలిస్తూ, అసలు విలువలకే అర్థాలు మారుస్తున్నది. ●

నేటి భారతం

# రిలయన్స్ అక్రమాలపై ఊపందుకుంటున్న చర్చ



రచయిత ఫ్రంట్‌లైన్ పత్రిక డిప్యూటీ ఎడిటర్. పత్రికలో తరచు వ్యాసాలు రాస్తారు.

**వెంకటేష్ రామకృష్ణన్**

ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ క్రోని కేపిటలిజం (ఆశ్రిత పెట్టుబడి దారీ విధానం) మీద, అందులోనూ రిలయన్స్ మీద కేంద్రీకరించి, దానికీ రెండు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బి.జె.పిలకూ ఉన్న అనుబంధంపైన చేస్తున్న ప్రచారం ఈ సార్వత్రిక ఎన్నికలలో ప్రధాన చర్చనీయాంశంగా మారనుంది.

భారతదేశంలోనే అతిపెద్ద కార్పోరేట్ గ్రూపుగా ఎదిగిన రిలయన్స్ గురించీ, మరీ ముఖ్యంగా ఆ సంస్థ శీఘ్రాభివృద్ధి గురించీ, దానికోసం ఆ సంస్థ యజమాని ధీరూభాయ్ అంబానీ, ఆయన కుమారులు ముఖేష్ అంబానీ, అనీల్ అంబానీలు అనుసరించే పద్ధతులు, విధానాల గురించీ మూడు దశాబ్దాలుగా భారత రాజకీయ, ఆర్థిక, మీడియా వర్గాలలో నిరంతరం చర్చ జరుగుతూనే ఉంది. ఈ కార్పోరేట్ గ్రూపు ఏ విధంగా ప్రభుత్వ విభాగాలనూ, పరిపాలనా యంత్రాంగాన్నీ గుప్పెట్లో పెట్టుకుని లబ్ధి పొందిందనేది నిరంతరం ఈ చర్చలలో నలుగుతున్న సారాంశం. అదే విధంగా కార్పోరేట్ గ్రూపూ, దాని సారథులూ ప్రభుత్వ పరిపాలనా అధికార యంత్రాంగాన్నీ, రాజకీయ నాయకులనూ, ప్రభుత్వ విధి విధానాలనూ తారుమారు చేస్తున్న తీరు అనేక విమర్శలకు దారితీసింది. దీనిపై జరిగిన చర్చవల్ల చాలా సందర్భాలలో పార్లమెంట్ సమావేశాలకు కూడా అంతరాయం కలిగింది. కొన్ని సందర్భాల్లో న్యాయ పోరాటాలకూ విషయం వెళ్లింది.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ మధ్య కాలంలో మీడియాలో రిలయన్స్ గ్రూపు మీద కేంద్రీకరించబడి వస్తున్న సమాచారం, వార్తలూ ఇంతకు మునుపెన్నడూ లేనంత వాడిగా, వేడిగా ఉన్నాయి. కార్పోరేట్ గ్రూపు మొత్తాన్ని నడిపిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, (ఆర్ఐఎల్ – రిల్) దాని అనుబంధ పరిశ్రమలు, వివిధ రంగాలలో విస్తరించి ఉన్న దాని శాఖల పని తీరు ఈ ఎన్నికలలో ఒక ప్రధాన చర్చనీయాంశమైంది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బి.జె.పి, వాటి నాయకత్వం, ఆర్.ఐ.ఎల్ (రిల్) ప్రయోజనాలు నెరవేర్చడానికి ఎలా పోటీ పడి పనిచేస్తున్నాయనేది ఈ చర్చలో ప్రధానాంశంగా ఉంది. గత మూడు దశాబ్ధాలుగా రిలయన్స్ గ్రూపుకి అనుకూలంగా పరిపాలన విధానాలను మార్చివేశారు. బడ్జెట్‌లో దానికి అనుకూలంగా కేటాయింపులు జరిపారు. చట్టాలను చుట్టచుట్టి నిర్ధిష్ట ప్రమాణాలు పాటించకుండా ఒక పద్ధతి ప్రకారం 'రిల్'కు సహాయం అందించారు. వీటన్నిటి కారణంగానే నేడు అనేక కొత్త వివాదాలు తెర మీదకు రావటంతోపాటు, గతంలో లేవనెత్తిన వివాదాలపై కూడా మళ్లీ లోతుగా దృష్టి సారించబడుతోంది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్) ఎదుగుదలకు కారణమైన ఈ మలుపులన్నింటిపై నేడు చర్చ జరగడానికి మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడైన అరవింద్ కేజ్రీవాల్ పదవిలో ఉన్న 49 రోజులలోనూ, ఆ తర్వాతా నడుపుతున్న రాజకీయ పోరాటమే కారణం అనడంలో అతిశయోక్తి లేదు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా పదవిలో ఉన్న కొద్ది కాలంలో ఆయన ముఖేష్ అంబానీ, అనీల్ అంబానీలకు చెందిన కంపెనీలపై చర్యలు తీసుకున్నారు. ఆమ్ ఆద్మీ ప్రభుత్వం సహజ వాయు ధరల అక్రమాలపై ముఖేష్ అంబానీ కంపెనీ, యూనియన్ పెట్రోలియం మంత్రి ఎమ్. వీరప్పమొయిలీ, మరికొంత మంది ఇతరులపై పోలీసు స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసింది. అలాగే అనీల్ అంబానీ నడుపుతున్న విద్యుత్తు కంపెనీ ఆర్థిక లావాదేవీలపై విచారణ జరిపించాలని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ను ఆదేశించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 14న ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన జన్ లోక్‌పాల్ బిల్లును, కాంగ్రెస్, బి.జె.పి, ఒకే సభ్యుడున్న జనతాదల్ (యునైటెడ్) కలిసి ఓడించాయి. ఆ వెంటనే కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ రెండు ప్రధాన జాతీయ రాజకీయ పార్టీలు ఏకమై ఈ బిల్లును ఓడించాయనీ, దానికి కారణం భారతదేశంలో "క్రోనీ కేపిటలిజం" (అశ్రిత పెట్టుబడిదారీ వర్గం)కు ఆద్యుడిగా, దూతగా ఉండి అడ్డగోలు లాభాల కోసం వెంపర్లాడిన రిలయన్స్ గ్రూపుపై తాను చేపట్టిన కఠిన చర్య లేనని ప్రకటించారు.

అతిపెద్ద వ్యాపార సంస్థలు, కార్పోరేట్ శక్తుల స్వార్థానికి తానూ, తన పార్టీ బలైపోయాయని చెప్పటంద్వారా కేజ్రీవాల్ ప్రజల మనోభావాలను గెలుచుకోవటంలో సఫలీకృత్యులయ్యారు. ప్రజా మద్ధతు కూడగట్టగలిగాననే ధైర్యంతోనే కేజ్రీవాల్ రెండు ప్రధాన రాజకీయ పార్టీల నాయకత్వాన్ని రిలయన్స్ గ్రూపు నడిపిస్తోందని ఆరోపించడటమే కాకుండా, బి.జె.పి. ప్రధాన మంత్రి అభ్యర్థి అయిన నరేంద్రమోడీకీ, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడైన రాహుల్ గాంధీకీ ఉత్తరాలు సంధించారు. కృష్ణా–గోదావరి గ్యాస్ బేసిన్‌లో రిలయన్స్ జరుపుతున్న సహజవాయు తవ్వకాలపైనా, పెట్రోలియంశాఖ చేసిన సహజ వాయు ధరల నిర్ణయంపైనా వారి అభిప్రాయాలు తెలపమని డిమాండ్ చేశారు. ఊహించినట్టుగానే ఈ ఉత్తరానికి రెండు ప్రధాన పార్టీల నుండి ఎటువంటి స్పందన రాలేదు. రిలయన్స్ గ్రూపు గుప్పెట్లో ఉన్నందునే కాంగ్రెస్, బి.జె.పి.లు ఈ అంశాలపై స్పందించలేకపోతున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ విమర్శించింది.

**“ ఈ చర్చ వల్ల ఈ రోజు రిలయన్స్ గ్రూపుకు చెందిన బహుళార్ధ ప్రాజెక్టులపై సమీక్షించే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆర్థిక రంగంలో అది నిర్వహిస్తున్న విభిన్న కార్యకలాపాలపైనా, వ్యాపారం, పరిశ్రమలు ఎనర్జీ, టెక్స్ టైల్స్, కమ్యూనికేషన్స్, మీడియా రంగాలలో ఆ గ్రూపు కార్యకలాపాలన్నింటిపైనా రెట్టింపు ఉత్సాహంతో చర్చ జరుగుతోంది. ”**


కేజ్రీవాల్

ఈ చర్చ వల్ల ఈ రోజు రిలయన్స్ గ్రూపుకు చెందిన బహుళార్ధ ప్రాజెక్టులపై సమీక్షించే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆర్థిక రంగంలో అది నిర్వహిస్తున్న విభిన్న కార్యకలాపాలపైనా, వ్యాపారం, పరిశ్రమలు ఎనర్జీ, టెక్స్‌టైల్స్, కమ్యూనికేషన్స్, మీడియా రంగాలలో ఆ గ్రూపు కార్యకలాపాలన్నింటిపైనా రెట్టింపు ఉత్సాహంతో చర్చ జరుగుతోంది. ఈ మొత్తం ప్రక్రియలో భాగస్వాములై, చర్చలు జరుపుతున్నది దేశంలోని ఉన్నత శ్రేణి మధ్య తరగతి వర్గంలో ఒక భాగం. అది విమర్శనా పూర్వకంగా కావచ్చు లేదా రిలయన్స్‌కు మద్ధతుగా కావచ్చు. కానీ, ఆమ్ ఆద్మీ పార్టీ తన ప్రచారం ద్వారా ఈ అంశాన్ని చాలా విజయవంతంగా హద్దులు బద్ధలు కొట్టి విశాలమైన సామాన్య జన బాహుళ్యంలోకి కూడా తీసుకెళ్ళగలిగిందనడంలో సందేహం లేదు. ఇప్పటి వరకు ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ద్వారా ప్రభుత్వ కార్యకలాపాలనూ, పరిపాలన యంత్రాంగాన్ని కూడా ప్రభావితం చేయగలిగిన కార్పోరేట్ శక్తుల కుట్రలు గురించి తెలియని సామాన్యులకి కూడా తెలిసేలా చేయగలిగింది.

అర్బన్ ఢిల్లీలో మెట్రోలీ ప్రాంతంలో పని చేస్తున్న ఇంటిపని వారినీ, ఉత్తరప్రదేశ్‌లో ప్రతాప్‌ఘర్ ప్రాంతంలోని గ్రామీణ రైతాంగాన్నీ ఈ విలేకరి ప్రశ్నించినపుడు వారి నుండి వచ్చిన సమాధానాలు కేజ్రీవాల్ రాజీనామా అనంతర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ఢిల్లీ అర్బన్‌లో ఉన్న ఈ ఇంటి పనివారు లేదా కార్మికవర్గం చెప్పిందేమిటంటే.... 'కొంత మంది పెద్ద మనుషులు కేజ్రీవాల్ లాంటి వారిని మంచి పనులు చేయకుండా అడ్డుతగులుతున్నారు, అడ్డు తప్పించారు. అందుకే ఆయనలాంటి వారిని పెద్ద కుర్చీలో కూర్చోబెడితేకాని లాభంలేదు' ప్రతాప్‌ఘర్‌లోని వ్యవసాయ కార్మికులు, చిన్న రైతులు తమ పిల్లలను, బంధువులను ఉపాధి కోసం ఢిల్లీ పంపారు. వారక్కడ కూరగాయలు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. వారిచ్చిన సమాచారం ప్రకారం ఆ వ్యవసాయ కార్మికులు, రైతులు.... 'కేజ్రీవాల్ పెద్ద మనుషులతో తలపడుతున్నాడు, అదే పనిని ఇక్కడ (ఉత్తర ప్రదేశ్‌లో) కూడా చేస్తే ఆయనకి మా పూర్తి మద్ధతు ఉంటుంది' అని ప్రకటించారు. దేశంలోనే అతి పెద్ద పారిశ్రామిక సంస్థపై ఇంత వరకు ఏ రాజకీయ పార్టీ కూడా సాహసించలేనటువంటి పనిని కేజ్రీవాల్ సారధ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ చేసిందని చిన్న చిన్న పారిశ్రామికాధిపతులు అంటే సుమారు 5 కోట్ల రూపాయల నుండి వెయ్యి కోట్ల దాకా ఆస్తులు కలిగిన వారు పొగడ్తలతో ముంచెత్తారు.

కాని వారు పేర్కొన్నట్లుగా, రిలయన్స్ గ్రూపు వంటి పారిశ్రామిక సమాఖ్యలపైనగానీ, లేదా మొత్తంగా ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంపైనగానీ ఎవరూ సాహసించి పోరాటం చేయలేదనటం సరికాదు, సమర్ధనీయం కాదు. ఎందుకంటే వామపక్షాలు, మరీముఖ్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) గత దశాబ్దకాలం నుండి అనేక సందర్భాలలో ఒక క్రమ పద్ధతిలో రిలయన్స్ గ్రూపు చేస్తున్న అవకతవకల గురించీ, ఆశ్రిత పెట్టుబడిదారి విధానం గురించీ, ఆశ్రిత దళారీల గురించీ అటు పార్లమెంట్‌లోనూ, బయటా అనేక సార్లు బహిర్గతం చేశాయి. కృష్ణా– గోదావరి బేసిన్ సహజవాయు నిక్షేపాలపై రిలయన్స్ అక్రమాలను బయటకు తీసి నిల దీసింది వామపక్షాలే. 2000 సంవత్సరంలో మాజీ రాజ్యసభ సభ్యుడు దివంగత నేత సిపిఐ(యం) నాయకుడు దీపాంకర్ ముఖర్జీ మొట్టమొదటగా ఆయిల్ ధరల నిర్ణయాన్ని ప్రశ్నించాడు. సిపిఐ నాయకుడు గురుదాస్‌దాస్ గుప్తా, సిపిఐ(యం) నాయకుడు తపన్‌సేన్‌లు దీపాంకర్ ముఖర్జీ వారసత్వాన్ని కొనసాగిస్తూ నేటికీ ఆ సహజవాయువు, ఆయిల్ క్షేత్రాలలో జరుగుతున్న అక్రమాలపై ఎలుగెత్తుతూనే ఉన్నారు. 1980 లోనే విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ ఆర్థిక మంత్రిగా, తరువాత కాలంలో ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు కూడా రిలయన్స్ ఇండస్ట్రీస్ పైనా, ముఖేష్ అంబానీపైనా వారు తలపడ్డారు. ఆయన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఉత్తర ప్రదేశ్‌లో అనీల్ అంబానీకి చెందిన ప్రాజెక్టు కోసం భూ ఆక్రమణను తీవ్రంగా వ్యతిరేకిం చారు. కాకపోతే, వీరందరి నిరసనలు, ప్రతిఘ టనలు, పోరాటాలు ఏనాడు కూడా ఎన్నికల ప్రాధాన్యత అంశంగా చర్చకు రాలేదు. అటు వంటి సందర్భం కూడా కుదరలేదు. కానీ ఇప్పుడు దానికి భిన్నంగా నేడు కేజ్రీవాల్ చేసిన పోరాట సమయం ఎన్నికల ప్రాధాన్యత సంత రించుకుని ఒక కీలక అంశంగా చర్చకు నిలిచింది.

### మనీలాండరింగ్

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో నూతన ఒరవడి సృష్టించిన ఆమ్ ఆద్మీ పార్టీ రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన మరికొన్ని భాగోతాలను తెరమీదకు తీసుకువచ్చింది. గతంలో ఎన్నడూ ప్రజా దృష్టికి రానటువంటివీ, ప్రజలు గమనించాల్సినంతగా ప్రచారంలోకి రానటువంటివీ లేవనెత్తింది. అందులో ప్రధానమైనది, విదేశీ ప్రత్యక్షపెట్టుబడుల రూపంలో లేదా మార్గంలో నల్లధనాన్ని తెల్ల ధనంగా మార్చివేశారనే అభియోగం. సింగపూర్‌లోని ఇండియన్ హైకమీషన్ భారత ప్రభుత్వానికి రాసిన ఒక లేఖ ఆధారంగా ఈ అభియోగం బయటపడింది. 2011 ఆగస్టు 31న రాసిన ఈ లేఖలో సింగపూర్‌లోని బయోమెట్రిక్స్ మార్కెటింగ్ అనే కంపెనీ నుండి దాదాపు 6530 కోట్ల రూపాయలు భారతదేశంలో పెట్టుబడిగా రావటంపై దర్యాప్తు జరిపించాలని భారత హైకమీషన్ కోరినట్లు సారాంశం. బయోమెట్రిక్స్ అనేది కేవలం ఒక రూమ్‌లో ఏర్పరిచిన కంపెనీ అని, అది సింగపూర్‌లో ఎటువంటి వ్యాపార లావాదేవీలూ, ఆస్తులు, షేర్లు కూడా లేనటువంటిదనీ, ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్స్ కూడా జమ చేయలేదనీ పేర్కొన్నారు. అటువంటి చిన్న కంపెనీ భారత దేశంలో అక్షరాల 6,530 కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి సింగపూర్ నుండి ఇండియాకు వచ్చిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా

నిలిచింది. ఇంత చిన్న కంపెనీ అంత పెద్ద ఎత్తున పెట్టుబడి ఎలా పెట్టిందనేది ఒక మిస్టరీ.

భారత హైకమీషన్ రాసిన లేఖలో అతి ముఖ్యమైన అంశం ఏమిటంటే, ఈ మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి భారత్‌లోని రిలయన్స్ గ్రూపు ఆఫ్ కంపెనీస్‌లోకి వచ్చిందనీ, అందులో అత్యధిక శాతం డబ్బు ఒక్క రిలయన్స్ గ్యాస్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌లోకి వచ్చిందని తెలిపారు. ఈ కంపెనీకి నూరుశాతం యజమాని ముఖేష్ అంబానీ. సింగపూర్‌లోని బయోమెట్రిక్స్ మార్కెటింగ్ యజమాని అటుల్ శాంతి కుమార్ దయాల్. ఆమ్ ఆద్మీ పార్టీ ఎక్కుపెట్టిన అస్త్రం ఈయన మీద కూడా ఉంది. శాంతి కుమార్ దయాల్, సింగపూర్‌లో రిలయన్స్ గ్రూపుకి సంబంధించిన ముసుగు మనిషనీ, అలాగే ఆయన భారతదేశంలో ఉన్న 32 రిలయన్స్ గ్రూపు పరిశ్రమలలో డైరెక్టర్ గానూ, ప్రమోటర్‌గానూ ఉన్నారనీ తెలిపింది. ముఖ్యంగా రిలయన్స్ పవర్ వెంచర్స్ లిమిటెడ్, రిలయన్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, రిలయన్స్ పెట్రోలియమ్ లిమిటెడ్, గామన్ ఇండియా లిమిటెడ్‌లలో ఆయన కీలక వ్యక్తి అని పేర్కొంది. సింగపూర్‌లోని భారత హైకమీషన్ ఇచ్చిన రిపోర్టుపై ఎటువంటి చర్యకు పూనుకోకుండా కేంద్రంలోని యు.పి.ఏ-2 ప్రభుత్వం రిలయన్స్ సామ్రాజ్యానికి రక్షణ కవచంలా నిలబడిందనీ, అక్రమ మార్గాలలో, పద్ధతులలో లాభాలు గడించి విదేశాలలో దాచుకున్న నల్లడబ్బును దేశంలోకి తెల్లధనంగా తేవటానికి పూర్తి సహకారాన్ని అందిస్తోందనీ ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా విమర్శించింది. దీనికి స్పందించిన రిలయన్స్ యాజమాన్యం, ఈ అభియోగాలపై ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో న్యాయ విచారణ జరుగుతోందనీ, అవసరమైన సమాధానాలను కంపెనీ కోర్టులోనే సమర్పిస్తుందని ప్రకటించారు. అలాగే శాంతి కుమార్ దయాల్ సింగపూర్‌లో ఉన్న బయోమెట్రిక్స్ మార్కెటింగ్ కంపెనీకి యజమాని కాదు అని పేర్కొన్నారు.

కేంద్రంలోని యు.పి.ఏ ప్రభుత్వం, కె.జి బేసిన్ డి6 బ్లాక్‌పై రిలయన్స్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని కావాలనే తూట్లు పొడిచి, పరోక్షంగా, రిలయన్స్‌కు ఈ గ్యాస్ ఉత్పత్తిలో అదనపు లాభాలు కలిగే విధంగా చేస్తోందని ఆమ్‌ఆద్మీపార్టీ చేసిన రెండో అభియోగం. యు.పి.ఏ ప్రభుత్వానికి, రిలయన్స్‌కూ మధ్య కుదిరిన ఒప్పందంలో ఆర్టికల్-4 ప్రకారం ఒక్కొక్క బ్లాక్‌లో గ్యాస్ తవ్వకాలలో మొదటి భాగం అయిపోగానే ఆ ప్రాంతాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పచెప్పాల్సి ఉంది. అలా చేయటం వలన ప్రభుత్వం మళ్లీ ఆ ప్రాంతాన్ని వేలం పెట్టి ప్రభుత్వానికి రావాల్సిన అదనపు రాబడిని

> **"ఆమ్ ఆద్మీ ఆరంభించిన ఈ ప్రచారం వల్ల బి.జె.పి రిలయన్స్‌తో కుమ్మక్కైన విషయాలూ, గతంలో నీరా రాడియా టేపులలో (నీరా రాడియాకూ- పైరవీకారుల మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ) బయటపడ్డ విషయాలూ మళ్లీ పెద్ద ఎత్తున ప్రచారంలోకి వచ్చాయి. ఈ సంభాషణలలో ముఖ్యంగా అందరి దృష్టినీ ఆకర్షించింది నీరా రాడియా, ఎన్.కె.సింగ్ మధ్య జరిగిన సంభాషణ."**



కాంగ్రెస్, బీజేపీ రెండూ అంబానీలకు దాసులే: ముఖేష్ అంబానీతో మన్మోహన్ మంతనాలు(పైన) ఆలింగనం చేసుకుంటున్న నరేంద్ర మోడీ (కింద)



పొంది, ప్రజాప్రయోజనాలను కాపాడు కోవచ్చు. కాని యు.పి.ఎ ప్రభుత్వం నిర్వాకం వలన, కావాలనే రిలయన్స్‌కు లబ్ధి చేకూర్చే పద్ధతిలో, రిలయన్స్ గ్యాస్ తవ్వకాలలో 3వ భాగం పూర్తి చేసేదాకా కూడా మొత్తం ప్రాంతా న్ని ఖాళీ చేయకుండానే వదిలివేసింది. 3వ భాగం తవ్వకాలు పూర్తయ్యేలోపు 86 శాతం భూమిని వదిలివేయాల్సిన రిలయన్స్ నిరాటం కంగా మొత్తం ఆక్రమించుకుంది. కేవలం ప్రభుత్వంలోని వీరప్పమొయిలీ వంటి వారి అండదండలతో రిలయన్స్ తవ్వకాలపై వచ్చిన అభియోగాలు, చట్టాల అతిక్రమణలు వంటివేవీ నిలబడలేక పోయాయని ఆమ్ ఆద్మీ పార్టీ విమర్శించింది.

ఆమ్ ఆద్మీ ఆరంభించిన ఈ ప్రచారం వల్ల బి.జె.పి రిలయన్స్‌తో కుమ్మక్కైన విషయాలూ, గతంలో నీరా రాడియా టేపులలో (నీరా రాడియాకూ- పైరవీకారుల మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ) బయటపడ్డ విషయాలూ మళ్లీ పెద్ద ఎత్తున ప్రచారంలోకి వచ్చాయి. ఈ సంభాషణలలో ముఖ్యంగా అందరి దృష్టినీ ఆకర్షించింది నీరా రాడియా, ఎన్.కె.సింగ్ మధ్య జరిగిన సంభాషణ. యన్.కె.సింగ్ జనతా దళ్(యు) రాజ్యసభ సభ్యుడు, మాజీ భారత అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఐ.ఐ.ఎస్). ఈ సంభాషణలలో ఎన్.కె.సింగ్ తాను ముఖేష్ అంబానీ తరఫున పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వచ్చిందనీ, పార్లమెంట్‌లో 2009 యూనియన్ బడ్జెట్‌పై బి.జె.పి టీమ్ తరపున మాట్లాడబోయిన అరుణ్ శౌరిని తప్పించడానికి చాలా కష్టపడ్డాననీ తెలిపారు. ప్రణబ్ ముఖర్జీ బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఒక పన్ను రాయితీని, అదికూడా వెనుకటినించి అమలు అయ్యేటట్లుగా ఉండటాన్ని అరుణ్‌శౌరి తీవ్రంగా వ్యతిరేకించారని ఆయన చెప్పారు. ఈ పన్ను రాయితీ వలన లాభపడే ఒకే ఒక్క పారిశ్రామిక సంస్థ ముఖేష్ అంబానీ కంపెని. సహజ వాయువు, ముడి చమురు వెలికితీతకు మూలధనం పెట్టుబడిపై 100 శాతం పన్ను మినహాయింపు ప్రారంభ సంవత్సరం నుండే ఇచ్చారు. ఈ ప్రమాణాలను ఆధారంగా లాభపడే ఏకైక అతిపెద్ద సంస్థ రిలయన్స్ గ్యాస్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్.

అరుణ్‌శౌరి కనుక బడ్జెట్ చర్చపై బి.జె.పి. టీమ్‌కు నాయకత్వం వహించి మాట్లాడితే అది అంతిమంగా ముఖేష్ అంబానీకి వచ్చే పన్ను రాయితీపై దెబ్బపడుతుందనీ, అందువలనే తాను ఆయనను మార్చేందుకు బి.జె.పి.లో ప్రయత్నాలు చేస్తున్నాననీ నీరారాడియాతో జరిగిన సంభాషణలో ఎన్.కె.సింగ్ చెప్పారు. తరువాత జరిగిన పరిణామాలను గమనిస్తే ఆయన చెప్పింది నిజమేననీ, ఈ అక్రమ ప్రయత్నాలు ఫలించాయనీ ఋజువు అయింది. అరుణ్ శౌరి బదులు బి.జె.పి. మాజీ అధ్యక్షుడు వెంకయ్యానాయుడు ప్రధాన వక్తగా బి.జె.పి. తరుపున పార్లమెంట్‌లో మాట్లాడారు. ఇటువంటి

> **" దేశంలో ఉన్న ఈ రెండు జాతీయ పార్టీలూ ఎప్పటి కప్పుడు అవసరాలకనుగుణంగా రిలయన్స్‌కు సహాయం అందిస్తున్న నేపథ్యంలో, అనేక సందర్భాలలో దేశంలోని ఇతర ప్రాంతీయ పార్టీలు కూడా తామేమి తక్కువ తినలేదని, రిలయన్స్‌కు అండగా నిలిచాయి. అందులో ముఖ్యమైనవి సమాజ్‌వాదీపార్టీ, జనతాదళ్(యు) పార్టీలు. ఇవి ఎప్పటి కప్పుడు రిలయన్స్‌కు వత్తాసు పలుకుతూనే ఉన్నాయి. "**

పన్నురాయితీలు చాలా అవసరమని ఆయన కుండబద్దలు కొట్టినట్లుగా మాట్లాడారు. బంగాళాఖాతం భారతదేశం యొక్క ముఖ్య వనరుగా ఉంది. చమురు, సహజ వాయువులు సహజ సంపద అవునా, కాదా అని ప్రభుత్వ శాఖలు కొట్టుకోవటం మానేసి, వాటి అన్వేషణ కోసం ప్రయత్నించాలనీ, మౌలిక వసతులపై పెట్టుబడినీ, తవ్వకాలనూ ఈ దేశ ఇంధన శక్తి భద్రతకు సంబంధించిన అంశంగా భావించాలనీ, వాటికి ప్రోత్సాహకాలు అందించాలనీ పిలుపునిచ్చారు. ఇది జరిగిన వెంటనే అరుణ్‌శౌరి అధికారికంగానే ఒక ప్రకటనలో తనను చడీ చప్పుడు లేకుండా ప్రధాన వక్తగా తొలగించారనీ, దీని వెనుక కార్పోరేట్ శక్తుల ఒత్తిడి తీవ్రంగా పని చేసిందని ఆరోపించారు. ఈ టేపులలో వచ్చిన ఇతర సంభాషణలలో నేరుగా ముఖేష్ అంబానీ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తన సొంత షాపు లాంటిదని పేర్కొన్నారు. కాని ఈ రాజ్యసభ సభ్యుని సంభాషణలు విన్న తరువాత జరిగిన పరిణామాలు చూస్తే కాంగ్రెస్సే కాదు, బి.జె.పి. కూడా ఆయన సొంత షాపేనని ఋజువైంది.

ఆమ్ ఆద్మీ ప్రచారం ద్వారా ఇటువంటివి అనేకం మళ్ళీ క్రియాశీలక చర్చలలోకి రావటం వలన, 1990 నాటి కాలంలో వెల్లువెత్తిన కొన్ని ఆరోపణలు మళ్ళీ వెలుగులోకి వస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనది, బి.యన్.సఫాయా ఇచ్చిన వాంగ్మూలం. ఈయన కాంగ్రెస్ అధినాయకత్వానికి అత్యంత ఆప్తుడైన సతీష్‌శర్మకి వ్యక్తిగత కార్యదర్శిగా పని చేశారు. సెంట్రల్ బ్యూర్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) పరిశోధించిన పన్నా-ముక్తా ఆయిల్ భూముల అవకతవకలలో దర్యాప్తు బృందం ఆయనను ప్రశ్నించింది. ఈ ఆయిల్ సంపదను తవ్వటానికి రిలయన్స్, ఎస్సార్ సంస్థలకు సంయుక్తంగా అప్పగించారు. ఇది పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1993లో సతీష్‌శర్మ పెట్రోలియం శాఖా మంత్రిగాఉండి చేసింది. కాగ్ ఈ ప్రాజెక్టును వారిద్దరికి అప్పగించిన విధానంపై తీవ్రంగా విమర్శించడం వలన సి.బి.ఐ దర్యాప్తు అనివార్యమయ్యింది. ఈ దర్యాప్తు సందర్భంలోనే సి.బి.ఐ దర్యాప్తు బృందం ఎదుట సఫాయా వెల్లడించిన అంశం చాలా ముఖ్యమైంది. రిలయన్స్ తరపున ముఖేష్ అంబానీ అనేక సార్లు వ్యక్తిగతంగా పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆఫీసుకు వచ్చి సతీష్‌శర్మను కలిశారని సఫాయా తెలిపారు. అంతేకాకుండా, సేతు రామన్ అనే దూత ద్వారా ధీరూభాయ్ అంబానీ, ముఖేష్ అంబానీలు 1993 జూన్‌లో ఒక కోటి రూపాయలు, అక్టోబర్‌లో ఒక కోటి రూపాయలు, డిసెంబరులో 2 కోట్ల రూపాయలు క్యాష్ రూపంలో అందించారని తెలిపారు. ఆశ్చర్యకరంగా ఈ దర్యాప్తు తర్వాత ఆ కేసు ఏమి జరిగిందనేది ఇంతవరకు ఎవ్వరికీ తెలియదు. పన్నా-ముక్తా కేసుకి సంబంధించిన పరిశోధనా ఫైల్స్ అదృశ్యమయ్యాయనీ, కనిపించటం లేదనీ సి.బి.ఐ సుప్రీంకోర్టుకు తెలిపింది.

దేశంలో ఉన్న ఈ రెండు జాతీయ పార్టీలూ ఎప్పటికప్పుడు అవసరాలకనుగుణంగా రిలయన్స్‌కు సహాయం అందిస్తున్న నేపథ్యంలో, అనేక సందర్భాలలో దేశంలోని ఇతర ప్రాంతీయ పార్టీలు కూడా తామేమి తక్కువ తినలేదని, రిలయన్స్‌కు అండగా నిలిచాయి. అందులో ముఖ్యమైనవి సమాజ్‌వాదీపార్టీ, జనతాదళ్(యు) పార్టీలు. ఇవి ఎప్పటికప్పుడు రిలయన్స్‌కు వత్తాసు పలుకుతూనే ఉన్నాయి. సమాజ్‌వాదీపార్టీకీ, అనీల్ అంబానీకీ ఉన్న ప్రత్యేక బంధం, అన్నదమ్ములు విడిపోయిన సందర్భంలో ప్రస్ఫుటంగా అందరికీ కనిపించిన సత్యమే. నిజానికి 2006లో ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా ముఖ్యంగా రిలయన్స్‌కు అనుకూలంగా తీసుకున్న చర్యలకు వ్యతిరేకంగా వి.పి.సింగ్ ప్రభుత్వం పోరాడింది.

ఆమ్ ఆద్మీ పార్టీ ప్రస్తుత ప్రచార యుద్ధం ....కార్పోరేట్, కార్పోరేట్ సమాఖ్యల జోక్యం, వారి ప్రభావం దేశంలోని అన్ని ప్రాంతాలకూ, అన్ని విభాగాలకూ విస్తరించిందనే చర్చను మళ్లీ ముందుకు తీసుకువచ్చింది. ఆప్ ప్రచారంలో మొదటి అంశం కాంగ్రెస్, బిజెపిల అసహ్యకరమైన కుమ్మక్కును బహిర్గత పరచడం. ఆ రెండు పార్టీలూ ఆశ్రిత పెట్టుబడిదారీ శక్తులకు ఎలా ఊడిగం చేస్తున్నాయనేది రెండో అంశం. దీనితోపాటుగా ప్రాంతీయ పార్టీలు కూడా రిలయన్స్‌కు ఎలా వత్తాసు పలుకుతున్నాయో తెలుపుతూ తన ప్రచారంలో వాటి తోలు తీస్తున్నాయి. కాకపోతే, ఈ క్షణంలో ఆప్ ప్రచారం రానున్న నెల రోజులలో ఎన్నికల మీద ఎంత ప్రభావం చూపుతుందనే అంశాన్ని ఇప్పుడే అంచనా వేయటం దుస్సాహసం. కాని ఒకటి మటుకు ఖచ్చితంగా చెప్పగలం. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి సార్వత్రిక ఎన్నికలలో రిలయన్స్‌పై మోపిన అభియోగాలు, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అనే అంశాలు ప్రచారంలో ముఖ్య పాత్ర పోషించనున్నాయి. బహుశా ఈ ఘర్షణ ఫలితంగా దేశంలోనే అతిపెద్ద, సంపన్న పారిశ్రామిక సమాఖ్యపై జాతీయ విధాన నిర్ణేతలు తమ వైఖరిని మార్చుకోవలసి వస్తుందేమో వేచి చూద్దాం.

**(ఫ్రంట్‌లైన్ వ్యాసానికి అనువాదం : ఎల్. ఎస్. భారవి)**

**'మార్క్సిస్టు' పై**

**మీ అభిప్రాయాలు తెలపండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించా ల్సిన అంశాలున్నా, అదనపు సమాచార మున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# మితవాద మలుపు తీసుకున్న కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక

**పెనుమల్లి మధు**

కాంగ్రెస్ పార్టీ తన 2014 ఎన్నికల ప్రణాళికను గత నెల 26న ప్రకటించింది. ఆమ్ ఆద్మీ పేరుతో సామాన్య ప్రజల సంక్షేమాన్ని గురించి మాట్లాడుతూ వచ్చిన కాంగ్రెస్ ఒక్కసారిగా ఈ ఎన్నికల ప్రణాళిక లో ఆ ప్రస్తావనే లేకుండా ప్రకటించింది. 2004లో షైనింగ్ ఇండియా పేరుతో బిజెపి ఎన్నికల ప్రణాళిక ప్రకటించినపుడు 'ఈ ప్రణాళికవల్ల ఆమ్ ఆద్మీకి– సామాన్య ప్రజలకు ఒరిగిందేమిటి' అని కాంగ్రెస్ ప్రశ్నించింది. బిజెపి అనుసరించిన అభివృద్ధి మోడల్ విధానాలు సామాన్య ప్రజలకిచ్చిందేమిటి? అని ప్రశ్నించింది. అప్పటి నుంచి కాంగ్రెస్ తన విధానాలు –నినాదాలను సామాన్య ప్రజల సంక్షేమం చుట్టూ తిప్పుతూ వచ్చింది. అలాంటిదిప్పుడు ఒక్కసారిగా పూర్తిగా కార్పోరేట్ శక్తుల్ని ప్రసన్నం చేసుకొనే వైపు దృష్టిని మళ్ళిం చింది. కొంత మంది రాజకీయ విశ్లేషకులు దీన్ని సిద్ధాంత రీత్యా 'మితవాద మలుపు' (రైట్‌వార్డ్ షిఫ్ట్) అని వ్యాఖ్యానించారు.

ఈ ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ వాస్తవానికి ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ఉండాలన్న నినాదాన్ని ఇస్తుందని చాలా మంది ఆశించారు. అది జరగకపోగా బిజెపి, నరేంద్రమోడి ఓటు బ్యాంకుగా ఉన్న "వ్యాపారవర్గం", "మధ్యతరగతి" లాంటి వారి దృష్టిని ఆకర్షించడం కోసం అనేక వాగ్దానాలు చేసింది. కార్పోరేట్ రంగానికీ, వారి ప్రయోజనాలకూ తోడ్పడే చర్యలను ప్రతిపాదించింది. ఒక రకంగా ఇది మౌలికంగానే తన వైఖరిలో వచ్చిన మార్పుగా పరిగణించాలి.

ఈ ప్రణాళికలో ఇప్పటిదాకా అనుసరిస్తున్న విధానాలకు భిన్నంగా సబ్సిడీలు తగ్గించాలనీ, అత్యవసరమైన వారికి కూడా సబ్సిడీలు అతి కనీస స్థాయిలో ఉండాలనీ పేర్కొన్నది. తద్వారా మిగులును ఇతర అభివృద్ధి కార్యకలాపాలకు మళ్ళించాలని చెప్పింది. అలాగే సేవల విషయంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నది. ఉదాహరణకు విద్యుత్ కోతల కంటే నిరంతరాయంగా సరఫరా అయ్యే నాణ్యమైన విద్యుత్ అవసరమని పేర్కొంది. ఇలా నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరా కోసం అవసరమైతే యూజర్ ఛార్జీలు విధించవచ్చని పేర్కొన్నది. సహేతుకమైన స్థాయిలో అన్ని రకాల సేవలకూ యూజర్ ఛార్జీలు విధించవచ్చు న్నది. ఇప్పటిదాకా అందుతున్న అరాకొరా సేవల్ని కత్తిరించి నాణ్యత పేరుతో అన్ని రకాల సేవల మీద భారాలు మోపాలని సూచించింది. సర్వశిక్ష అభియాన్‌ను శ్రేష్ట శిక్ష అభియాన్‌గా మారుస్తామనీ, దానికి యూజర్ ఛార్జీ ఉంటుందనీ ప్రకటించింది.

ఇంతకు ముందు అతి ప్రాధాన్యత కలిగిన "ఫ్లాగ్‌షిప్" పథకాలుగా పేర్కొంటూ వచ్చిన కార్యక్రమాలను (ఉదా: గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆహారభద్రతా పథకం) ఇప్పుడు అప్రధానమైన పథకాలుగా భావిం చింది. పైన పేర్కొన్న అతి ప్రాధాన్యతా పథకాలకు కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాను పెంచాలని చెప్పింది. తద్వారా వచ్చే మిగులును రైల్వే రంగానికీ, రక్షణ రంగానికీ ఖర్చు చేస్తామని ప్రణాళికలో ప్రకటించింది.

ఉపాధి అవకాశాల పెంపుదల మీద కాంగ్రెస్ ప్రణాళిక దృష్టి సారించలేదు. 2004–05 నుండి 2009–10 దాకా వార్షిక ఉద్యోగాల కల్పన 0.8శాతం అయితే ఉద్యోగాలు పోయి నిరుద్యోగులైనవారి సంఖ్య 1.5శాతంగా ఉంది. ఇదిగాక జనాభా పెరుగుదల మరొక 1.5శాతం. ఈ రీతిగా పెరుగుతున్న నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపలేదు. అలాగే ధరల విషయంలోనూ అదుపు చేయడానికి చర్యలు లేవు. పెరుగుతున్న పేదరికాన్ని తగ్గించడానికి చర్యలు లేవు. ఉదాహరణకు 1993–94 నుండి 2010–11 వరకు పేదరికం 57శాతం నుండి 73శాతానికి పెరిగింది.

కార్పోరేట్ రంగానికి, బడా వ్యాపార వర్గాలకు దాదాపు వారు కోరుతున్న అన్ని రాయితీలకూ ఇందులో వీలు కల్పించారు. బొగ్గుగనుల ప్రైవేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, చక్కెర, రసాయన ఎరువులు, ఔషధాల మీద ఉన్న నియంత్రణను తొలగించడం, చమురు క్షేత్రాల ప్రైవేటీకరణ, చిల్లర వ్యాపారంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల వాటాను 51శాతానికి పెంచడం, గ్రామీణ బ్యాంకింగులో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విద్యుశ్చక్తి పంపిణీ, సరఫరాలో వస్తున్న నష్టా లను ప్రజలే భరించడానికి చర్యలు చేపట్టడం, రైల్వేలలో ప్రైవేటు భాగస్వా మ్యం, పట్టణ ప్రజా రవాణాలో ప్రైవేటీ కరణ.... ఇలాంటి చర్యలన్నిటికీ వీలుగా విధానాలు ప్రకటించారు. మరోవైపు కార్మికులకు ఇప్పటి వరకు ఉన్న రక్షణలను తొలగించడానికి వీలుగా చట్టాల్లో సవరణలు "లేబర్ మార్కెట్ రిఫామ్స్" అవసరమని పేర్కొన్నారు.

ఆ సవరణల్లో ఒకటి– కంపెనీ యాక్టు చట్టం ప్రకారం ఏదైనా కంపెనీ దివాళా తీస్తే దానిని మూసివేయడం, లాకౌట్ చేయడం ఉన్న చట్టాల ప్రకారం కష్టం. వారు తెచ్చే సవరణ వల్ల కార్మికుల నష్టపరి హారంతో నిమిత్తం లేకుండా పరిశ్రమ మూసివేయడానికి అవకాశం కల్గుతుంది. రెండు –ఫ్యాక్టరీ యాక్టు ప్రకారం ఇప్పుడు వారానికి 48 గంటల పనివిధానం అమలు లో ఉంది. అంటే రోజుకు 8 గంటలకు మించి పనిదినం ఉండకూడదు. లేబర్ మార్కెట్ రిఫామ్స్ ద్వారా వారంలో పనిగంటలు 60కి పెంచడం, రోజుకు 12 గంటలు చేసేలా సవరణలు చేయాలని ప్రభుత్వం గతంలో పార్లమెంటులో ప్రకటించి ఉంది. ఇప్పుడు ఇలాంటివి అమలు చేయడానికి వీలుగా లేబర్ రిఫామ్స్ కావాలన్నది.

ఈ ప్రణాళికలో వైద్య రంగానికి జిడిపిలో 3 శాతానికి ఖర్చు చేస్తామని ప్రకటించింది. 2004 కనీస ఉమ్మడి ప్రణాళికలో వైద్యరంగానికి 3 నుండి 4 శాతానికి ఖర్చు చేయాలని ప్రకటించిన కాంగ్రెస్ 2013–14 బడ్జెట్‌లో దాన్ని కేవలం 0.3 శాతానికి పరిమితం చేసింది. ఇప్పుడు పెంచాలని ప్రకటిస్తున్నది. 2013 –14 సంవత్సరంలో విద్యా రంగానికి కేవలం 0.7 శాతంలోపే ఖర్చు చేసి ఇప్పుడు దాన్ని ఎకాఎకిన 6శాతం ఖర్చు చేస్తామని ప్రకటించడమంటే ప్రజలను మోసం చేయడం తప్ప మరొకటికాదు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి పరపతి సౌకర్యం బాగా తగ్గించి అమలు చేసిన ఈ ప్రభుత్వం ఇప్పుడు 10 లక్షల జనాభా పైబడిన ప్రతి నగరంలో ప్రతి పౌరుడికీ బ్యాంకు అకౌంటు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అలాగే రైల్వే రంగంలో ఎప్పుడో ప్రారంభించిన రైల్వే లైన్లను, ప్రాజెక్టులను పూర్తిచేయలేని ఈ ప్రభుత్వం ఇప్పుడు 10 లక్షల జనాభా పైబడిన అన్ని నగరాలకూ హై స్పీడ్ రైళ్ళను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. పూర్తిగా కార్పోరేట్ శక్తులకు లొంగిపోయిన ప్రణాళిక తప్ప ఇది మరొకటి కాదు. సంక్షేమాన్నీ, సామాజిక న్యాయాన్నీ గాలికి వదిలివేయ డమేకాదు కార్మికుల మీద యుద్ధం చేసే ప్రణాళికగా దీన్ని పేర్కొనవచ్చు. ●

**రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ కార్యదర్శి.**

# తమిళనాడు అస్పృశ్యతా నిర్మూలన సంఘటన పోరాటాలు - సాధించిన విజయాలు

రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో చేపట్టిన ప్రత్యక్ష కార్యాచరణకు విదుతలై చిరుతైగళ్ కచ్చి, అత్తి తమిశరపెడవై, సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, కిసాన్ సభ, వ్యవసాయ కార్మికసంఘం ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌లు సంఘానికి బాసటగా నిలిచాయి. ఈ ప్రత్యక్ష కార్యాచరణ సాధించిన విజయాల ప్రకంపనలు రాష్ట్రవ్యాప్తంగా అలజడి సృష్టించాయి. అంటరానితనం నిర్మూలనా పోరాటాన్ని మరింత ధృతంగా ముందుకు తీసుకువెళ్లేందుకు ఊపునిచ్చాయి.

గణేష్

తమిళనాడులోని పాత తంజావూరు జిల్లా దళితులపై సాగుతున్న అత్యాచారాలకూ, పాటిస్తున్న అంటరానితనానికీ వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసి తనదైన చెరగని ముద్రవేసిన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ బి. శ్రీనివాసరావు. ఆయన వర్ధంతి (సెప్టెంబర్ 30) రోజున తమిళనాడు అస్పృశ్యతా నిర్మూలనా సంఘటన (టి.ఎన్.యు.ఇ.ఎఫ్) ప్రత్యక్ష కార్యాచరణ చేపట్టింది.

రాష్ట్రంలో అస్పృశ్యతకు వ్యతిరేకంగా అనుదినం ప్రతిగంటా, ప్రతి నిమిషం పోరాడాల్సిన పరిస్థితే అయినప్పటికీ ఈసారి తీసుకున్న కార్యక్రమం కామ్రేడ్ శ్రీనివాసరావు వర్ధంతి నాటిది కావడంతో ఎంతో భావోద్వేగం జతకూడింది. వామపక్ష ఉద్యమం, కామ్రేడ్ శ్రీనివాసరావు నాయకత్వంలో జరిగిన పోరాటాల విజయంనుండి స్ఫూర్తిని స్వీకరించింది. అసంపూర్ణంగా మిగిలిపోయిన అజెండాను టి.ఎన్.యు.ఇ.ఎఫ్. ముందుకు కొనిపోవడానికి నిర్ణయించుకుంది.

ఈ ఏడాది ఏడు కేంద్రాల్లో ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించాలని సంఘం నిర్ణయించింది. దీనికన్నా, ముందుగా సంఘం తరఫున రాష్ట్రవ్యాప్తంగా ఒక సర్వే నిర్వహించింది. అంతకుముందటి సర్వే 2007లో నిర్వహించాం. ఆ సర్వే నివేదికల ఆధారంగా కొన్ని పోరాటాలు చేశాం. ఈ అనుభవాలసారంగా మరొక సర్వే నిర్వహించాలని సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు సర్వే జరిగింది. దానికి సంబంధించిన నివేదికలు తయారవుతూ వున్నాయి. అయితే ఈ సర్వేల ద్వారా వెలుగులోకి వచ్చిన మరికొన్ని అస్పృశ్యతా ధోరణుల మీద ఈ లోగానే ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలన్న నిర్ణయం జరిగింది.

### ఈరోడ్‌లో వందేళ్ళ కల సాకారమయ్యింది

ఈ రోడ్ జిల్లాలోని విజుమత్తూర్ గ్రామంలో గత వందేళ్ళుగా అక్కడి ఛాతీశ్వరన్ ఆలయంలోకి దళితుల ప్రవేశంపై నిషేధం కొనసాగుతోంది. సర్వేలో వెలుగుచూసిన ఈ వివక్షతకు వ్యతిరేకంగా ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలని సంఘం నిర్ణయించింది. సంఘం అధ్యక్షుడు పి. సంపత్, శాసనసభ్యులు కె. తంగవేలు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఎన్. అమృతం నాయకత్వంలో దళితులు గుడి ప్రవేశం చెయ్యనున్నారని ప్రకటించింది.

గ్రామ దళితుల, సంఘాల పట్టుదల గమనించి జిల్లా యంత్రాంగం చర్చలకు పిలవాల్సిన పరిస్థితికి నెట్టబడింది. సెప్టెంబర్ 28న చర్చలు జరిగాయి. దళితుల ఆలయ ప్రవేశంతోపాటు పెత్తందార్లు తమ అదుపులో వుంచుకొన్న గ్రామ కమ్యూనిటీ హాల్‌నూ దళిత కుటుంబాలకు తిరిగి అప్పగించాలనే డిమాండ్‌ను చర్చల సందర్భంగా సంఘం ముందుకు తెచ్చింది. జిల్లా యంత్రాంగం ఈ రెండు డిమాండ్లకూ అంగీకరించింది. అదేరోజు సాయంత్రం ఐదున్నరకు కూతపల్లి, శివానందకాలనీ, సెల్వన్‌నగర్, అన్నానగర్, పోన్ విజానగర్ తదితర గ్రామాల్లోని దళితులు తరలివచ్చి గుళ్ళో ప్రవేశించి దైవాన్ని కొలుచుకున్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె. దొరైరాజు, జిల్లా పార్టీ కార్యదర్శి ఎం. అన్నాదురై, సంఘం జిల్లా అధ్యక్షులు పిపి పళనిస్వామి, జిల్లా కార్యదర్శి తదితరులు దళితులకు అండగా నిలిచి వారితో ఆలయ ప్రవేశం చేయించారు. తమ వందేళ్ల కలను సాకారం చేసినందుకు దళితులు మార్క్సిస్టుపార్టీ, సంఘం–రెండింటికీ ధన్యవాదాలు తెలియజేశారు.

### తిరువణ్ణమలై ఆలయ ప్రవేశం

తిరునల్వేలి జిల్లాలోని కలశపొక్కమ్ పంచాయతీ యూనియన్ పిరువళ్ళూర్ గ్రామ దళితులకు నారాయణ పెరుమాళ్ ఆలయ ప్రవేశం నిషేధం. ఇప్పటికీ ఆ ఊళ్ళోని టీ కొట్లలో రెండు గ్లాసుల అంటరానితనం పాటించే విధానం కొనసాగుతోంది. శ్మశానవాటికకు వెళ్ళడానికి రోడ్డు ఎక్కనీయని పరిస్థితి ఉంది. సెప్టెంబర్ 30న ఆ ఊళ్ళో ఆలయ ప్రవేశ కార్యక్రమానికి సంఘం నిర్ణయించింది. శాసన

---

రచయిత తమిళనాడు అస్పృశ్యతా నిర్మూలన సంఘటన నాయకుడు.

> “ తంజావూర్ జిల్లాలోని ఓర్దనాడు మండలంలో ఇచ్చన్‌కొట్టై గ్రామంలోని టీ అంగళ్లలో ఇప్పటికీ రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతోంది. క్షౌరం చేయించుకోవడానికి వీలులేని పరిస్థితి. క్షౌరం చేయించుకోవ డానికి కొన్ని మైళ్ళు వెళ్ళి రావాల్సిన దుస్థితి. శాసనసభ్యులు నాగై మల్లి ఆధ్వర్యంలో ఆ గ్రామంలో అంటరాని పద్ధతులకు వ్యతిరేకంగా ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోనున్నాం అని సంఘం ప్రకటించిన వెంటనే అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ”

భ్యులు కె. బాలకృష్ణన్, సంఘం ప్రధాన కార్యదర్శి కె. సామ్యూల్‌రాజు, యువజనసంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్. వేలు మురుగన్‌ల నాయకత్వంలో వందలాదిమంది దళితులు ఆలయంవైపుకు ర్యాలీగా బయల్దేరారు. కుల శక్తులు ఆలయానికి దారితీసే రోడ్డుకు అడ్డంగా నిలిచారు. జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు జోక్యం చేసుకొని ఆలయ ప్రవేశం నిషిద్ధం కాదని నాయకులకూ, దళితులకూ నచ్చచెప్పేందుకు చూశారు. కాని దళితుల ఆలయ ప్రవేశం జరిగితే తప్ప అక్కడనుండి కదిలేది లేదని తెగేసి చెప్పడంతో చివరికి అధికార యంత్రాంగం, పోలీసులు అడ్డు తొలిగారు. డెబ్బై ఏళ్ళుగా కొనసాగుతున్న వివక్షతను బద్దలు కొడుతూ, దళితులు ఆలయ ప్రవేశం చేశారు.

### దిండిగల్‌లో సొంత భూములలోకి ప్రవేశించే హక్కు

దిండిగల్ జిల్లాలోని ఒడ్డాంచంతిరమ్ పట్టణంలోని కూడలింగాపురంలో 48 దళిత, అరుంధతీయ కుటుంబాలకు 32 ఏళ్ళక్రితం భూమి పట్టాలు ఇచ్చారు. భూమి కొలతలయితే వేశారు కానీ పట్టాభూమిని మాత్రం స్వాధీనం చెయ్యలేదు. ఏళ్ళు గడిచిపోవడంతో ఇప్పుడు ఆ భూమి విలువ కోట్ల రూపాయలకు చేరుకుంది. భూమిని స్వాధీనం చెయ్యమని ఎన్నిమార్లు పిటిషన్‌లు పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. అందుకే 48 దళిత, అరుంధతీయ కుటుంబాలకు ఆ భూమిని స్వాధీనపరిచే కార్యక్రమం సెప్టెంబర్ 30న చేపట్టాలని నిర్ణయించాం. అంతకుముందుగా అధికార యంత్రాంగంతో చర్చలు జరిపినా ఫలితం లేకుండాపోయింది. అనుకున్న ప్రకారం సెప్టెంబర్ 30న కామ్రేడ్ పి. సంపత్, సంఘం కోశాధికారి ఆర్. జయరామన్, శాసనసభ్యులు కె. బాలభారతి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎన్. పాండి సంఘం జిల్లా అధ్యక్షులు కె. చిన్న కరుప్పన్, కార్యదర్శి ఎం.ఆర్. ముత్తుసామి తదితరుల నాయకత్వంలో దాదాపు వెయ్యి మందికి పైగా దళితులతో భూమిని స్వాధీనం చేసుకోవడానికి ర్యాలీగా బయల్దేరారు. దాంతో అధికార యంత్రాంగం దిగివచ్చి పట్టాలు కేటాయించిన 48 కుటుంబాలకు భూమిని దాఖలు పరిచేందుకు అంగీకరించింది.

### ఊటీలో అంటరాని గేటు ధ్వంసం

ఊటీ (నీలగిరి) దగ్గర కూనూర్‌లోని గాంధీపురంలో నివసిస్తున్న దళిత, అరుంధతీయ కుటుంబాల వారు ఊరుమ్మడి రోడ్డుమీదకి రావడానికి వీల్లేకుండా ఒక ప్రైవేటు కంపెనీ గేటు కట్టించేసింది. ఇది వివక్షత తప్ప వేరే కాదని మన సంఘం భావించింది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకురావడానికి అనేక పర్యాయాలు నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. ప్రతిసారీ అధికార యంత్రాంగం సమస్య త్వరలోనే పరిష్కరిస్తామని వాగ్దానం చెయ్యడమే తప్ప సమస్యను పరిష్కరించే చొరవ చూపలేదు. కాబట్టి ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలని సంఘం, పార్టీ నిర్ణయించాయి.

అదే సెప్టెంబర్ 30న శాసనసభ్యులు పి. ఢిల్లీబాబు, సంఘం రాష్ట్ర కార్యదర్శి యు.కె. శివజ్ఞానం, పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్. బద్రి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎల్. త్యాగరాజన్ తదితరుల నాయకత్వంలో దళితులు, అరుంధీయులు ప్రదర్శనగా అంటరాని గేటుకు చేరుకున్నారు. నాలుగు గంటలపాటు నానబెట్టుడు వ్యవహారం అని గమనించి అధికార యంత్రాంగం తక్షణమే గేటును కూల్చివెయ్యకపోతే ఆ పనేదో మేమే చేస్తాం అన్న వర్తమానం పంపించాం. దాంతో గత్యంతరం లేక అధికార యంత్రాంగం దిగి వచ్చి దళిత, అరుంధతీయుల ఆనందోత్సాహాల మధ్యన ‘అంటరాని గేటు’ను కూల్చేసింది. యాభై ఏళ్ళపాటు సాగించిన వివేక్షత అలా ధ్వంసమయ్యింది.



చిదంబరంలోని నటరాజ దేవాలయంలోకి దళితుల ప్రవేశాన్ని కోరుతూ దేవాలయం దక్షిణ గేటు వద్ద అస్పృశ్యతా నిర్మూలన సంఘటన ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

### తంజావూర్‌లో తొలి క్షౌరం, తొలి టీ

తంజావూర్ జిల్లాలోని ఓర్దనాడు మండలంలో ఇచ్చన్‌కొట్టై గ్రామంలోని టీ అంగళ్లలో ఇప్పటికీ రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతోంది. క్షౌరం చేయించుకోవడానికి వీలులేని పరిస్థితి. క్షౌరం చేయించుకోవడానికి వీలులేని పరిస్థితి. క్షౌరం చేయించుకోవడానికి కొన్ని మైళ్ళు వెళ్ళి రావాల్సిన దుస్థితి. శాసనసభ్యులు నాగైమల్లి ఆధ్వర్యంలో ఆ గ్రామంలో అంటరాని పద్ధతులకు వ్యతిరేకంగా ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోనున్నాం అని సంఘం ప్రకటించిన వెంటనే అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. దళితులకు కూడా అందరిమాదిరే ఒకే గ్లాసులో టీ అందచెయ్యబడుతుందని, గ్రామ

> **"మధురై జిల్లాలోని వాడుప్పి పట్టణ పంచాయతీ పరిధిలో దళితులకు సెలూన్లలో ప్రవేశం లేదు. సంఘం ఆగస్టు నెలలో నిర్వహించిన సర్వేలో దళితులకు క్షౌరం చేయడానికి నిరాకరించే సెలూన్ల జాబితాను రూపొందించి జిల్లా అధికార యంత్రాంగానికి అందజేసాం. అయితే జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవడానికి ముందువెనుకలాడింది. అఖిలభారత రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం నాయకత్వాన సెప్టెంబర్‌లో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలని నిర్ణమయ్యింది."**

ఈ ఊళ్ళో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలని సంఘం నిర్ణయించింది.

నీళ్ళ ట్యాంక్ కట్టి రెండేళ్ళయ్యింది. కొంత మంది అరుంధతీయ యువకులు ఇక్కడ స్నానం చెయ్యడానికి ప్రయత్నిస్తే అగ్రకుల శక్తులు ప్రతిఘటించాయి. మరోసారి కూడా ప్రయత్నం చేసినప్పుడు ట్యాంకులో నీళ్ళన్నిటినీ బయటకి వదిలేశారు. ఈ నేపథ్యంలో సంఘం సెప్టెంబర్ 30న ప్రత్యక్ష కార్యచరకు పిలుపునిచ్చింది. దీంతో అధికార యంత్రాంగంలో చురుకు




టి.ఎన్.యు.ఇ.ఎఫ్ పోరాటంతో దళితులకు లభించిన ఆలయ ప్రవేశం. దళితులకు క్షౌరం చేస్తున్న సెలూన్ యజమాని

పుట్టింది. చర్చలకు పిలిచారు. గ్రామంలో కొన సాగుతున్న అంటరాని పద్ధతులను సమూలంగా మాన్పించాలని సంఘం ఒత్తిడి చేసింది. సంఘం పెట్టిన డిమాండ్లన్నింటినీ పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం అంగీకరించింది. సంఘం జిల్లా అధ్యక్షులు సి. మురుగేశన్, కార్యదర్శి ఎస్. జ్ఞానగురు, పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.సి. పాండ్యన్‌ల నాయకత్వంలో వివిధ ప్రజాసంఘాల ప్రతినిధుల తోడు రాగా అరుంధతీయ కుటుంబాలవారు సెప్టెంబర్ 21న ఊరుమ్మడి నీళ్ళ ట్యాంకు దగ్గర స్నానాలు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో చేపట్టిన ఈ ప్రత్యక్ష కార్యాచరణకు విదుతలై చిరుతైగళ్ కచ్చి, అత్తి తమిశరపెడవై, సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, కిసాన్ సభ, వ్యవసాయ కార్మికసంఘం ఇన్స్యూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌లు సంఘానికి బాసటగా నిలిచాయి. వీరి సంఘీభావంతో సాధించిన విజయాలకు ఆయా సంఘాలకు అభినందనలు తెలియచేద్దాం. ఈ ప్రత్యక్ష కార్యాచరణ సాధించిన విజయాల ప్రకంపనలు రాష్ట్రవ్యాప్తంగా అలజడి సృష్టించాయి. అంటరానితనం నిర్మూలనా పోరాటాన్ని మరింత గాఢ్రుతంగా ముందుకు తీసుకువెళ్లేందుకు ఊపునిచ్చాయి.

**(అనువాదం : సత్యరంజన్)**

సెలూన్లలో క్షౌరం చేయించుకోవచ్చని ప్రకటించింది. సెప్టెంబర్ 29న సంఘం రాష్ట్ర కార్యదర్శి జి. నీలమేఘం, పార్టీ జిల్లా కార్యదర్శి అభిమన్ననన్, సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నిపాండ్యన్ తదితరుల నాయకత్వంలో గ్రామ దళితులు మధ్యాహ్నం12 గంటలకు ర్యాలీగా టీ అంగళ్ళు, సెలూన్ల వద్దకు చేరుకున్నారు. అందరి మాదిరిగా ఒకే గ్లాసులో టీ, సెలూన్లలో క్షౌరం సౌకర్యం పొందారు. స్థానిక తహశీల్దార్, పోలీసులు చొరవ తీసుకుని స్థానిక దళితేతరులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములుగా చెయ్యడానికి చేసిన కృషి ప్రత్యేకించి చెప్పుకోదగ్గది.

### మధురైలో క్షౌర వివక్షత

మధురై జిల్లాలోని వాడుప్పి పట్టణ పంచాయతీ పరిధిలో దళితులకు సెలూన్లలో ప్రవేశం లేదు. సంఘం ఈ ఏడాది ఆగస్టునెలలో నిర్వహించిన సర్వేలో దళితులకు క్షౌరం చేయడానికి నిరాకరించే సెలూన్ల జాబితాను రూపొందించి జిల్లా అధికార యంత్రాంగానికి అందజేసాం. అయితే జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవడానికి ముందువెనుకలాడింది. అఖిలభారత రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం నాయకత్వాన సెప్టెంబర్‌లో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలని నిర్ణమయ్యింది.

జిల్లా అధికార యంత్రాంగం క్షౌర వృత్తిదారుల అసోసియేషన్ ప్రతినిధులను పిలిపించి చర్చలు చేసింది. చిట్టచివరికి అసోసియేషన్‌వారు దళితుల డిమాండ్లకు ఒప్పుకున్నారు. అప్పటిదాకా వివక్ష పాటించిన సెలూన్లు అన్నింటా దళితులకు క్షౌరాలు చెయ్యాలని సంఘం ప్రతిపాదించింది. సెప్టెంబర్ 29నే అందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని అధికార యంత్రాంగం స్పష్టం చేసింది.

సెప్టెంబర్ 29న సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. తంగరాజు నాయకత్వంలో ఇతరులకు సెలూన్లలో క్షౌరంచేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### విరుదునగర్‌లో బావి స్నానం

విరుదు సాగర్ జిల్లాలోని వి. ముత్తులింగాపురం గ్రామంలో ఊరుమ్మడి నీటి ట్యాంకు దగ్గర దళితులకూ, అరుంధతీయులకూ స్నానం చేసేందుకు అనుమతి లేదు. ఇక్కడ దాదాపు 70 అరుంధతీయ కుటుంబాలు నివస్తున్నాయి. అధికారులకు ఎన్ని మహాజర్లు ఇచ్చినా సమస్యను పరిష్కరించలేదు. అలాగే శ్మశాన వాటికకు వెళ్ళేదారిన నడవనీక పోవడం, వీరికోసం కేటాయించిన మంచినీళ్ళ ట్యాంకులు నింపక పోవడం, స్కూళ్ళలో మరుగుదొడ్లను దళిత విద్యార్థులతో శుభ్రం చేయించడం వంటి వివక్షతలు పాటించబడేవి ఈ గ్రామంలో. అందుకే శాసనసభ్యులు ఎ. లాజర్ నాయకత్వాన

**చరిత్ర**

# సామ్రాజ్యవాదంపై లెనిన్ సైద్ధాంతిక పోరాటం



**ఎన్.వి.ఎస్. నాగభూషణ్**

సామ్రాజ్యవాదం మీద లెనిన్ అనితర సాధ్యమైనరీతిలో పోరాటం చేశాడన్న సంగతి చరిత్ర ప్రసిద్ధం. ఆ కాలంలో అనగా మొదటి సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధం (1914–18) మొదలైనప్పుడు, ఆయన 'పోరోనిన్' పట్టణంలో వున్నాడు. పోలెండ్ దేశానికి చెందిన ఆ పట్టణం ఆ కాలంలో 'ఆస్ట్రియా–హంగరీ' సామ్రాజ్యంలో భాగంగా ఉంది. రష్యాకు అనతిదూరంలో వుండడం వల్ల, అక్కడి నుండి పార్టీ కామ్రేడ్స్ తనను సంప్రదిచేందుకు రావటానికి వీలుగా వుంటుందనే ఉద్దేశ్యమే ఆయన ఆ పట్టణాన్ని తన నివాస ప్రాంతంగా ఎంచుకోవడానికి కారణం. యుద్ధంలో 'ఆస్ట్రియా–హంగరీ' జర్మనీకి మిత్ర రాజ్యంగా ఉండేది. జార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా లెనిన్ సాగిస్తున్న విప్లవ కార్యక్రమాల అంతరార్థం అర్థంకాని అక్కడి పోలీసులు, ఆయన జార్‌కు అనుకూలంగా గూఢచర్య కార్యక్రమాలు సాగిస్తున్నాడని అనుమానించి, ఆయన ఇంటిని సోదా చేశారు. వ్యవసాయ కార్యక్రమాలమీద ఆయన తయారు చేసుకున్న గణాంక పట్టికల్ని చూసి, అది రహస్య భాష అని భావించిన పోలీసులు, ఆయన్ని అరెస్టుచేసి జైల్లో పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న పోలెండ్, ఆస్ట్రియాలలోగల కొందరు ప్రముఖ వ్యక్తులు ఆయనకు అనుకూలంగా వాదించి, జైలునుండి విడుదల చేయించగలిగారు. దాంతో ఇక ఆయన ఆ ప్రాంతంలో ఉండి కార్యక్రమాలు సాగించడం సాధ్యం కాదని గ్రహించి ఆ దేశాన్ని వదిలి, తటస్థ దేశమైన స్విట్జర్లాండ్ వెళ్ళి, దాని ముఖ్య పట్టణమైన 'బెర్న్'ను తన కార్యకలాపాల కేంద్రంగా చేసుకున్నాడు. అక్కడుంటూ ఆయన యుద్ధ వ్యతిరేక ప్రచారాన్నీ, సిద్ధాంత కృషినీ, వీటితోపాటు పార్టీ కేంద్ర పత్రిక 'సోసియల్ డెమొక్రత్' నిర్వహణ చూస్తూ అమితంగా శ్రమించాడు.

చరిత్రలో ఆ అతిముఖ్యమైన సమయంలో కార్మికవర్గ అంతర్జాతీయతకోసం, యుద్ధానికి వ్యతిరేకంగా ఆయన చేసిన కృషి, ప్రపంచ ప్రజలకు మరువరానిదీ, అపూర్వమైనదీ. పార్టీ కామ్రేడ్లతో కలిసి, ప్రపంచ కార్మికవర్గానికి ఆయన చేసిన ఉద్బోధ గొప్ప సాహసోపేతమైనది. అది ప్రపంచ సామ్రాజ్యవాదులకు ఒక తీవ్రమైన హెచ్చరికగా మారింది. అలాగే అవకాశవాదుల వెన్నులో వణుకు పుట్టించింది. "ఆయుధాలు తిప్పవలసింది ఇతర దేశాలలోని కూలిబానిసలైన మన సోదరుల మీదికి కాదు, మీమీ దేశాలలోని ప్రగతి వ్యతిరేక బూర్జువా ప్రభుత్వాల మీదికి!" అంటూ కార్మికవర్గానికి ఉద్బోధించడమేగాక, 'యుద్ధాలమీద యుద్ధం ప్రకటించమని' ఆయన ఇచ్చిన పిలుపు ప్రపంచమంతటా ప్రతిధ్వనించింది.

ఆయన బెర్న్‌కు చేరిన మరుసటిరోజు, నగరం వెలుపల గల అడవిలో, ఆ ప్రాంతంలో ప్రవాసం వుంటున్న పార్టీ సభ్యులతో జరిపిన సమావేశంలో, యుద్ధం పట్ల బోల్షివిక్కులకు గల సూత్రబద్ధ వైఖరిని వివరించాడు. ఆ యుద్ధం సామ్రాజ్యవాద యుద్ధమనీ, దీన్ని పెట్టుబడిదారీ బూర్జువా వర్గం ప్రారంభించిందనీ, ఇతర దేశాల భూభాగాన్ని గెలుచుకోవాలనే ఉద్దేశ్యంతో రష్యాలోని బూర్జువా వర్గమూ, జారిజమూ ఈ యుద్ధంలోకి అడుగు పెట్టిందనీ, అంతేగాక, పెరుగుతున్న కార్మిక, సకల శ్రామికుల విప్లవాన్ని అణిచివేసే ఉద్దేశ్యం కూడా ఇందులో దాగి వుందనీ ఆయన చెప్పాడు. అవకాశవాదులు కొందరు "మాతృదేశాన్ని రక్షించండి" అంటూ చేసిన విజ్ఞప్తిని ఆయన "సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి" అనే నినాదంతో ఎదుర్కొన్నాడు. సకల శ్రామిక జనుల ప్రయోజనాల్ని వ్యక్తం చేసిన ఈ నినాదం, అంతర్జాతీయ సోషలిస్టు మహాసభల నిర్ణయాలకు అనుగుణమైనది.

యుద్ధం ప్రారంభమైననాటినుండే లెనిన్, అవకాశవాద రెండో ఇంటర్నేషనల్‌కు మారుగా, కొత్తగా మూడో ఇంటర్నేషనల్‌ను ఏర్పరచడానికి ప్రయత్నిస్తూ, బల్గేరియా, హాలెండ్, స్వీడన్, నార్వే తదితర దేశాల్లోని వామపక్ష సోషలిస్టుల్ని సంప్రదించాడు. ఆయన పూనిక మేరకు అంతర్జాతీయ వాదుల మొదటిసభ 1915 సెప్టెంబర్ మొదట్లో స్విట్జర్లాండ్‌లోని 'జిమ్మర్‌వాల్డ్'లోనూ, అటు తర్వాత రెండోసభ 1916 ఏప్రిల్‌లో 'కంథాల్'లోనూ జరిగింది. మొత్తం 11 దేశాలకు చెందిన సోషల్ డెమొక్రాటిక్ పార్టీలు పాల్గొన్న ఈ సమావేశాలలో, మొదటి దాంట్లో 1/5వ వంతుగా వున్న వామపక్ష పక్షీయులు, రెండో సమావేశంనాటికి బలపడి, 1/3వ వంతుగా మారారు. లెనిన్ నినాదాలు అంతకంతకూ జనంలోకి వ్యాపించసాగాయి. ఈ రెండు సమా వేశాల్లోనూ అత్యధికులు సెంట్రిస్టులే అయినప్ప టికీ, యుద్ధంవల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్న తమ తమ దేశాల్లోని కార్మికవర్గం వామ పక్షానికి మారిపోవడంతో, వీరు సోషల్ జాతీయ దురహంకారుల నుండి వేరుపడడానికి ప్రయత్నించి, వారిని తీవ్రంగా విమర్శించారు.

1914 నవంబర్‌లో వెలువరించిన 'సోషియల్ డెమొక్రాట్' 33వ సంచికలో, యుద్ధానికి సంబంధించిన తమ పార్టీ ప్రణాళికను ప్రకటించి, తమ వైఖరిని రష్యాలోనేగాక, ఇతర దేశాల్లోని సోషల్ డెమొక్రాట్ పత్రికలకు ఆయా భాషల్లో అనువాదం చేయించి, ఆయా దేశాల్లోని కార్మికవర్గంలోని వీలైనంత ఎక్కువమంది దగ్గరకు తీసుకువెళ్ళేందుకు కృషిచేశాడు.

యుద్ధానికి వ్యతిరేకంగా తీవ్ర కృషి చేస్తున్న బోల్షివిక్కుల్ని దెబ్బతీసేందుకు బూర్జువాలూ, వారి తాబేదార్లూ రకరకాల నిందా ప్రచారాలు గావించారు. బోల్షివిక్కులు దేశ ప్రయోజనాల్ని పట్టించుకోరనీ, వారికి ఏమాత్రం దేశభక్తి లేదనీ, విషంచిమ్మారు. ఇలాంటివారి బండారాన్ని బయటపెట్టడమేగాక, వారిని ఎదురు దెబ్బకొడుతూ లెనిన్, "మహా రష్యన్ల జాతీయ గర్వం" అనే వ్యాసంలో నిజమైన దేశభక్తి అంటే ఏమిటో వివరించాడు. జాతీయ గర్వభావం వర్గచైతన్యం గల రష్యన్ కార్మికులకు పరాయిది కాదని చెబుతూ ఆయన, మనం భాషనూ, దేశాన్నీ ప్రేమిస్తున్నామనీ, దాని శ్రామిక జన సమూహాలను ప్రజాతంత్ర సోషలిస్టు చైతన్యస్థాయికి లేవనెత్తడానికి చేతనైనంత చేస్తున్నామనీ అన్నాడు. అర్థిక సౌభాగ్యమూ, సత్వరాభివృద్ధి జరగాలంటే, మహా రష్యన్లు ఇతర జాతులమీద సాగించే హింసాకాండ నుండి దేశం విముక్తి చెందాలని ఆయన చెప్పాడు.

> **❝ సామ్రాజ్యవాద యుద్ధంలో జార్ ప్రభుత్వం సైనికంగా గెలవడం కంటే, ఓడిపోవడం ప్రజలకు తక్కువ హానికరమని లెనిన్ స్పష్టం చేశాడు. ఇది జార్ ప్రభుత్వంపైన ప్రజల విజయాన్ని సులభం చేస్తుందనీ, సామ్రాజ్యవాద యుద్ధం నుండి, పెట్టుబడిదారీ బానిసత్వం నుండి విముక్తి పొందడం కోసం కార్మికవర్గం చేసే పోరాటంలో విజయాన్ని సులభం చేస్తుందనీ ఆయన చెప్పాడు.❞**

ఇక సామ్రాజ్యవాద యుద్ధంలో జార్ ప్రభుత్వం సైనికంగా గెలవడం కంటే, ఓడిపోవడం ప్రజలకు తక్కువ హానికరమని ఆయన స్పష్టం చేశాడు. ఇది జార్ ప్రభుత్వంపైన ప్రజల విజయాన్ని సులభం చేస్తుందనీ, సామ్రాజ్యవాద యుద్ధంనుండి, పెట్టుబడిదారీ బానిసత్వం నుండి విముక్తి పొందడం కోసం కార్మికవర్గం చేసే పోరాటంలో విజయాన్ని సులభం చేస్తుందనీ ఆయన చెప్పాడు. కనుక సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని ఓడించే కృషికి ఒక్క రష్యన్ విప్లవకారులు మాత్రమేగాక, యుద్ధం చేసే సకల దేశాలకూ చెందిన కార్మికవర్గ విప్లవ పార్టీలూ పూనుకోవాలని ఆయన పిలుపునిచ్చాడు. అయితే తాము అన్ని యుద్ధాల్నీ వ్యతిరేకించబోమనీ, అధర్మ యుద్ధాన్ని మాత్రమే వ్యతిరేకిస్తాం గానీ, ధర్మయుద్ధాల్ని తప్పకుండా బలపరుస్తామని చెబుతూ, ప్రస్తుతం జరుగుతున్న సామ్రాజ్యవాద యుద్ధం అధర్మయుద్ధమని ఆయన వివరించాడు. అధర్మ యుద్ధాలకు వ్యతిరేకంగా నిశ్చితమైన పోరాటం జరపాలని పిలుపునిస్తూ ఆయన ఇలాంటి పోరాటాలకు వివిధ దేశాలలోని కార్మికుల అంతర్జాతీయ సంఘీభావం ప్రధానపాత్ర వహించాలని గట్టిగా చెప్పాడు.

ఇక సామ్రాజ్యవాద యుద్ధకాలంలో సోషలిస్టు విప్లవాన్ని గురించి లెనిన్ ఒక సమగ్రమైన కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ "యూరప్ సంయుక్త రాష్ట్రాల నినాదం", "శ్రామికవర్గ విప్లవ యుద్ధ కార్యక్రమం" అనే రెండు వ్యాసాలు రాశాడు. వాటిలో ఆయన అనేక పెట్టుబడిదారీ దేశాల్లోగానీ, లేదా విడిగా ఒక పెట్టుబడిదారీ దేశంలోగానీ సోషలిజం విజయం పొందటం సాధ్యం" అనీ, అలాగే "విజయం సాధించిన సోషలిస్టు దేశాల ప్రభుత్వాల్ని, ఇతర దేశాల్లోని పెట్టుబడిదారీ వర్గాలు అణచటానికి ప్రత్యక్షంగా పూనుకొంటాయనీ, అప్పుడు కార్మికవర్గం చేసేది ధర్మయుద్ధం" అనీ రెండు సూత్రీకరణలు చేశాడు. ఆ కాలపు మార్క్సిస్టుల్లో – విడిగా ఒక దేశంలో సోషలిజం విజయం పొందటం అసాధ్యమనీ, అన్ని నాగరిక దేశాల్లోనూ ఒకేసారి సోషలిజం వస్తుందనీ ఒక అభిప్రాయం వుండేది. దీన్ని ఈ సూత్రీకరణలు వ్యతిరేకిస్తున్నాయి. ఆయన తన సూత్రీకరణల్ని రుజువు చేస్తూ, సమగ్రమైన సమాచారంతో తన ప్రఖ్యాత గ్రంథం "సామ్రాజ్యవాదం–పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అత్యున్నత దశ" రాశాడు. ఈ గ్రంథ రచన కోసం ఆయన ఎంతగానో శ్రమించి పరిశోధన చేశాడు. మార్క్సిస్టు మేధావిగా ఆయనకు గల ప్రసిద్ధిని ఈ గ్రంథం మరింత ఇనుమడింపజేసింది. అంతేగాక, సామ్రాజ్యవాదంపై ఆయన చేసిన పోరాటానికి ఇది ఒక గొప్ప పదునైన ఆయుధంగా పనిచేస్తుంది.

లెనిన్ మామూలుగానే ఏ విషయంపై రాయాలనుకున్నా, అందుకు సంబంధించిన అప్పటికే దేశ, విదేశాల్లో వెలువడ్డ ప్రామాణిక సమాచారాన్ని యావత్తూ, తాజాగా ఆ విషయంపై వెలువడ్డ పరిశోధనలతో సహా, అధ్యయనం చేసి గానీ ఏ గ్రంథ రచనకూ పూనుకోడు. అలాగే సామ్రాజ్యవాదానికి సంబంధించిన ఈ నూతన సిద్ధాంత గ్రంథం కోసం కూడా ఆయన తన విలువైన కాలాన్ని నెలల తరబడి వెచ్చించి, ఒక్క నిమిషం కూడా వృధా చెయ్యకుండా శ్రమించి, కృషి చేశాడు. దీనికి సమాంతరంగా పార్టీపనీ ఎలాగూ వుంది. అందునా ఆ కాలంలో అతి దుర్భరమైన ఆర్థిక క్లిష్టపరిస్థితుల్లో జీవిస్తూ ("వ్యక్తిగతంగా నాకు సంబంధించినంత వరకూ డబ్బు సంపాదించాలి. లేకుంటే మేం ఆకలితో మాడి చచ్చిపోతాం... జీవన వ్యయం విపరీతంగా వుంది. బతకడానికి ఏ ఆధారమూ లేదు" అని ఆయనొక ఉత్తరంలో రాశాడు) ఆయన ఈ గ్రంథ రచన పూర్తి చేశాడు.

ఈ గ్రంథ రచనకోసం మొదట ఆయన బెర్న్‌లోని స్థానిక గ్రంథాలయాల్లోనే తన పరిశోధనా కృషిని సాగించాడు. మధ్యలో మరింత మెరుగైన సమాచార సేకరణ కోసం ఆయన 'జూరిచ్' పట్టణానికి వెళ్ళాడు తన భార్య నాద్యతో సహా. అప్పుడు ఆమె కూడా విద్యావిధానంపై ఒక పుస్తకం రాస్తోంది. అందుకోసం బోధనాశాస్త్ర సంబంధమైన ఒక ప్రత్యేక గ్రంథాలయం అక్కడుంది. మొదట ఆయన కేవలం 15 రోజులు అక్కడుండి, తనకు కావలసిన సమాచార సేకరణ చేసుకొని తిరిగి వద్దామని అనుకొని కూడా, జూరిచ్ పట్టణంలో గల గ్రంథాలయాల స్థితిగతులకూ, పని తీరుకూ ముగ్ధుడై, నిండా ఒక సంవత్సరంపాటు అక్కడే వుండి తన పుస్తక రచనను పూర్తిచేశాడు. ఒక్క జ్యూరిచ్ అనే ఏమిటి, యావత్తు స్విట్జర్లాండ్ దేశంలోని గ్రంథాలయాల పనితీరే ఎంతో అద్భుతంగా ఆయనకు కనబడింది. స్విస్ దేశంలోని గ్రంథాలయాలు పుస్తకాల్ని పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడమేగాక, జర్మనీలోగల గ్రంథాలయాలతో సంబంధాలు కలిగివున్నాయి. అందువల్ల ఆనాటి యుద్ధకాలంలో కూడా ఆయన తనకు కావలసిన పుస్తకాల్ని జర్మన్ గ్రంథాలయాలనుండి తెప్పించుకోగలిగాడు. అంతేగాక, తన కృషి మధ్యలో తీవ్ర అనారోగ్యానికి గురై, దూరంగా కొండ ప్రాంతాలకు వెళ్ళిన సమయంలో గ్రంథాలయాల్నుంచి పోస్టుద్వారా గ్రంథాలను తెప్పించుకున్నాడు. అయితే ఇందులోని విశేషమేమంటే, అలా తెప్పించుకునే గ్రంథాలకు పోస్టు ఖర్చులు ఉచితం కావటం! (ఇలాంటి గొప్ప సంస్కృతికి ముగ్ధుడైన లెనిన్, విప్లవానంతరం రష్యాలో ప్రవేశపెట్టబోయే గ్రంథాలయ వ్యవస్థ గురించి తరచు కలలు కనేవాడు. ఆయన కలల్ని ఆయన భార్య నిజం చేసేందుకు ప్రయత్నించింది. విప్లవానంతరం సోవియట్ యూనియన్‌లో ఆమె ఉప విద్యా కమిస్సార్‌గా నియమింపబడినప్పుడు వయోజన విద్య తదితరాలతోపాటు, గ్రంథాలయాల అభివృద్ధికి విశేషంగా పాటుపడింది)

జర్మన్, ఇంగ్లీషు, ఫ్రెంచి, రష్యన్ భాషలకు చెందిన 148 గ్రంథాలనుండీ, 232 వ్యాసాల నుండీ ఎంతో శ్రమించి సమాచారం సేకరించుకొని ఆయన రాసుకున్న నోట్సే 800 పేజీలు కలిగి వుంది. 1916 జనవరి నుండి జూన్ వరకూ కృషిచేసి ఆయనీ గ్రంథాన్ని రచించాడు. ఇప్పుడీ గ్రంథంలోని ముఖ్య విషయాల్ని గమనిద్దాం.

ఈ గ్రంథాన్ని రాయడంలో లెనిన్ ముఖ్యోద్దేశం ఏమంటే, మొదటి సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధ ప్రాంగణంలో ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థయొక్క, దాని అంతర్జాతీయ సంబంధాల యొక్క సమగ్ర చిత్రాన్ని కార్మికవర్గం ముందుంచడం!

1914–18 సంవత్సరాల మధ్య జరిగిన ఈ యుద్ధం ఉభయ పక్షాల విషయంలోనూ సామ్రాజ్యవాద యుద్ధమేనని ఆయన విశ్లేషించాడు. ఈ యుద్ధాన్ని ఆ రాజ్యాలు ఎందుకు ప్రారంభించాయంటే – అదివరకే తమ తమ భాగాల్ని పంచుకుంటూ విభజించిన ప్రపంచాన్ని, తిరిగి పంచుకోవడం కోసం. ఇదివరకు ఇతరుల పరమైన ముక్కల్ని లాక్కోవడం కోసం. ఆ ముక్కల్లో వలసలనూ, ఫైనాన్స్ పెట్టుబడి యొక్క పలుకుబడి ప్రాంతాలనూ ఏర్పరచుకోవడం కోసం. ఈ యుద్ధానికి దిగిన ప్రపంచ వ్యవస్థగా

**"1914-18 సంవత్సరాల మధ్య జరిగిన ఈ యుద్ధం ఉభయ పక్షాల విషయంలోనూ సామ్రాజ్యవాద యుద్ధమేనని లెనిన్ విశ్లేషించాడు. ఈ యుద్ధాన్ని ఆ రాజ్యాలు ఎందుకు ప్రారంభించాయంటే - అదివరకే తమ తమ భాగాల్ని పంచుకుంటూ విభజించిన ప్రపంచాన్ని, తిరిగి పంచుకోవడం కోసం. ఇదివరకు ఇతరుల పరమైన ముక్కల్ని లాక్కోవడం కోసం. ఆ ముక్కల్లో వలసలనూ, ఫైనాన్స్ పెట్టుబడి యొక్క పలుకుబడి ప్రాంతాలనూ ఏర్పరచుకోవడం కోసం అని లెనిన్ చెప్పాడు."**

పెట్టుబడిదారీ వ్యవస్థ, ప్రపంచ ప్రజానీకంలోని అత్యధికులపై వలస పీడననూ, ఫైనాన్స్‌గా గొంతు నొక్కడాన్నీ సాగించే వ్యవస్థగా పెరిగి పోయిందనీ ఆయన విమర్శించాడు. ఆపాద మస్తకం ఆయుధాలు ధరించిన కొద్దిమంది, తమ దోపిడీ సొత్తు పంపకాల కోసం జరుపుతున్న తమ యొక్క ఈ యుద్ధంలోకి ప్రపంచాన్నంతటినీ లాగుతున్నారని చెబుతాడు. అంతేతప్ప, కొంతమంది స్వార్థపరులైన శ్రామికవర్గ నాయకులు ప్రచారం చేస్తున్నట్లు, ఈ యుద్ధం దురాక్రమణదారులైన శత్రువులనుండి రక్షించుకోవడానికి చేసే దేశభక్తితో కూడిన యుద్ధం కాదని స్పష్టం చేస్తాడు. అలాంటి స్వార్థపరులకు కొమ్ముకాసే కౌట్స్కీయిజంలో దాగున్న వాస్తవాల్ని బయటపెట్టడం కోసం కూడా ఈ గ్రంథం ప్రయత్నించిందని ఆయన అన్నాడు.

సామ్రాజ్యవాదపు అంతర్యుద్ధాన్ని తెలుసుకొని, ఆ ధోరణులతో పోరాడటం కార్మికవర్గ పార్టీకి విద్యుక్త ధర్మం కాబట్టి, ఆ పార్టీ బూర్జువా వర్గం చేత దగా చేయబడిన చిన్న ఆస్తిపరుల్నీ, దాదాపు పెటీ బూర్జువా జీవిత పరిస్థితుల్నీ అనుభవిస్తున్న లక్షలాది శ్రామిక ప్రజల్నీ బూర్జువా వర్గంనుండి తమవైపుకు తిప్పుకునేందుకు ఇది అవసరమని చెప్పాడాయన. ఇంతటి ప్రాముఖ్యమున్న ఈ గ్రంథంలో ఆయన ఆయా అంశాల్ని ఎలా రుజువు చేసిందీ క్లుప్తంగా గమనిద్దాం:

పది ప్రకరణాల ఈ గ్రంథంలో "ఉత్పత్తి సాంద్రీకరణా, గుత్త సంస్థలూ" అనే మొదటి ప్రకరణంలో గుత్త సంస్థలు ఎలా ఏర్పడేదీ, వాటి ఫలితాలేమిటీ అనే విషయాల్ని వివరించాడు. పెద్ద పారిశ్రామిక సంస్థల్లో ఉత్పత్తి, అసాధారణ వేగంతో సాంద్రీకరించబడటం వల్ల, కార్మికుల సంఖ్య పెరగడం కన్నా, ఉత్పత్తి సాంద్రీకరణే అధికంగా వుంటుంది. ఈ సాంద్రీకరణే ఒకానొక దశలో నేరుగా గుత్తాధిపత్యానికి దారితీస్తుంది. ఎందుకంటే సంస్థల బ్రహ్మాండమైన పరిమాణమే పోటీకి ఆటంకం గనుక, కొద్దిపాటి పెద్దసంస్థలు తేలిగ్గా ఒక ఒప్పందానికి వస్తాయి. గుత్తాధిపత్యానికి జరిగే ఈ పరివర్తన పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క తాజా ఆర్థిక సంఘటనలో ఒక ముఖ్య ఘట్టమని ఆయన వివరించాడు.

ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలోని అత్యున్నత దశలోని ఒక ముఖ్య లక్షణం ఉత్పత్తి సంయోజనం. అంటే భిన్న పరిశ్రమ శాఖలను ఒకే సంస్థలో బృందీకరించడం. ఇది వర్తకపు ఆటుపోట్లను చదునుచేసి, లాభాల్ని నిస్సందేహం చేస్తుంది. ఇక ఈ గుత్తసంస్థలైన కార్టెళ్ళూ, ట్రస్టులూ వగైరాలు అమ్మకపు షరతుల్నీ, చెల్లింపు తేదీల్ని ఉత్పత్తి సరుకుల పరిణామాల్ని నిర్ణయించడమేగాక, లాభాల్ని కూడా వివిధ సంస్థల మధ్య పంచుతాయి. వీటి సాంద్రీకరణ ఏ స్థాయికి చేరిందంటే, ఒక దేశంలోనేకాక, యావత్తు ప్రపంచంలోని ముడి సరుకుల మూలాలన్నింటినీ బ్రహ్మాండమైన గుత్తసంస్థలు చేజిక్కించుకోవడంతో పాటు, మార్కెట్లను కూడా పంచుకోవడంతో ఆగక, నిపుణుల శ్రమని కూడా గుత్తగొంటున్నాయని ఆయన వివరించాడు. ఇక ఈ గుత్త సంస్థలు బయటి సంస్థలతో పోరాడే విధానాన్ని 'కెస్నర్' అనే అర్థ శాస్త్రజ్ఞుణ్ణి ఉదహరిస్తూ ఇలా వివరించాడు: గుత్త సంస్థలు ముడి సరకుల సరఫరానూ, కార్మికుల సరఫరానూ (ట్రేడ్ యూనియన్లతో పొత్తుద్వారా), సరుకుల సరఫరానూ నిలిపెయ్యడం ద్వారా, ఖాతాలు ఆపెయ్యడం, బహిష్కరణ వగైరా పన్నాగాల ద్వారా తమ పెత్తనానికి లొంగనివాటి గొంతు నొక్కేస్తాయి. ఆధిపత్యమూ, దాంతోపాటు దౌర్జన్యమూ..ఇవే పెట్టుబడిదారీ అభివృద్ధి తాజా దశ యొక్క విలక్షణ సంబంధాలు అంటాడు లెనిన్.

ఈ గుత్త సంస్థల పరిపూర్ణ గుత్తాధిపత్యంలో బాంకులు నిర్వహించే పాత్ర చాలా వుంటుంది. డబ్బు చెల్లించడంలో మధ్యవర్తులుగా వ్యవహరించే బ్యాంకులు, రకరకాల డబ్బు ఆదాయాల్ని పోగుచేసి పెట్టుబడిదారీ వర్గం వశంలో వుంచడమేగాక, తాము అభివృద్ధి అయ్యే క్రమంలో స్వయంగా గుత్తసంస్థలుగా మారతాయనే నిజాన్ని 'బ్యాంకులూ, వాటి కొత్త పాత్ర' అనే రెండో ప్రకరణంలో చూపించాడు లెనిన్. పెద్ద బ్యాంకులు చిన్న బ్యాంకుల్ని విలీనం చేసుకోవడం, వాటి పెట్టుబడుల్లో షేర్లు, హోల్డింగులు కొనడం వగైరా చర్యల ద్వారా వాటిని ఎలా లోబరుచుకొని సొంత బృందంలోకి తెచ్చుకొనేదీ సోదాహరణగా వివరిస్తాడాయన. ఈ విధంగా పెద్ద బ్యాంకులు మధ్యవర్తి పాత్రను అధిగమించి గుత్తాధిపతుల సంఘం అవుతుంది. అలా చెల్లా చెదురుగా వున్న పెట్టుబడిదార్లు ఒకే ఒక సమిష్టి పెట్టుబడిదారుగా మారిపోతారు.

నిజానికి బ్యాంకులు రకరకాల ఆదాయాల్ని పోగెయ్యడంవల్ల అవి పెట్టుబడిదార్లవి మాత్రమే కావు. రూపం దృష్ట్యా ఇవి ఉత్పత్తి సాధనాల సార్వత్రిక పరంపర కలవి, కానీ సారం దృష్ట్యా బడా పెట్టుబడికి, ప్రధానంగా బ్రహ్మాండమైన గుత్త పెట్టుబడికి అనుకూలంగా వున్నాయి. సాంద్రీకరణ ఫలితంగా అన్నిబ్యాంకులూ గుత్తబృందాలవైపు వెళుతున్నందున, బ్యాంకింగ్ బృందాల మీద పెద్ద పరిశ్రమలు ఆధారపడటం ఎక్కువై వాటి గమన స్వేచ్ఛ కుదింపబడుతుంది. తమ డైరెక్టర్లను ఎదుటి సంస్థల బోర్డుల్లో నియమిస్తూ అనుబంధం పెంచుకుంటున్నాయనీ, అలాగే బ్యాంకుల్లో వచ్చిన కొత్త ధోరణివల్ల బ్యాంక్ డైరెక్టర్లు, ఆయా పరిశ్రమల్ని తనిఖీ చేసే బాధ్యతలు కూడా చేపడుతున్నాయని ఆయన తెలిపాడు.

బ్యాంకుల టెర్రరిజం గురించి తరచు పారిశ్రామిక, వాణిజ్య బృందాలు ఫిర్యాదులు చేస్తుంటాయి. పెద్ద బ్యాంకులు హుకుం జారీచేస్తాయి. వాస్తవంలో ఇది పెద్ద పెట్టుబడి పీడన గురించి చిన్న పెట్టుబడి చేసే పాత ఫిర్యాదేనంటాడు లెనిన్. ఈ విధంగా 20వ శతాబ్ది పాత పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కొత్త దానికి, పెట్టుబడి పెత్తనం నుండి ఫైనాన్స్ పెట్టుబడికి మలుపు తిరిగిందంటాడాయన.

ఇక ఫైనాన్స్ పెట్టుబడిదారులు చేసే మోసాలూ, సమాజంపై, ప్రపంచంపై వారు చలాయించే అధికారం గురించి "ఫైనాన్స్ పెట్టుబడీ, ఫైనాన్షియల్ ప్రభుమండలీ" అనే మూడో ప్రకరణంలో చెప్పడం జరిగింది. బ్యాంకులు తమ నిధులలో అధిక భాగాన్ని పరిశ్రమలలో పెట్టాల్సి వస్తుంది. పరిశ్రమల్లో వినియోగించే ఆ నిధులకు యజమానులు పారిశ్రామికులు కాదు, బ్యాంకులే! ఈ విధంగా డబ్బు రూపంలో వుండి, వాస్తవంగా పారిశ్రామిక పెట్టుబడిగా మారిన బ్యాంకు పెట్టుబడినే "ఫైనాన్స్ పెట్టుబడి" అంటాడు. ఈ ఫైనాన్స్ పెట్టుబడి పారిశ్రామికులు వినియోగిస్తూ బ్యాంకులచేత అజమాయిషీ చేయబడతారు.

ఈ ఫైనాన్షియల్ పెట్టుబడిలో "హోల్డింగ్ పద్ధతి"కి అధిక ప్రాధాన్యం వుంది. ఈ పద్ధతి ద్వారా ఫైనాన్షియల్ ప్రభుమండలి సాగించే అరాచకాలెన్నో. సంస్థ అధిపతి కంపెనీని (తల్లి కంపెనీని) అజమాయిషీ చేస్తాడు. ఈ తల్లి కంపెనీ అనుబంధ కంపెనీల (కూతురు) మీద

**"బ్యాంకుల టెర్రరిజం గురించి తరచు పారిశ్రామిక, వాణిజ్య బృందాలు ఫిర్యాదులు చేస్తుంటాయి. పెద్ద బ్యాంకులు హుకుం జారీచేస్తాయి. వాస్తవంలో ఇది పెద్ద పెట్టుబడి పీడన గురించి చిన్న పెట్టుబడి చేసే పాత ఫిర్యాదేనంటాడు లెనిన్. ఈ విధంగా 20వ శతాబ్ది పాత పెట్టుబడిదారీ వ్యవస్థనుండి కొత్తదానికి, పెట్టుబడి పెత్తనం నుండి ఫైనాన్స్ పెట్టుబడికి మలుపు తిరిగిందంటాడాయన."**

రాజ్యం చేస్తుంది. ఈ కూతురు కంపెనీలు ఇతర అనుబంధ కంపెనీల (మనవరాలు) మీద అజమాయిషీ చెలాయిస్తుంది. దీనివల్ల 1 లక్ష పెట్టుబడితో 16 లేదా, 32 లక్షలను అజమాయిషీ చెయ్యవచ్చు. ఈ హోల్డింగ్ పద్ధతి గుత్తాధిపతుల శక్తిని అపారంగా పెంచడమేగాక, శిక్షకు గురికాని మోసాలకు పాల్పడడానికి, రకరకాల జిత్తులకు దిగడానికి వీలు కల్పిస్తుంది. ఎలా అంటే, తల్లి కంపెనీ, కూతురు కంపెనీ విషయంలో చట్టరీత్యా బాధ్యురాలు కాదు. కూతురు కంపెనీ స్వతంత్రమైందిగా ఊహించబడుతుంది. దాని మధ్యస్తం ద్వారా, వారు ఎన్ని ఆటలైనా ఆడవచ్చు. ఈ పద్ధతిని ఉపయోగించని పెద్ద కంపెనీలు అపవాదం మాత్రమే. ఇదే పద్ధతిలో బ్యాంక్‌లు హోల్డింగ్‌లద్వారా విపరీత లాభాలార్జిస్తున్నాయి.

పెట్టుబడి స్వామ్యం విశిష్ట లక్షణం ఏమంటే, పెట్టుబడిని ఉత్పత్తికోసం వినియోగించడం నుండి విడివడి ఉండడమేనంటాడు లెనిన్. దీన్ని వివరిస్తూ ఆయన, డబ్బు పెట్టుబడి పారిశ్రామిక, లేదా ఉత్పాదక పెట్టుబడి నుండి విడివడి ఉండటం, పూర్తిగా డబ్బు పెట్టుబడి మీద వచ్చే ఆదాయంతో జీవించే వడ్డీ జీవి వ్యాపారస్తునుండి పెట్టుబడి నిర్వహణలో ప్రత్యక్ష సంబంధం వున్న వాళ్ళందరి నుండి విడివడి వుండటం అంటాడాయన.

సామ్రాజ్యవాదం, లేక ఫైనాన్స్ పెట్టుబడి పెత్తనం అనేది ఈ వేర్పాటు అపార ప్రమాణాలను అందుకునే పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అత్యున్నత దశ. ఇతర పెట్టుబడి పారిశ్రామిక, లేదా ఉత్పాదక పెట్టుబడినుండి విడివడి వుండటం, పూర్తిగా డబ్బు పెట్టుబడి మీద వచ్చే ఆదాయంతో జీవించే వడ్డీ జీవియొక్క, ఫైనాన్స్ ప్రభుమండలి యొక్క ఆధిక్యం అన్నమాట! ఫైనాన్షియల్‌గా శక్తివంతమైన స్వల్పసంఖ్యాక రాజ్యాలు, అన్నిదేశాలకన్నా మిన్నగా వుండడమన్నమాట! ప్రపంచం మొత్తం ఫైనాన్స్ పెట్టుబడిని చూస్తే, అందులో 80 శాతాన్ని అంతర్జాయ బ్యాంక్ దేశాలైన (బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా, జర్మనీ) నాలుగు దేశాలే కలిగి వున్నాయి. తక్కిన ప్రపంచమంతా ప్రపంచ ఫైనాన్స్ పెట్టుబడియొక్క ఈ నాలుగు స్తంభాలకు రుణగ్రస్తంగానూ, కప్పం కట్టేదిగానూ వున్నదన్న లెనిన్, సరిగ్గా ఈ కారణం వల్ల ఫైనాన్స్ పెట్టుబడి పరాధీనతా, ఫైనాన్స్ పెట్టుబడి లంకెలూ అనే అంతర్జాతీయ సమాహారాన్ని సృష్టించడంలో "పెట్టుబడి ఎగుమతి" నిర్వహించే పాత్ర గురించి నాలుగో ప్రకణంలో వివరిస్తాడు.

పెట్టుబడిదారీ దేశాల్లో ఆ వ్యవస్థ కొనసాగినంతకాలం పోగుపడిన అదనపు పెట్టుబడిని, తమ దేశాల్లోని ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచడానికి ఉపయోగించే బదులు, వెనుకబడిన దేశాల్లోకి పెట్టుబడిని ఎగుమతి చెయ్యడం ద్వారా లాభాల్ని పెంచుకుంటాయి. వెనుకబడిన దేశాల్లో అధిక లాభాలు ఎందుకొస్తాయంటే అక్కడ పెట్టుబడి అరుదు, భూమి, శ్రమ, ముడిసుకులు చౌక గనుక. ఈ పెట్టుబడి ఎగుమతి 20వ శతాబ్ది ప్రారంభం నాటికి అపార ప్రమాణాల్ని అందుకుంది. ప్రపంచంలోని ఎక్కువ దేశాలమీద, జాతులమీద సామ్రాజ్యవాద పీడనకూ, దోపిడీకీ, కొద్దిపాటి సంపన్న దేశాల పెట్టుబడిదారీ పరాన్నజీవనానికీ అది మంచి ఆధారమైంది. ఇక ఈ పెట్టుబడి ఎగుమతుల వల్ల జరిగే పరిణామాలు ఏమిటంటే – అది ఎగుమతి చెయ్యబడిన దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థను అభివృద్ధి చేస్తుంది. ఇక పెట్టుబడి ఎగు మతి చేసే దేశాలైతే, దీర్ఘకాలంపాటు కొన్ని సౌకర్యాలు పొందుతాయి. ఇచ్చిన రుణంలో కొంతభాగం రుణదాత దేశంలో కొనుగోళ్ళ మీదా – ఉదా:– యుద్ధ సామాగ్రి, ఓడలు మొదలుగు వాటిమీద ఖర్చు పెట్టాలన్న షరతు మామూలు విషయం.

ఇక అయిదో ప్రకణంగా "పెట్టుబడిదారీ సంఘాల మధ్య ప్రపంచ విభజన" ఎలా జరిగిం దో వివరిస్తాడు లెనిన్. పెట్టుబడి ఎగుమతులు పెరిగేకొద్దీ, పలుకుబడిగల ప్రాంతాలూ విస్తరించే కొద్దీ, పరిస్థితులు పెట్టుబడిదారీ సంఘాలమధ్య అంతర్జాతీయ కార్టెళ్ళ నిర్మాణంవైపు దారితీస్తా యి. ఇది పెట్టుబడి, ఉత్పత్తుల ప్రపంచీకరణ సాంద్రీకరణలో కొత్త దశ అయిన గుత్త దశ అంటాడాయన.

పెట్టుబడిదారులు ప్రపంచాన్ని పంచుకొనేది ద్వేషంతోకాదు, లాభాలు పొందడానికే. సాంద్రీకరణే వారినలా నిర్బంధిస్తుంది. పెట్టుబడి, బలాల నిష్పత్తిలో వారు లాభాల్ని పంచుకొంటారు. అయితే ఆర్థిక, రాజకీయ స్థాయి మారినప్పుడు, బలం మారుతుంది. ఏం జరుగుతోందో అర్థం చేసుకోవడానికి, బలం మార్పుతో ఏ సమస్యలు పరిష్కరింపబడతాయనేది నిర్ణయిస్తుంది. ఈ మార్పులు శుద్ధ ఆర్థికపరమైనవా, ఆర్థికేతరమా (సైనిక) అనే సమస్య ప్రధానం. దీనివల్ల మనకు తెలిసేదేమంటే, ప్రపంచ ఆర్థిక పంపకం కోసం పెట్టుబడిదారీ సంఘాల మధ్య కొన్ని సంబంధాలు కుదురుతాయని. అయితే దీనికి సమాంతరంగా వలసలూ, పలుకుబడి ప్రాంతాల కోసం జరిగే పోరాటం ఆధారంగా కూటముల మధ్య, రాజ్యాల మధ్య కూడా కొన్ని సంబంధాలు కుదురుతాయని ఆయన చెబుతూ, ఆ విషయాన్ని ఆరో ప్రకరణమైన "గొప్ప రాజ్యాల మధ్య ప్రపంచ విభజన"లో వివరించాడు.

1860కి పూర్వమే ఇంగ్లాండు, ఫ్రాన్స్‌ల మధ్య వలసలున్నప్పటికీ 1860–80కి మధ్య, 1880–1900ల మధ్య అవి బాగా పెరిగాయి. ఫ్రాన్స్‌కూ, జర్మనీకి మధ్య ఈ చివరి 20 సంవత్సరాలలోనే విస్తరణలు పెరిగాయి. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ గుత్త పెట్టుబడిదశకు, అంటే ఫైనాన్స్ పెట్టుబడికి పరివర్తన చెందడం అనేది, ప్రపంచాన్ని పంచుకోవడానికి జరిగే పోరాటం తీవ్రం కావడానికి దారితీసిందని చెప్పాలి. 1876లో మూడు రాజ్యాలకు (అమెరికా, జర్మనీ, జపాన్) వలసలు లేవు. ఫ్రాన్స్‌కు దాదాపు లేవు. కానీ 1914 నాటికి ఈ నాలుగు రాజ్యాలూ 10 కోట్ల జనాభానూ, 14 కోట్ల చదరపు కిలో మీటర్ల భూమినీ సంపాదించాయి. వేగంలో అసమానత్వం ఎక్కువ వుంది. జపాన్, జర్మనీలకంటే, ఫ్రాన్స్ మూడు రెట్లు ఎక్కువ సంపాదించింది. ఫైనాన్స్ పెట్టుబడి కూడా ఎక్కువే.

పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క తాజా దశలోని ప్రధాన లక్ష్యం ఇప్పటికే గాక, భవిష్యత్తు ముడి సరుకుల వనరులన్నింటినీ ఒక బృందం స్వాధీనం చేసుకోవడం! అలా ఒక బృందం స్వాధీనం చేసుకున్నప్పుడు, ఆ గుత్త సంస్థ స్థిరపడినట్లే. అలా ఆ వనరులన్నింటినీ కొనేసి, పోటీదారులను తమతోపోటీ అసాధ్యమయ్యేట్లు చేసుకొంటాయి. అందుకోసం అవి తమ శక్తియుక్తులన్నింటినీ వినియోగిస్తాయి. ఇలాంటి పోటీలో ఎట్టి పరిస్థితుల్లో కూడా వాటికి పూర్తి హామీ ఇచ్చేది వాటి వలస యాజమాన్యాలు మాత్రమే.

ఇలాంటి వాస్తవాల్ని బూర్జువా సంస్కరణ

> **“కొద్ది దేశాల్లో పెట్టుబడి విస్తారంగా పోగుబడటం వల్ల, వడ్డీ జీవులు అనే ఒక వర్గం, ఒక సాంఘిక పొర అసాధారణంగా పెరిగిపోయింది. వీరు ఏ పనీ చెయ్యకుండా, సోమరిపోతుతనమే వృత్తిగా కలిగి వుంటారని చెప్పాలి. సామ్రాజ్యవాదానికి అత్యంత ముఖ్య ఆధారాల్లో ఒకటైన పెట్టుబడి ఎగుమతివల్ల, ఉత్పత్తి నుండి వడ్డీ జీవుల్ని ఏర్పరచి, సముద్రాంతర దేశాల శ్రమనూ, వలసల శ్రమనూ దోపిడీ చేసి బతికే వారిగా, దేశాన్ని మొత్తంగా పరాన్న జీవిగా స్థిరపరుస్తుంది అంటాడు లెనిన్.”**

వాదాలు తగ్గించడానికి ప్రయత్నిస్తాయి. వ్యవసాయ పరిస్థితుల్ని మెరుగుపరచడం వల్ల సరఫరా అధికమై, ధరలు తగ్గుతాయని వీరంటారు. ఇలాంటి వాదనలు సామ్రాజ్యవాదానికి సమర్థనలూ, అలకరించడమూ తప్ప వేరే కాదు. సామాన్య ప్రజల్ని పట్టించుకునే ట్రస్టులెక్కడున్నాయి?

ఇక ఈ గ్రంథంలోని 7వ ప్రకరణం “పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రత్యేక దశగా సామ్రాజ్యవాదం” అనేది. పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాదంగా ఎప్పుడు మారింది? పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క ఉన్నత దశలో – దాని మౌలిక లక్షణాల్లో కొన్ని తద్విరుద్ధ లక్షణాలుగా మారుతున్నప్పుడే, అది సామ్రాజ్యవాదంగా మారిందని అంటాడు లెనిన్. ఈ ప్రక్రియలోని ముఖ్య ఆర్థిక లక్షణం – పెట్టుబడిదారీ నిర్నిబంధ పోటీని తొలగించి, దానిస్థానంలో పెట్టుబడిదారీ గుత్తాధిపత్యం రావడం. భారీ పరిశ్రమలు వచ్చి చిన్న పరిశ్రమల్ని గెంటేస్తుండగా, భారీ పరిశ్రమల స్థానంలో అతి భారీవి వస్తున్నాయి. కార్టెళ్ళూ, సిండికేట్లు, వందల కోట్ల ధనంతో వ్యవహరిస్తుంటే ఏ డజను బ్యాంకులతోనో కలవడం, అలా ఏర్పడ్డ గుత్త సంస్థలు నిర్నిబంధ పోటీని తొలగించక, వాటి ప్రక్కనే వుండి, తీవ్ర ఘర్షణను ఉత్పన్నం చేస్తాయి. గుత్తాధిపత్యం ఏర్పడటమంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ మరింత ఉన్నత వ్యవస్థకు పరివర్తన చెందడమేనంటాడాయన.

ఇక ఈ ప్రకరణంలో 1889–1914ల మధ్య 25 సంవత్సరాలపాటు రెండో ఇంటర్నేషనల్‌కు ప్రధాన సిద్ధాంతవేత్తగా వున్న అవకాశవాది కాట్‌స్కీ ఇచ్చిన సామ్రాజ్యవాద నిర్వచనంలోని తప్పుల్ని ఎత్తిచూపుతూ తీవ్రంగా విమర్శించాడు లెనిన్. కాట్‌స్కీ తన నిర్వచనంలో సామ్రాజ్యవాదం ఇతర దేశాల్లోని వ్యవసాయిక ప్రాంతాల్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొనడాన్ని ఎత్తిచూపుతూ, సామ్రాజ్యవాద దేశాలు ఇతర దేశాల్లోని పారిశ్రామిక ప్రాంతాల్ని కూడా స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించిన సందర్భాల్ని (ఉదా:– బెల్జియంను జర్మనీ, ‘లోరెయిన్’ను ఫ్రాన్స్ కబళిస్తుండటం) ఉదాహరించి, ఖండించాడు.

అలాగే కాట్‌స్కీ పెట్టుబడిదారీ వ్యవస్థలో ‘అధి సామ్రాజ్యవాదం’ అనే కొత్త దశ ఏర్పడుతుందని చెప్పిన విషయాన్ని, అంటే సామ్రాజ్యవాద దేశాలు ఎలాంటి ఘర్షణా లేకుండా, శాంతియుతంగా ప్రపంచాన్ని తిరిగి పంచుకుంటూ, ఏకైక ప్రపంచ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసుకొనే దశ వస్తుందని జోస్యం చెప్పిన విషయాన్ని లెనిన్ అపహాస్యం చేస్తాడు. ఇందుకోసం ఆయన ఆయా సామ్రాజ్యవాద దేశాల్లో ఎలాంటి పోటీ నెలకొనివున్నదీ, అది రానురాను ఎలా తీవ్రమౌతుందీ, ఆయా దేశాల్లోని విపరీత అసమానత కలిగిన అభివృద్ధి రేట్లవల్ల చెలరేగుతున్న భీషణ పోరాటాన్ని సోదాహరణగా చూపిస్తూ కాట్‌స్కీ చెప్పిన కట్టు కథల వెనుక వాస్తవాన్ని ఆయన వివరించాడు. ఇది భయకంపితుడైన వాడు వాస్తవం నుండి లాక్కునే ప్రయత్నం అంటూ ఎద్దేవా చేశాడు.

ఇక సామ్రాజ్యవాదుల పరాన్నజీవనం వల్ల, ఆ వ్యవస్థ క్షీణదశకు రానున్న విషయాన్ని లెనిన్ తన గ్రంథంలోని 8వ ప్రకరణం “పెట్టుబడిదారీ వ్యవస్థ పరాన్నజీవనమూ, క్షీణించడమూ”లో సవివరంగా తెలిపాడు.

కొద్ది దేశాల్లో పెట్టుబడి విస్తారంగా పోగుబడటం వల్ల, వడ్డీజీవులు అనే ఒక వర్గం, ఒక సాంఘిక పొర అసాధారణంగా పెరిగిపోయింది. వీరు ఏ పనీ చెయ్యకుండా, సోమరిపోతుతనమే వృత్తిగా కలిగి వుంటారని చెప్పాలి. సామ్రాజ్యవాదానికి అత్యంత ముఖ్య ఆధారాల్లో ఒకటైన పెట్టుబడి ఎగుమతివల్ల, ఉత్పత్తి నుండి వడ్డీ జీవుల్ని ఏర్పరచి, సముద్రాంతర దేశాల శ్రమనూ, వలసల శ్రమనూ దోపిడీ చేసి బతికే వారిగా, దేశాన్ని మొత్తంగా పరాన్నజీవిగా స్థిరపరుస్తుంది. ఉదాహరణకు 1899లో 80 కోట్ల పౌండ్ల టర్నోవర్ మీద బ్రిటన్‌కు వర్తకం ద్వారా ఆదాయం 2.5 శాతం చొప్పున మొత్తం 180 లక్షల పౌండ్లు రాగా, పెట్టుబడి పెట్టిన వడ్డీ జీవుల ఆదాయం 9 నుంచి 10 కోట్లు, అనగా అయిదు రెట్లు ఎక్కువ. ఇదీ సామ్రాజ్యవాదం యొక్క, సామ్రాజ్యవాదపు పరాన్నజీవనం యొక్క సారం అంటాడు లెనిన్. సరిగ్గా ఆ కారణం వల్లనే సామ్రాజ్యవాదం గురించి చర్చించే ఆర్థిక గ్రంథాల్లో “వడ్డీ జీవిరాజ్యం” అనే మాట వాడుకలోకి వస్తోంది. ప్రపంచమంతా కొద్ది వడ్డీజీవి రాజ్యాలుగా, అత్యధికంగా ఋణగ్రస్త రాజ్యాలుగా విభజితమైపోయింది.

ఇక ఇప్పుడు వడ్డీజీవులు అనుభవిస్తున్న విలాసాల గురించి ఒక ఉదాహరణ చూడండి: బ్రిటన్‌లో అంతకంతకూ ఎక్కువ భూమి వ్యవసాయం నుండి తొలగించబడి, క్రీడలకూ, ధనికుల వినోదాలకీ వినియోగింపబడుతోంది. గుర్రప్పందాలకూ, గుంటనక్కల వేటకు బ్రిటన్ యేటా 140 లక్షల పౌండ్లు ఖర్చు పెడుతున్నారు. ఇలాంటి వడ్డీజీవులు అక్కడ 10 లక్షల మంది వున్నారు. “ది బాంక్” అనే పత్రిక ప్రచురణకర్తా, బూర్జువా రచయితా అయిన లాన్ బర్గ్, జర్మనీ–ఒక వడ్డీ జీవి రాజ్యం’ అనే వ్యాసంలో, “వడ్డీ జీవులుగా మారుతున్న ఫ్రెంచి ప్రజల్ని చూసి జర్మన్లు అసహ్యించుకుంటున్నారుగానీ, బూర్జువాలకు సంబంధించినంతవరకూ, జర్మనీ పరిస్థితి కూడా ఫ్రాన్స్‌లాగానే అంతకంతకూ తయారైంది” అని ఆందోళన వ్యక్తం చేసిన సంగతిని లెనిన్ ఎత్తి చూపించాడు.

ఇక తొమ్మిదో ప్రకరణమైన “సామ్రాజ్యవాద పరిశీలన”లో లెనిన్, ఆ వాదంపట్ల సమాజంలోని వివిధ వర్గాల వైఖరిని పరిశీలిస్తాడు. ఫైనాన్షియల్ ప్రభుమండలి చేసే దౌర్జన్యాలవల్ల, స్వేచ్ఛాయుత పోటీ తొలగించడం వల్ల జరిగే అనర్థాలను చూసీ, సామ్రాజ్యవాదుల ప్రగతి వ్యతిరేకత చూసీ, 20వ శతాబ్ది ప్రారంభం నాటికి దాదాపు అన్ని సామ్రాజ్యవాద దేశాల్లోనూ, సామ్రాజ్యవాదం వల్ల పెటీ బూర్జువా ప్రజాతంత్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయితే కాట్‌స్కీగానీ, అలాంటి ఇతరులుగానీ, ఈ వ్యతిరేకతను మార్క్సిజానికి అనుకూలంగా తిప్పుకోవడానికి బదులు మార్క్సిజాన్నే వదిలేసి వెళ్లిపోయారు! అందుకు కారణం వారికి ఆ సంస్కరణవాదాన్ని ఎదుర్కొనే శ్రద్ధగానీ, శక్తిగానీ లేకపోవడం! ఫలితం వారూ ఆ బూర్జువా సంస్కరణవాదంలో కలిసిపోయారు.

తన సామ్రాజ్యవాద పరిశీలనలో హాబ్సన్, లాన్స్‌బర్గ్ వంటి పలువురు బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు, సామ్రాజ్యవాదాన్ని నిర్నిబంధ పోటీ (స్వేచ్ఛాయుత పోటీ)తోనూ, ప్రజాస్వామ్యంతోనూ పోల్చి, తారతమ్యం చూస్తారు తప్ప, సామ్రాజ్యవాదానికీ, ట్రస్టులకూ మధ్యగల, ఆ కారణంగా సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ వ్యవస్థ పునాదులకూ మధ్యగల సంబంధాన్ని గుర్తించడానికి వెనుదీస్తారు. ఇలాంటి బూర్జువా రచయితల్లో కనిపించే అల్పత్వం, మనకు ఆశ్చర్యాన్ని కలిగించదు. కానీ సామ్రాజ్యవాద యుద్ధం జరుగుతున్న ఈ 1914, 15, 16

(మిగతా 34వ పేజీలో

సిద్ధాంతం

# విప్లవ స్వభావం

**పెట్టు బడిదారీ విధానం నేడు తీవ్ర సంక్షోభంలో ఉంది. యుద్ధాలు, తిరుగుబాట్లు, అలజడులు ఆందోళనలు - ఇవన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ నేడు ఎదుర్కొంటున్న అస్థిరతను తెలియచెబుతున్నాయి. ప్రజలకు ఇప్పుడున్న వ్యవస్థమీద నమ్మకం సన్నగిల్లుతోంది. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉన్నాయి. అంటే విప్లవం రేపోమాపో వచ్చేస్తుందా అని అడగకండి. నేను జోస్యం చెప్పలేను. కాని పరిస్థితులు విప్లవ సాధనకు అనుకూలంగా ఉన్నాయని మాత్రం గట్టి నమ్మకంతో, విశ్వాసంతో చెప్పగలను.**

**డంకన్ హల్లాస్**

'విప్లవం' అనే మాట పరిపరి విధాలా చలామణీలో వుంది నేడు. కానీ నేను 'మార్క్స్' ఉపయోగించిన అర్థంలో, సమూలమైన రాజకీయ ఆర్థిక, సామాజిక మార్పు అనే అర్థంలో ఆ పదాన్ని వాడుతున్నా. మనకు చరిత్ర పాఠాలు చెప్పేటప్పుడు 'నియోలిథిక్ విప్లవం' అన్నమాట వాడుతుంటారు. మానవజాతి ప్రస్థానంలో 'వ్యవసాయం' ఉనికిలోకి రావడంతో గణ జీవితాల్లో పెద్ద మార్పు వచ్చింది. ఆ మేరకు అది విప్లవాత్మకమైన మార్పే. అయితే ఈ విప్లవాత్మక మార్పు సంభవించడానికి కొన్ని వందల ఏళ్ళు పట్టింది. నేను మాట్లాడే విప్లవం సంభవించడానికి సాపేక్షంగా అంత దీర్ఘకాలం పట్టదు. విప్లవం చాలావేగంగా చోటు చేసుకుంటుంది.

'విప్లవం' అన్న మాట వినబడగానే ఉలిక్కిపడేవాళ్ళు అదేదో రాజద్రోహమైనట్లు, నిషిద్ధ పదం విన్నట్లు భావించేవాళ్ళు వున్నారు. ఇదంతా ఒకప్పటి మాట. ఇరవయ్యవ శతాబ్దానికి వచ్చేసరికి 'విప్లవం' అనేమాట వినబడని రోజంటూ లేకుండా పోయింది. రష్యా విప్లవం, చైనా విప్లవం, క్యూబా విప్లవం, వియత్నాం విప్లవం, కొరియా విప్లవం - ఇలా ఇరయ్యవ శతాబ్దం అంతటా విప్లవాల మయం అయిపోయింది. ఉదాహరణకు దక్షిణాఫ్రికానే తీసుకోండి. అక్కడా విప్లవం సంభవించింది. నేనేం తప్పుగా చెప్పడం లేదు. జాత్యహంకార వ్యవస్థ కుప్పకూలిపోవడం అక్కడి సమాజంలోని రాజకీయ ఉపరితల వ్యవస్థలో సంభవించిన మౌలిక మార్పే. అదీ విప్లవమే, కానీ సామాజిక విప్లవం కాదు. విప్లవం రెండు రకాలు. ఒకటి బూర్జువా విప్లవం. రెండవది శ్రామికవర్గ విప్లవం. దక్షిణాఫ్రికాలో సంభవించినది బూర్జువా విప్లవం. కానీ మనం కోరుకోవాల్సింది శ్రామికవర్గ విప్లవం. అలాంటి శ్రామికవర్గ విప్లవం గురించి ఇవాళ నన్ను మాట్లాడమని అడిగారు ఈ సదస్సు నిర్వాహకులు.

విప్లవాల గురించి మనం సాధారణ సూత్రీకరణలు ఏమన్నా చెయ్యగలమా? అదీ సామాజిక-రాజకీయ రంగాలకు సంబంధించి. లెనిన్ ఇప్పటికే మనముందు అలాంటి మూడు సూత్రీకరణలు ఉంచాడు. మొదటి సూత్రం పాత పాలకశక్తులు పాత పద్ధతులతో ఇంకెంత మాత్రమూ ముందుకు కొనసాగలేవు. మరో విధంగా చెప్పుకోవాలంటే విప్లవాల వల్ల పాత వ్యవస్థ నెర్రలిచ్చి పోతుంది. అది కూడా పై స్థాయినుండి. అంటే పాలకవర్గాలు పూర్తిగా సంక్షోభంలో పడిపోతాయి. ఇంక రెండవ అంశం ప్రజారాశులు ఇంకెంతమాత్రం పాత వ్యవస్థలో కొనసాగడానికి సిద్ధంగా ఉండరు. అంటే సమాజంలో వేగవంతమైన రాడికల్ మార్పులు జరగాలని జనం బలంగా కోరుకుంటారు. చివరిదయినా, మూడవ అంశం ముఖ్యమైన అంశం ఏమిటంటే - పీడిత వర్గాలకు తగిన, నిర్మాణాత్మకమైన నాయకత్వ ఆవశ్యకత.

ఇవీ ఏ విప్లవానికైనా కావల్సిన మూడు సూత్రీకరణలు. ఇంతటితో అయిపోలేదు. ఇక్కడే మనం ఆగి ఒకసారి వెనక్కి మార్క్స్ దగ్గరకు వెళ్ళాలి. రాజకీయంగా ఇవన్నీ సరైన నిర్ధారణలే. కాని మార్క్స్ ఏం చెప్పాడు - ఏ సమాజంలో అయినా ఆర్థిక పునాదుల్లో ఎంత వేగంగా మార్పులు వస్తాయో ఉపరితల అంశాలైన రాజకీయ, సైద్ధాంతిక తదాది రంగాల్లో అంత వేగంగా మార్పులు వస్తాయని కదా.

ఇక్కడ మళ్ళీ మనం ఇంతకుముందు చెప్పిన దక్షిణాఫ్రికా ఉదాహరణను తీసుకుందాం. 1978 నుండి 1984 వరకూ దక్షిణాఫ్రికా ప్రధానమంత్రిగా వున్న పీటర్ బోథా అంతకుముందు 1958 నుండి 66 వరకు అంతకన్నా ముందు 1948 నుండి 54 వరకు ప్రధానమంత్రులుగా పనిచేసిన హెడ్రిక్, మలాన్‌లు అనుసరిస్తూ వచ్చిన పాలనా పరంపరను ఎందుకు కొనసాగించలేకపోయాడు. బోథా పరిపాలనా కాలం వచ్చేసరికి జాత్యంహకారాన్ని చట్టపరంగా ఎందుకు రద్దు చెయ్యాల్సి వచ్చింది?



**డంకన్ హల్లాస్ బ్రిటిష్ మార్క్సిస్టు, సోషలిస్టు వర్కర్స్ పార్టీ (యుకె) నాయకుడు. 1925 జన్మించిన హల్లాస్ 2002లో మరణించారు. 1998లో లండన్‌లో జరిగిన సోషలిస్టు మహాసభలో ఆయన చేసిన ప్రసంగ పాఠమీ వ్యాసం.**

ఎందుకంటే- ఏ ఆధిపత్య వ్యవస్థకైనా కీలకం ఆర్థిక స్థితిగతులు. ఇందులో మార్పులు చోటు చేసుకొనే క్రమంలో వ్యవస్థలోనూ మార్పులు వచ్చాయి. సాపేక్షంగా పారిశ్రామీకీరణ పెరగడం, ఫ్యాక్టరీలు - పరిశ్రమలు నెలకొల్పడంతో మార్క్సిస్టు పరిభాషలో చెప్పుకోవాలంటే పాత ఆర్థిక సంబంధాలు దెబ్బతినిపోయాయి. పెట్టుబడి సంచయానికి జాత్యహంకార ఆధిపత్యం ఆటంకంగా మారింది. బడా పారిశ్రామికవేత్తలకు ఇది తలనొప్పిగా పరిణమించింది. పాలకశక్తులలోనే చీలికలు వచ్చాయి. అయితే శ్రామికవర్గ విప్లవాన్ని నిలవరించడానికి పాలకశక్తులు వరుసగా అనేక సంస్కరణలు చేపట్టాయి. అందులో భాగంగానే జాత్యహంకార రద్దు చట్టం తెచ్చారు.

ఇలా మనం ఆర్థిక పునాదిలో వస్తున్న మార్పుల వల్ల ఉపరితలంలో చోటు చేసుకొనే మార్పుల గురించి అనేక ఉదాహరణల ద్వారా వివరించవచ్చు. దీనితోపాటు విప్లవానికి కావల్సిన మరో కీలక అంశం ఏంటంటే భావజాలంలో విప్లవం. అంటే ఎలా ఉంటుందో చూద్దాం: భావజాలంలో చాలా వేగవంతంగా మార్పులు వస్తాయి. అతి సామాన్య ప్రజానీకం కూడా ఈ మార్పులను ఆకళింపు చేసుకోవడం రెండవ అంశం ఇక మూడవది, ముఖ్యమైన అంశం ఏమిటంటే - ప్రజలు మౌలిక సామాజిక మార్పులు కోరుకుంటారు.

ఉదాహరణకు ఫ్రెంచి మహా విప్లవం

> **❝ ఇంక ఇప్పుడు లెనిన్ చెప్పిన మరో సూత్రీకరణ విషయానికి వద్దాం. ఇది కూడా అన్ని రాజకీయ-సామాజిక విప్లవాలకు వర్తిస్తుంది. మొదటిదశ - ప్రతీఘాత శక్తులు తప్ప అందరూ ఐక్యంగా వుండాలి. మనమంతా కొన్ని డిమాండ్లు లక్ష్యాలు ఆధారంగా ఐక్యంగా వున్నాం. వివిధ తరగతుల ప్రజానీకం ఏకం అవుతారు. అయితే ఇది విప్లవం తొలిదశలో కొంతకాలం మేరకే వుంటుంది. ఆ తర్వాత అప్పటి దాకా విప్లవం కావాలని కోరుకున్న వారూ, బలపరిచినవారిలో విభజన రేఖలు ప్రస్ఫుటమౌతాయి. ❞**

1789–96 మధ్య సంభవించింది. కాని దాని ప్రభావం బ్రిటన్‌మీద కూడా పడింది. దేశంలోని చేతివృత్తులవారు (వాళ్ళను కార్మికులు అనలేం. ఎందుకంటే వాళ్ళు అప్పటికి వేతన కార్మికులు కాదు) మేధావులు చాలా ప్రభావితం అయ్యారు. విఖ్యాత కవి వర్డ్స్‌వర్త్ "ఆ ఉషోదయ సజీవంగా వుండడం స్వర్గం కదా! యవ్వనంగా వుండడం మరింత స్వర్గం కదా" అని ఫ్రెంచి మహా విప్లవం మీద కవితాత్మకంగా స్పందించాడు. వర్డ్స్‌వర్త్ విప్లవకారుడు కాదు. మితవాది. ఇంకా చెప్పాలంటే తిరోగమనవాది. తదనంతర కాలంలో అధికార పీఠానికి బాకాగా మారిపోయాడు. అవన్నీ వేరే సంగతులు. కానీ ఒక విప్లవం ఒక తరం మీద బలమైన, గాఢమైన ప్రభావం వేస్తుందనడానికి ఇదొక ఉదాహరణ.

1974–76 మధ్యకాలంలో ముగ్గురు పోర్చుగీసు మహిళలు వెలువరించిన చిన్న బుక్‌లెట్ గుర్తుందా మీలో ఎవరికన్నా. దాన్ని తొలి 'ఫెమినిస్టు' (స్త్రీవాద) పుస్తకంగా ఈనాటికీ గుర్తిస్తుంటారు. ఇందులో మూడు ప్రధాన అంశాలు వున్నాయి–(1) పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు వుండాలి. 1970వ దశకంలోనే ఆ దేశంలో మహిళలు సమాన హక్కులు డిమాండ్ చేయడం నిజంగానే విప్లవాత్మకం (2) గర్భ నిరోధాన్ని చట్టబద్ధం చేయాలి (3) పిల్లల సంరక్షణ కోసం సదుపాయాలు తీసుకురావాలి.

ఈ డిమాండ్ లండన్‌లోనో, పారిస్‌లోనో, బెర్లిన్‌లోనో సంచలనం కాకపోదును. ఆయా దేశాల్లో ఈ డిమాండ్లు సర్వ సాధారణమైనవి కావచ్చు, ఇందులో కొన్ని హక్కులు పూర్తిగా కానీ, పాక్షికంగా గానీ అమలవుతూ కూడా వుండొచ్చు. కాని పోర్చుగల్ దేశంలో ఇది అక్షరాలా సంచలనమే. ఈ పుస్తకం ప్రతులన్నీ అతి స్వల్పకాలంలోనే అమ్ముడైపోయాయి. ఆ తరువాత ఎన్నిసార్లు పునర్ముద్రణ పొందిందో లెక్కలేదు. ఇంక కాపీ ప్రచురణలకు లెక్కే లేదు. ఎందుకని? ఎందుకంటే పోర్చుగీసు విప్లవం తరువాత అక్కడి ప్రజానీకం అప్పటిదాకా అనామోదంగా పరిగణించే అనేక అంశాలను, సంపూర్తిగా ఇష్టపడకపోయినా, ఈ కొత్త భావజాలాన్ని ఆహ్వానించారు. 'ఓరి దేవుడా! ఇదేదో కొత్తగా వుందే... అయినా ఏదైనా సాధ్యమేమో' అని భావించారు.

ఈ పుస్తకం రాసిన ఆడవాళ్ళలో ఒకరిద్దరు పోర్చుగల్ ఉత్తర దిక్కున పర్యటించి నిరక్షరాస్యులైన మహిళలు, వానాకాలం చదువులు వున్న రైతాంగ మహిళలను కలిసి వినేవాళ్ళని చెబుతుంటారు. ఆ రకంగా తమ డిమాండ్లకు శక్తిని కూడగట్టారు. అంటే విప్లవం సిద్ధించడంలో భావజాల రంగంలో పోరాటం కూడా మౌలికమైన ప్రాధాన్యతను సంతరించుకుంటుందని ఈ అనుభవం రూఢీపరుస్తుంది. మనం గుర్తు పెట్టుకోవాల్సిన మరో అంశం కూడా వుంది. అది నాణేనికి రెండోవైపు. విప్లవం విఫలమైనా, పాక్షికంగా విఫలమైనా జనాలు జావగారిపోతారు. నూతన భావజాలం సోదిలోకి లేకుండా పోతుంది. బూజుపట్టిన పాత సిద్ధాంతాలు, భావాలే సరికొత్త రూపాల్లో తలెత్తుతాయి. విప్లవక్రమంలో ఎదురయ్యే ఒడిదుడుకుల ప్రభావం ప్రజల ఆలోచనల మీద పడుతుంది. విప్లవంతో పనిలేకుండా కూడా ఒక్కొక్కప్పుడు భావజాలంలో మార్పులు సంభవిస్తుంటాయి. కాని విప్లవకర పరిస్థితులు నెలకొని వున్నప్పుడు ఈ మార్పులు ఊహించనలవి కానంత వేగంగా చోటు చేసుకుంటాయి.

ఇంక ఇప్పుడు లెనిన్ చెప్పిన మరో సూత్రీకరణ విషయానికి వద్దాం. ఇది కూడా అన్ని రాజకీయ–సామాజిక విప్లవాలకు వర్తిస్తుంది. మొదటిదశ – ప్రతీఘాత శక్తులు తప్ప అందరూ ఐక్యంగా వుండాలి. మనమంతా కొన్ని డిమాండ్లు లక్ష్యాలు ఆధారంగా ఐక్యంగా వున్నాం. వివిధ తరగతుల ప్రజానీకం ఏకం అవుతారు. వసంతకాలం వంటిది ఇది. అయితే ఇది విప్లవం తొలిదశలో కొంతకాలం మేరకే వుంటుంది. ఆ తర్వాత అప్పటిదాకా విప్లవం కావాలని కోరుకున్నవారూ, బలపరిచినవారిలో విభజన రేఖలు ప్రస్ఫుటమౌతాయి. 'చాల్చాలు ఇప్పటికే చాలా చేశారు. ఇంక కట్టి పెట్టండి. ఇప్పటిదాకా వున్నది నిలబెట్టుకుంటే చాలు' అనేవాళ్ళు 'లేదు... లేదు... మనం ఇంకా దూకుడుగా ముందుకు పోవాలి సాధించింది నిలబెట్టుకోవాలంటే అంతకన్నా వేరే మార్గం లేదు అనేవాళ్ళుగా ఇద్దరూ వుంటారు. ముందుకు లాగేవాళ్ళు కొందరైతే, వెనక్కి లాగేవాళ్ళు ఇంకొందరు.

ఇలాంటి లాగుడు పీకుడు వ్యవహారం ముందుకు రావడానికి ప్రజలలో వుండే వర్గ విభజనయే కారణం. విశాలంగా పరిశీలిస్తే ఇప్పటివరకూ చోటు చేసుకున్న ఏ విప్లవమూ నికరమైన శ్రామికవర్గ విప్లవం కాదు. అందులో బూర్జువాలూ, మధ్య తరగతి వర్గాలూ పాల్గొన్నాయి, అదీ తొలి దశలో.

1789 – ఫ్రెంచి విప్లవం సందర్భంగా బాస్టిల్ కోటని ముట్టడించినప్పుడు రాజవంశస్తులు. కులీనవర్గం తప్ప ప్రజలందరూ అందులో భాగస్వాములయ్యారు. ఇంకా చెప్పుకోవాలంటే కులీనవర్గంలో కొందరు కూడా ఇందులో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగాగానీ పాలు పంచుకున్నారు. అయితే అతికొద్ది కాలంలోనే విప్లవశక్తులలో చీలికలు వచ్చాయి. మధ్యేవాదులు (గిరోన్ డిస్ట్‌లు), అతివాదులు (జాకోబియన్లు) మధ్యన విభేదాలు నెలకొన్నాయి. మూడవ దశలో ఈ విభేదాలు బట్టబయలై తరచూ కండబలం ద్వారా పరిష్కరించు కునేందుకు చూసేవారు.

అలాగే పోర్చుగీసు విప్లవం సందర్భంగా చూస్తే ప్రతీఘాత శక్తులు, రహస్య పోలీసులు తప్ప ప్రతి ఒక్కరూ పాత వ్యవస్థకు వ్యతిరేకంగా నిలబడ్డారు. కాని కొన్ని వారాలు గడవకముందే విప్లవంలో విభేదాలు పొడచూపాయి. సి.ఐ.ఎ. (సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఆఫ్ అమెరికా) ఆర్థికంగానూ ఇంకో రకంగానూ మద్దతు ఇచ్చిన సోషల్ డెమొక్రటిక్ పార్టీ, జరిగింది చాలు, ఇక్కడికి ఆపేసి, పరిస్థితులను చక్కదిద్దుకుందాం' అనే వాదన లేవనెత్తింది. పెరుగుదల. ఆ లెక్కన పెరగాల్సి ఉండిన పార్టీ. అదే తీరున పెరిగి ఉంటే ఈ నాటికి బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ప్రజా బాహుళ్య పార్టీగా ఎదిగి ఉండేది. అయితే పరిస్థితుల ప్రభావం వల్ల పార్టీ ఆ స్థాయిలో ఎదగలేక పోయింది. ఇంకా చెప్పాలంటే 70వ దశకం ప్రథమార్ధంలో పార్టీ సంఖ్యాబలం పెరుగుదల వెనక్కు నడిచింది. అంటే పార్టీ సభ్యులను కోల్పోయాం.

ఆ నేపథ్యంలోనే మన 'ఓరియంటేషన్', మన ఎత్తుగడలు మార్చుకున్నాం. 1970వ దశకంలో మనం ఆ పని చయ్యలేకపోయాం. మన ప్రధానమైన కేంద్రీకరణ పారిశ్రామిక పోరాటాల మీదనే ఉండింది. అద్భుతమైన పోరాటాలు జరిగాయి. అయితే పారిశ్రామిక పోరాటాలు వెనుకపట్టు పట్టిన క్రమంలో ఫాసిస్టు

శక్తులు తలెత్తాయి. ఆ రోజున నేషనల్ ఫ్రంట్ అవసరం ముందుకు వచ్చింది. దానితో మనం మన ఎత్తుగడలు మార్చుకోవాల్సి వచ్చింది. మార్చుకున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సరైన నిర్ణయం తీసుకున్నాం. అయితే ఇబ్బందు లన్నీ ఆ తర్వాత మొదలయ్యాయి. ఫాసిస్టుల ప్రమాదం తొలగిపోయాక పార్టీగా, మన వైఖరి, ఎత్తుగడలు మార్చుకోవడానికీ, దానిమీద కేంద్రీకరించి కృషి చెయ్యాలనే అంశం మీద సరైన నిర్ణయాలు తీసుకోవ డానికీ చాలా మంది కామ్రేడ్స్ కలిసిరాలేదు. ఇందుకు భిన్నంగా నాడే మనం తగిన మార్పులకు సిద్ధపడి వుంటే ఈ రోజున బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ప్రజా బాహుళ్య పార్టీగా వుండేది. కాబట్టి సంఖ్యాపరగా కూడా మనం బలం పెంచుకోవాల్సిన పరిస్థితిలో నేడు వున్నాం.

అదీ మన తక్షణ కర్తవ్యం. ఇక్కడ బ్రిటన్‌లో మన పార్టీ, అంతర్జాతీయంగా కమ్యూనిస్టులు, సోషలిస్టులు తమ బలాన్ని పెంచుకోవాల్సిన పరిస్థితులు నెలకొని వున్నాయి నేడు. రానున్న కాలం పోరాటాల కాలం. మన ఎత్తుగడలలో అనేక మార్పులు చోటుచేసుకోవచ్చు. అయితే ఆ మార్పులు ఎలా వుంటాయనేది ఇతమిద్ధంగా ఇప్పుడు నేను చెప్పలేను. ఏ కమ్యూనిస్టుపార్టీ అయినా, నిర్దిష్ట పరిస్థితలకు అనుగుణంగా నిర్దిష్టంగా వ్యవహరిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఇవాళ అనేక పోరాటాలు జరుగుతున్నాయి. ఈ పోరాటాలు మనకు ఎన్నో అనుభవాలు, గుణపాఠాలు ఇచ్చాయి. అయితే మనకు సమస్తం తెలిసివచ్చిందని భావించనక్కర్లేదు. మనం ఊహించని సమస్యలు ఎదురవవచ్చు. పెట్టుబడిదారీ విధానం నేడు తీవ్ర సంక్షోభంలో వుంది. యుద్ధాలు, తిరుగుబాట్లు, అలజడులు ఆందోళనలు – ఇవన్నీ పెట్టుబడి దారీ వ్యవస్థ నేడు ఎదుర్కొంటున్న అస్థిరతను తెలియచెబుతున్నాయి. ప్రజలకు ఇప్పుడున్న వ్యవస్థమీద నమ్మకం సన్నగిల్లుతోంది. 'మా బిడ్డలు మాకన్నా అధ్వాన్నం అయిపోతారేమో' అనే బెంగ దేశంలో (బ్రిటన్) ఎల్లెడలా వ్యాపిస్తోంది. 60 లలో, 70 లలో ఇంతకాన్న మెరుగ్గా వుండేది అని మెజార్టీ ప్రజానీకం భావిస్తున్నారు. అంటే పరిస్థి తులు మనకు అనుకూలంగా వున్నాయనే కదా. అంటే విప్లవం రేపోమాపో వచ్చేస్తుందా అని అడగమాకండి. నేను జోస్యం చెప్పలేను. కాని పరిస్థితులు విప్లవ సాధనకు అనుకూలంగా వున్నాయని మాత్రం గట్టి నమ్మకంతో, విశ్వా సంతో చెప్పగలను.

అయితే అందుకు మనం సిద్ధంగా వున్నామా? అదే మన ముందున్న అసలు సిసలు సమస్య అవకాశాన్ని అందిపుచ్చుకోగల చైతన్య వంతమైన నిర్మాణయుతమైన విప్లవ పార్టీగా మనం అందుకు సిద్ధంగా వున్నాయా? వుండాలి. లేకుంటే తయారవ్వాలి. అందుకోసమే గదా మనం కమ్యూనిస్టులుగా మారింది.

**(అనువాదం – సత్యరంజన్)**

# సామ్రాజ్యవాదంపై లెనిన్ పోరాటం

(31వ పేజీ తరువాయి)

సంవత్సరాలలో కాట్‌స్కీ ఇదే బూర్జువా సంస్కరణవాదాన్ని చేపట్టి, శాంతి సమస్యను గురించి అందరికీ (సామ్రాజ్య వాదులకు, కుహనా సోషలిస్టులకు, సోషల్ శాంతివాదులకూ) అంగీకారం వుందని చెప్పడంతో, ఇంక అతనిలో మార్క్సిజం ఏపాటి మిగిలి వుందన్న ప్రశ్నను లెనిన్ లేవనెత్తాడు. సామ్రాజ్యవాదాన్ని పరిశీలించి, దానిలోని వైరుధ్యాన్ని బట్టబయలు చేయడానికి బదులు, వాటిని తక్కువచేసి తప్పుకునే సంస్కరణవాద 'పవిత్ర అభీష్టం' మాత్రం ఇందులో కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించాడు.

సామ్రాజ్యవాదంలోని అత్యంత ప్రగాఢ వైరుధ్యాలను మరుగుపరచడం సామ్రాజ్యవాదానికి అలంకారమౌతుంది. ఇలాంటి లక్షణమే కాట్స్కీలో వుందని అంటాడు లెనిన్. సామ్రాజ్యవాదం వల్ల స్వాతంత్ర్యం కోసంగాక, ఆధిపత్యం కోసం కృషి సాగించడం మొదలౌతుంది. సామ్రాజ్యవాదానికీ, జాతీయ పీడన అధికం కావడానికీ మధ్యగల సంబంధాన్ని హిల్ఫర్ డింగ్ సరిగ్గానే గుర్తించాడు. అతడంటాడు: "కొత్తగా ద్వారాలు తెరవబడిన దేశాలలోకి దిగుమతయ్యే పెట్టుబడి, వైరుధ్యాన్ని తీవ్రం చేస్తుంది. అది జాతీయ చైతన్యానికి జాగృతమౌతున్న ప్రజల నిత్య ప్రవర్ధమాన ప్రతిఘటనను ఆక్రమణదార్లకు వ్యతిరేకంగా రెచ్చగొడుతుంది... పెట్టుబడిదారీ వ్యవస్థే క్రమంగా పీడన జాతులకు విమోచన సాధనాలనూ, వనరులనూ సమకూరుస్తుంది. పెట్టుబడి నిత్యం సైనిక బలాలను పెంచుకోవడం ద్వారా మాత్రమే తన ఆధిక్యాన్ని నిలుపుకోగలదు" అయితే ఈ మాటలకు మరికొన్ని మాటల్ని కలుపుకోవడం అవసరమంటాడు లెనిన్. "కొత్తగా ద్వారాలు తెరబడిన దేశాల్లోనే కాదు, పాత దేశాల్లో కూడా ఇది జరుగుతుంది" అని.

ఇక ఈ గ్రంథం చిట్టచివరి 10వ ప్రకరణం "చరిత్రలో సామ్రాజ్యవాద స్థానం" గురించి చర్చిద్దాం. గుత్త సంస్థలూ, ప్రభుమండలీ పెత్తనం కోసం పాటుపడడం, కొద్దిపాటి ధనిక, శక్తివంత మైన జాతులు, చిన్న, బలహీన జాతుల్ని దోచు కోవడం అధికం కావడం – ఇవన్నీ సామ్రాజ్య వాదం యొక్క విలక్షణమైన ఎలాంటి గుణాన్ని వుత్పన్నం చేశాయంటే, సామ్రాజ్యవాదాన్ని పరాన్నజీవన పెట్టుబడిదారీ వ్యవస్థగా, వృద్ధిని తగ్గిస్తుందని అనుకోవడం పొరపాటు. సామ్రాజ్య వాద యుగంలో ఒక్కోసారి కొన్ని పరిశ్రమల, బూర్జువా వర్గంలోని కొన్ని పొరలూ, కొన్ని దేశాలూ ఎక్కువగానో, తక్కువగానో వేర్వేరు ధోరణుల్ని వ్యక్తం చేస్తాయి. మొత్తంమీద పెట్టుబడిదారీ వ్యవస్థ వేగంగా పెరుగుతోంది. అయితే ఈ పెరుగుదల అసమంగా వుండి, అత్యంత ధనిక దేశాల్లో (బ్రిటన్) క్షీణతను వ్యక్తం చేస్తోంది.

ఈ గుత్త లాభాలవల్ల పెట్టుబడిదారులు, కార్మికుల్లో కొన్ని విభాగాలకు లంచాలిచ్చి, వారిని ఇతర పరిశ్రమలకు, లేదా ఇతర దేశాలకు వ్యతి రేకంగా తమ దేశంలోని బూర్జువాలకు అనుకూ లంగా తిప్పుకోవడం సాధ్యమౌతుంది. అందు వల్ల సామ్రాజ్యవాదానికీ, అవకాశవానికీ మధ్య బంధం సృష్టించబడింది. సామ్రాజ్యవాద అభివృద్ధి యొక్క లక్షణాలు ముందుగా బయటపడ్డ బ్రిటన్‌లో ఈ బంధం మొట్టమొదట స్పష్టంగా వ్యక్తమైంది.

సామ్రాజ్యవాదపు ఆర్థికసారం మీద ఈ గ్రంథంలో చెప్పిందాన్ని బట్టి, దాన్ని మనం "పరివర్తనలోని పెట్టుబడిదారీ వ్యవస్థ"గా లేదా "మరణోన్ముఖమైన పెట్టుబడిదారీ వ్యవస్థ"గా నిర్వచించాలని లెనిన్ చెప్పాడు. అయితే బూర్జువా ఆర్థికవేత్తలు ఈ నిర్వచనాన్ని అంగీకరించరంటాడాయన. ఒకవంక వారు బ్యాంకులు అసాధారణ వేగం గురించి భయపడుతూనే, "బ్యాంకులు అంతకంతకూ సొంత వ్యాపార నియంత్రణ మీరి పెరుగుతున్నాయి" అని ఆరోపణలు చేస్తూనే, మరోవంక 'వుత్పత్తి సాంఘికీకరణ' గురించి మార్క్సిస్టుల జోస్యం నిజం లేదని విమర్శిస్తారని చెప్పాడు లెనిన్. ఈ విషయాన్ని ఆయన ఇలా విశ్లేషిస్తాడు: ఒక పెద్ద వ్యాపార సంస్థ బ్రహ్మాండమైన పరిమాణం అందుకున్నప్పుడు, సామాజిక సమాచారాన్ని కచ్చితంగా లెక్కగట్టి, దాని ఆధారం మీద కోట్ల మంది ప్రజలకు అవసరమైన దానిలో అత్యధిక శాతం ముడి సరుకుల సరఫరాను పథకం ప్రకారం ఏర్పాటు చేసి, వాటికి అనుకూలమైన వుత్పత్తి స్థలాలకు వేలాది మైళ్ళు సైతం క్రమ పద్ధతిగా పంపించి, రకరకాల చరమ వస్తువుల్ని కోటానుకోట్ల వినియోగదారులకు ఒకే ఒక పథకం ద్వారా పంపిణీ చేసినప్పుడు అప్పుడు అర్థమౌతుంది వుత్పత్తి సాంఘికీకరణ జరిగిందని" అంటాడు లెనిన్. సొంత ఆర్థిక, ఆస్తి సంబంధాలు అనే పై పెంకు ఇప్పుడు దాని లోపలి వస్తువులకు తగినట్లు లేదని, అనివార్యంగా క్షీణించక తప్పదని, దాని తొలగింపును కృత్రిమంగా ఆలస్యం చేస్తే, ఆ పెంకు దీర్ఘకాలం క్షీణ స్థితిలో నిలిచి వుండవచ్చునుగానీ, అనివార్యంగా తొలగించబడుతుందని అంటూ లెనిన్, ప్రపంచ భవిష్యత్తు చిత్రపటాన్ని మనముందుంచాడు.

# జ్యోతి బసు

(2వ పేజీతరువాయి)

భారతీయ విద్యార్థులతో కమ్యూనిస్టు శాఖలను ఏర్పాటు చేశారు. వారి కార్యకలాపాలు రహస్యం గానే జరిగేవి. మార్క్సిజానికి సంబంధించిన సిద్ధాంత ఆచరణలపై బ్రిటీష్ కమ్యూనిస్టు నాయకులను పరిచయం చేసుకున్నారు. వారు బసును అజ్ఞాతవాసానికి వెళ్లి రహస్యంగా పని చేయవలసందిగా సూచించారు. వారి సలహాను ఆయన పాటించారు.

జ్యోతిబసు కలకత్తా హైకోర్టులో బారిస్టరుగా పేరు నమోదు చేయించుకున్నారు. అయితే ఆయన ఏనాడూ లాయర్‌గా ప్రాక్టీసు చేయలేదు. లండన్‌లో ఉండగానే ఆయన పార్టీలో ఫుల్ టైమ్ కార్యకర్తగా పని చేయాలని నిర్ణయించుకున్నాడు. ప్రెసిడెన్సీ కళాశాలలో తనకు ఇంగ్లీషు అధ్యాపకుడుగా పనిచేసిన ప్రొఫెసర్ అనుకుప్ ఘోష్ కుమార్తె విమలా ఘోష్‌ను వివాహం చేసుకున్నాడు. వివాహమైన కొద్దిరోజులకే ఆమె అనారోగ్యంతో మరణించారు. 1941లో బసు తల్లిగారు మరణించారు. నాటి నుంచి బసు పార్టీ కార్యకర్తగా యావత్ కాలాన్నీ వినియోగించడం ప్రారంభించారు. అక్కణ్ణుంచి బసు బెంగాల్ రాజకీయ యవనికపై అంచెలంచెలుగా ఎదిగారు. నాయకత్వ స్థాయి పెరిగింది. 1941-43 మధ్య బెంగాల్, అస్సాం రేల్వే వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. 1944 నుంచి ట్రేడ్ యూనియన్ బాధ్యతలు చేపట్టారు. 1946-47లో బెంగాల్లో సాగిన 'తెభాగ' పోరాటంలోనూ, కార్మిక వర్గ సమ్మెల్లోనూ, మత ఘర్షణల నిరోధంలోనూ గొప్ప పాత్ర వహించారు. 1948లో బెంగాల్‌లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించారు. ఆ సందర్భంగా బసు అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. 1950లో అవిభక్త కమ్యూనిస్టు పార్టీ బెంగాల్ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1953 నుంచి 1961 వరకూ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 1951లో కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. మార్క్సిస్టు పథం నుంచి పక్కకు మళ్లి వక్రమార్గం పట్టిన అవిభక్త కమ్యూనిస్టు పార్టీ జాతీయ కౌన్సిల్ నుంచి 1962లో వాకౌట్ చేసిన 32 మందిలో జ్యోతిబసు ఒకరు. 1964లో సిపిఐ(ఎం) ఏర్పడిననాటి నుంచి పొలిట్‌బ్యూరో సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. 1948, 49, 53, 55, 63, 65 సంవత్సరాల్లో జైలు జీవితం అనుభవించారు.

1970 మార్చి 31 బీహార్ రాజధాని పాట్నా రైల్వే స్టేషన్‌లో జ్యోతిబసు రైలు దిగుతున్నప్పుడు ఓ దుండగుడు ఆయనపై కాల్పులు జరిపాడు. అయితే ఆ సమయంలో సిపిఎం అభిమాని అలీ ఇమాం జ్యోతిబసుతో కరచాలనం చేసేందుకు ముందుకువచ్చారు. దీంతో తుపాకీ గుండు అలీ ఇమాంకు తగిలి ఆయన అక్కడిక్కడే ప్రాణాలు విడిచారు. ఆ సమయంలో జ్యోతిబసు తొణకక బెణకక వుండిపోయారు. ఇమాం ఇంటికి వెళ్లి కుటుంబీకులను ఓదార్చి వారికి తగిన సాయం కోసం ఏర్పాట్లు చేశారు. 1971లో కాంగ్రెస్ దుండగులు జ్యోతిబసుపై రెండుసార్లు దాడికి యత్నించారు. దేశం మొత్తంమీద శాసనసభ్యుడిగా, ముఖ్య మంత్రిగా ఎక్కువ కాలం బాధ్యతలను నిర్వహిం చింది ఆయనే. సాతంత్ర్యానికి పూర్వం ఒకసారి, అనంతరం 11 సార్లు శాసనసభ్యుడుగా పనిచేశారు. 1946లో అవిభక్త బెంగాల్ శాసనసభలోకి అడుగుపెట్టారు. 1946 నుంచి 2000లో పార్లమెంటరీ రాజకీయాల నుంచి స్వచ్ఛందంగా తప్పుకునే వరకూ ప్రతి ఎన్నికల్లోనూ ఆయన విజయ దుందుభి మోగించారు. (1972లో కాంగ్రెస్ అర్ధ ఫాసిస్టు బీభత్సకాండకు పాల్పడి సైన్యం సాయంతో ఎన్నికల్లో రిగ్గింగుకు పాల్పడటాన్ని నిరసిస్తూ పోటీ నుంచి తప్పుకున్నారు) 1957లో బిసి రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రతిపక్ష నేతగా పనిచేశారు. 1967, 69ల్లో పశ్చిమ బెంగాల్‌లో ఏర్పడిన ఐక్య సంఘటన మంత్రి వర్గాల్లో హోంమంత్రిగా, ఉప ముఖ్య మంత్రిగా పనిచేసి భారత రాజకీయ చరిత్రలో రికార్డు సృష్టించారు.

1977లో మొదటిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వెలువరించిన తొలి ప్రసంగంలోనే జ్యోతిబసు తన ప్రభుత్వ స్వభావాన్ని విశదీకరించారు. ప్రజలకు సేవ చేసేందుకు వామపక్ష సంఘటన బాధ్యతలు స్వీకరించింది. అంతేగాని అధికారాన్ని స్వాధీనం చేసుకోలేదు. తన ప్రభుత్వం కేవలం రైటర్స్ బిల్డింగ్ (బెంగాల్ సచివాలయం) నుంచి గాక ప్రజల మధ్య నుంచి పాలన సాగిస్తుంది' అని చెప్పారు. తదనంతర కాలంలో ఆ వాగ్దానాన్ని ఆయన నిజం చేశారు. ఆయన నేతృత్వంలో 'ఆపరేషన్ బర్గా' కింద 14 లక్షల మంది బర్గాదార్ల (కౌలుదార్ల)ను నమోదు చేయించారు. 11 లక్షల ఎకరాల భూమిని శాశ్వతంగా వారి అధీనంలోకి తెచ్చారు. భూమి సాగుచేసేవారి హక్కుకు రక్షణ కల్పించారు. భూ సంస్కరణల చట్టం కింద దాదాపు 13.7 లక్షల ఎకరాల భూమిని సేకరించింది. ఇందులో 10.4 లక్షల ఎకరాలను 25 లక్షల భూ వసతిలేని సాగుదారు కుటుంబాలకు పునఃపంపిణీ చేశారు. దాదాపు ఐదు లక్షల పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. దేశమొత్తం మీద వ్యవసాయ భూమిలో 3.5 శాతం మాత్రమే పశ్చిమ బెంగాల్‌లో వుంది. అయితే భూ సంస్కరణల చట్టం ద్వారా దేశం మొత్తం మీద సేకరించిన భూమిలో దాదాపు 18 శాతం పశ్చిమ బెంగాల్‌లోనే వుండటం చెప్పుకోదగిన విశేషం. దేశవ్యాప్తంగా భూ సంస్కరణల కింద పునఃపంపిణీ చేసిన భూమిలో 20 శాతం బసు నేతృత్వంలోని వామపక్ష సంఘటన ప్రభుత్వంలో పంపిణీ అయింది.

భూ సంస్కరణల వల్ల దళితులు, ఆదివాసులు ప్రధానంగా ప్రయోజనం పొందారు. భూ పునఃపంపిణీలో లబ్దిదార్లలో దాదాపు 55 శాతం, బర్గాదారులుగా నమోదైనవారిలో 42 శాతం ఈ వర్గాలకు చెందినవారే వున్నారు. భూ సంస్కరణలు మహిళా సాధికారిత సాధనంగా కూడా పనిచేశాయి. ఈ పథకం కింద 5.5 లక్షలకుపైగా మహిళలకు వుమ్మడిగా లేదా సొంత పేరున పట్టాలు లభించాయి. 1977 తరువాత ఆహారోత్పత్తి వార్షిక రేటు 6 శాతంగా వుంది. ఇది దేశంలో హెచ్చు జనాభా కలిగిన 17 రాష్ట్రాల్లో కెల్లా అత్యధికం. పశ్చిమ బెంగాల్‌లో 1980-81లో 136 శాతంగా వున్న పంట సాంద్రత 2000-01 నాటికి 180 శాతానికి పెరిగి దేశంలోనే అగ్రస్థానానికి చేరుకుంది. వ్యవసాయ వేతనాలు అన్ని రాష్ట్రాల్లో కెల్లా అత్యధిక స్థాయికి పెరిగాయి. వామపక్ష ప్రభుత్వం వచ్చేనాటికి 57 లక్షలుగా వున్న ప్రాథమిక పాఠశాలల సంఖ్య 1999 నాటికి 1.23 కోట్లకు పెరిగాయి. నివాస ప్రాంతాలకూ, పాఠశాలలకూ మధ్య సగటు దూరం తగ్గింది. ఇక సామాజిక సూచీలు కూడా ఎంతో మెరుగుపడ్డాయి. మైనారిటీలకు సామాజిక భద్రత కల్పించడం, ఆర్థిక తోడ్పాటు అందించడం ముఖ్య కర్తవ్యంగా పెట్టుకొని బసు కృషి చేశారు. ఇందిరాగాంధీ హత్య అనంతరం సిక్కులపై దాడులను నిలువరించడంలోనూ, బాబరీ మసీదు కూల్చివేత అనంతరం యావద్దేశంలో మత కలహాలు చెలరేగినప్పుడు బెంగాల్‌లో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా జ్యోతిబసు పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఆధునిక భారత భావజాలానికి ఆయన అంతగా సన్నిహితమయ్యారు. ఒకప్పుడు మత కలహాలకు నిలయంగా ఉన్న బెంగాల్‌ను మత, సామాజిక సామరస్యానికి ఆశాదీపంగా నిలబెట్టారు. ఆ విధంగా ఆయన దేశానికే ఓ మార్గం చూపిన గొప్ప నేత. శతజయంతి సందర్భంగా ఆ మహా నేతకివే విప్లవ జోహార్లు.

# ప్రణాళికాబద్ధ కృషితోనే వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కోగలం

– టామ్ గీసెన్




వాతావరణ మార్పుల వల్ల భూ గోళం వేడెక్కుతున్నదనేందుకు అనేక రుజువులు కనబడుతున్నాయి. గ్రీన్‌లాండ్, అంటార్కిటాల్లో హిమనదాలూ, మంచూ వేగంగా కరిగిపోతోంది. సముద్ర మట్టం పెరుగుతోంది. సముద్ర జలాల్లో ఆమ్లత్వం పెరిగి సూక్ష్మ వృక్షజీవులైన ప్లాంక్టన్లు 40 శాతం వరకు చనిపోయాయి. మంచు కురవడం ఆలస్యమవుతోంది. తొందరగా మంచుకరిగిపోతోంది.... ఇవన్నీ కూడా భూగోళం త్వరగా వేడెక్కుతున్నదనేందుకు ప్రబల నిదర్శనాలు. ఇవేవీ సిద్ధాంతాలు కావు. నమూనాలు కావు. భౌతిక సాక్ష్యాలు. వీటి గురించి మీడియాలో విపరీతంగా ప్రచారమవుతోంది. మన మంతా గమనిస్తున్నాం.

2020కి ముందుగానే వాతావరణంలోకి ఉద్గారాలను గణనీయంగా తగ్గించేయాలని శాస్త్రీయ, భౌతిక సాక్ష్యాలన్నీ మనకు చెవినిల్లు గట్టుకుని చెబుతున్నాయి. హైడ్రోకార్బన్ ఇంధనాలపై ఇప్పటిలాగే ఆధారపడుతూ పోతే త్వరలోనే మనం ఇంధన కొరతను కూడా ఎదుర్కొనబోతున్నాం. మనకు కొరత లేనంత శిలాజ ఇంధనం ఉందని చెబుతున్నారు. ఫ్రాకింగ్ ఆయిల్స్, తార్‌శాండ్ ఆయిల్స్, లోతైన సముద్రగర్భ ఆయిల్ రూపంలో పెద్ద ఎత్తున నిల్వలున్నప్పటికీ వాటిని డ్రిల్ చేయడం గలీజు పని. వాటిని అభివృద్ధి చేయడానికి విపరీతంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. డబ్బు రూపంలోనే కాదు, వాతావరణ వినాశనం, ఆర్థిక అరాచకాల రూపంలో పెద్ద మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

....

ఏమైనా శిలాజ ఇంధనాల ఉత్పత్తి, భూ తాపం, మన ఆర్థిక వ్యవస్థ.. ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. 1950 నుండి 11 సార్లు చమురు ధరల పెంపుదల షాకులు తగిలాయి. ప్రతిసారీ ఆర్థిక మాంద్యం నెలకొంది. శిలాజ ఇంధనాలు, ఆర్థిక వ్యవస్థ, భూ తాపం ఇవన్నీ కూడా ఒకే సబ్జెక్ట్. ప్రతిదీ మరొక దానిపై ఆధారపడుతుంది.

....

తక్షణం చర్యలు తీసుకోకపోతే ప్రమాదం ముంచుకొస్తుందనేందుకు మన దగ్గర కావలసినంత సమాచారం ఉంది. కానీ మనం చర్యలు తీసుకోవడం లేదు. సైన్సును మనం ప్రేమిస్తాం. ఒక శతాబ్దం లేక కొంత ఎక్కువ కాలంలో మన సమాజాన్ని సాంకేతికంగా మార్చివేసే సాధనంగా దాన్ని ఆరాధిస్తాం. కానీ ఇప్పుడు దాన్ని కూడా మరిచిపోయాం. ఎందుకంటే దాన్ని గనుక గుర్తు చేసుకుంటే మనకు సంక్షోభం కనిపిస్తుంది. సంకట స్థితిని ఎదుర్కొనాల్సి వస్తుంది. అందువల్ల శత్రువును చూసి ఇసుకలో తలదూర్చిన ఉష్ట్ర పక్షిలా బతికేయడానికి అలవాటు పడ్డాం.

......

రానున్న ఇంధన సంక్షోభాన్ని ప్రణాళిక ప్రకారం ఎదుర్కొనడంలో మనం విఫలమైనాం. దానికి బదులుగా మనం ప్రణాళికా రహితమైన అరాచకాన్ని ఎదుర్కొంటున్నాం. వాతావరణ మార్పులు, ఇంధన సంక్షోభ సమస్యలను సీరియస్‌గా తీసుకోవడంలో మనం విఫలమైనాం. సమాచారాన్ని సేకరించి, ప్రణాళికలు తయారు చేసుకుని, వాటిని అమలుచేసే అనుభవశీలులుగా పరిస్థితిని ఎదుర్కోకుండా తప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. ఇప్పుడు నిర్వేదాన్ని కార్యాచరణ జయించాలి.

**(రచయిత అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఓరెగాన్‌లో అధ్యాపకుడు. భూ తాప సైన్సు, సహజ వనరుల విధానంపై పాఠాలు చెబుతారు. ఇంటర్‌నెట్ మ్యాగజైన్ 'జెడ్‌నెట్'కు ఆయన రాసిన వ్యాసం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి.)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.8, No.12, April 2014